ఆంధ్రసచిత్రవార


పత్రిక

దక్షిణాదిగ్రామాలు



25 నయాపైసలు

20-12-63


శ్రీ
సొగసైన
ఒంపులను
తీర్చు....
ఆకర్షణీయమైన
వస్త్రములు
వాయిల్స్
ప్రింట్స్
పాప్లిన్స్
లాన్స్
శ్రీనివాస్
SN/C/33



REVATHI

సాధనా వారి

STUDIO Kothi

తోబుట్టువులు

డైరెక్షన్: C.V. రంగనాథ్ దాస్

మ్యూజిక్: C మోహన్ దాస్

ఆంధ్ర: మహాలక్ష్మి, సీడెడ్: వెంకటేశ్వర, నైజాం-మైసూర్: రాజశ్రీ

ఉత్తరాలు

కెన్నెడీ

జీవకళ ఉట్టిపడే కెన్నెడీ చిత్రం, దాని క్రింద ఆరుద్ర శ్రద్ధాంజలి — చూస్తుంటే కళ్ల నీళ్లు తిరిగాయి. ఒక మహా వ్యక్తికి శ్రద్ధాంజలి ఘటించిన ఆరుద్ర గేయం, నిజంగా ఒక గొప్ప విషాద కావ్యం. ఆరుద్ర అన్నట్లు (కెన్నెడీ గురించి),

"అతణ్ణి చంపిన దురహంకారం
పారిపోయే తోకచుక్క,
అతని సదాశయం దినదినం వెలిగే
వేగుచుక్క."

బి. బి. ఆర్. క్రిష్ణమూర్తి (కాకినాడ)

ముఖచిత్రం

ఈవారం (6—12—63) పత్రికలో కథలు ఏమంత బాగాలేవు. పత్రిక కళ్లా నన్నాకర్షించినవి రెండంటే రెండే రెండు. ఒకటి అట్టమీది బొమ్మ (గిరిజ), చాలా బాగుంది. రెండవది, "ప్రప్రథమ రోదసీ మహిళ వాలెంతీనా తెరెష్కోవా."

రాజారాణి (విశాఖపట్నం)

కథలు

'స్పర్థ' కథ చదివాను. రచయిత చంద్రమౌళి కొత్త పంథాలో వ్రాయాలని కాబోలు అక్కడక్కడా ఉద్దేశ్యపూర్వకంగా తెలంగాణా వాడుక పదాలు పెట్టారు. అయితే ఒక పదాన్ని ఉపయోగించేటప్పుడు దాని అర్థాన్ని పూర్తిగా తెలుసుకొనకుండా, ఫలానా అని అనుకొని ప్రయోగించటం సరికాదు. ఉదాహరణకు, రచయిత 'బేయిమాని' అన్న పదాన్ని మూడు, నాలుగుసార్లు వాడారు.

1. కొత్తోళ్లకు 'మాల్' అందించే పని 'బేఇమాన్'గా తోచింది.

2. ఈ—బేయిమానీ—ఇక సాగనీకు.

3. నీ బానిసోళ్లం. మమ్మల్ని 'బేయిమాన్' చేయకు.

ఈ పై వాక్యాల్లో 'బేయిమాని' అంటే 'అన్యాయం' అనుకుని వాడినట్టున్నారు.

కాని 'బేయిమానీ' అంటే విశ్వాసహీనుడు, నమ్మకద్రోహుడు, 'ఇమాన్' అనే పదం విశ్వాసం, నమ్మకం. ఒక్కోసారి ప్రమాణం కూడా సూచిస్తుంది.

"గిరీశం" (న్యూఢిల్లీ)

*　　*　　*

"పట్టు పరికిణీ" అన్న కథ నన్నెంతో ఆకర్షించినది. పూర్వము "అపార్థం" కథ వ్రాసిన 'ఉమ'గారు, వీరు ఒక్కరేనా అని సందేహము.

పి. శేషమ్మ (హైదరాబాదు)

*ఒకరే.

సీరియల్ కథ


మొదటినుండి జోరుగా హుషారుగా సాగిన నవల అంత్యములో అనుకోని ముగింపు. జానికమ్మ మరణం, ఆమె భర్త, పిల్లలకే కాకుండా నాకు కూడా తీరని విచారాన్ని కలిగించి, మనస్సు వికలమయినది. రచయిత శ్రీ వీరాజీ కలంనుండి వెలువడిన 'ప్రేమకుటగ్గాలు' పిన్నల పెద్దల మెప్పు పొందిదనడములో సందేహములేదు.

కె. వి. యస్. (కాకినాడ)

రక్తదానంచేసి అతడు ఎన్నో నిండు ప్రాణాలను రక్షించెను

1935 సం॥ నాటిమాట. జంషెడ్‌పూర్ పెద్దాసుపత్రిలో ఓ మనిషి చావుబ్రతుకుల్లో వున్నాడు. నెత్తురెక్కిస్తేనే బ్రతికే ఆశవుంది. ఆ కాలంలో రక్తం దానం చేస్తే ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుందని చాలామంది అభిప్రాయపడేవారు. కానీ ఓ యువకుడు మాత్రం తనంతతాను ముందుకువచ్చి రక్తాన్నిచ్చి, పోతున్న ప్రాణాన్ని రక్షించాడు. 1935 నుండి 1955 సం॥వరకు అధమం 40 సార్లయినా - సగటున ఏడాదికి 2 సార్లన్నమాట - రక్తదానంచేసి పారిశ్రామిక ప్రమాదాలకు గురై అపాయస్థితిలో వున్నవారిని రక్షించాడు.

ఈ అసమాన వ్యక్తిపేరు శ్రీ టి. యస్. బాలమ్. టాటా స్టీల్ కంపెనీ, జంషెడ్‌పూర్‌లో ఓ ట్రైపిస్టు. ఎప్పుడూ ఆనందంగా, ఆరోగ్యంగా వుండే యీ 50 ఏండ్ల కుటుంబీకుడు ఇప్పటికీ రక్తదానం చేస్తానంటాడు. కాని వయస్సు మళ్ళుతున్నందున డాక్టర్లు అంగీకరించడంలేదు.





శ్రీ బాలమ్ వంటివారి నిస్వార్థబుద్ధి ఉక్కునగరంలో వుండే అనేకమందిచేత రక్తదానం చేయించింది. అధమం 20,000 మంది టాటా స్టీల్ వుద్యోగులు వారి రక్తాన్ని పరీక్షచేయించుకొని వారి వారి గ్రూపులు తెలుసుకున్నారు. ఇంకా ఎంతోమంది రోజూ వచ్చి వారి రక్తాన్ని పరీక్షచేయించుకొని, ఏ గ్రూపో తెలుసుకుంటున్నారు. ఇలా చేసి వీలైనంతవరకు మరణ సంఖ్యను తగ్గించి ఎన్నో కుటుంబాల దుఃఖాన్ని బాపి చితికిపోకుండా చేస్తున్నారు.

తోటి మానవుల ఎడ గల కనికరానికిది మరొక నిదర్శనం. శ్రామికులంతా ఒకటేయని చాటారు. ఇదే జంషెడ్‌పూర్‌లోని ఉక్కు పనివారి నందరినీ ఏకంచేసిన బంధం. ఈ నగరంలో పరిశ్రమ కేవలం జీవనోపాధి మాత్రమే కాక, జీవిత పథముగూడ అగుచున్నది.

జంషెడ్‌పూర్

ఉక్కు నగరము

జాతీయ రక్షణ నిధికి ఉదారంగా విరాళాలివ్వండి

The Tata Iron and Steel Company Limited

JWTTN 125

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు

*

శుక్రవారం : 20—12—63
శోభకృన్నామ సం॥ పౌష శు॥ చతుర్థి
సంపుటము 56 సంచిక : 16

స్థాపితము :
1908

*

ముఖ్య సంపాదకుడు
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

ఒక సంవత్సరం చందా వివరాలు

ఇండియా : రూ. 13.00 ఇతర దేశాలు : ఓడమీద (Sea Mail) రు. 20.00. (విమానం ద్వార (Air Mail): బ్రిటన్, జర్మనీ, ఇతర యూరోప్, ఆఫ్రికా దేశాలు— రూ. 114.00. అమెరికా రూ. 176.50. ఆస్ట్రేలియా : 135.00.)

*

విడి ప్రతి : 25 న.పై.
సంవత్సర చందా : 13-0-0.

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7. తంబుచెట్టి వీధి, మద్రాసు-1



వి. సరోజాదేవి.

మనలోమాట

సకాలంలో అందలేదు కాబట్టి ఈవారం ఆంధ్రసచిత్రవారపత్రికలో 'రాజధాని కబుర్లు' ప్రచురించలేక పోతున్నాము.

* * *

ఆసియాకథ కూడా ఈసంచికలో వెయ్యటం లేదు. వచ్చేవారం, యోసె. వి. అయాలా రచించిన 'చక్రం' అనే కథ వేస్తున్నాము.

* * *

అదే సంచికలో క్రిస్టిన్ కీలర్ కి సంబంధించిన శీర్షిక ఒకటి ప్రారంభం అవుతుంది. ఈ వారం ఆంధ్రసచిత్ర వారపత్రిక తయారవుతూ ఉండగా మిస్ కీలర్ ని జయిలుకి పంపించారనే వార్త వెలువడింది!

* * *

సరాగమాల పోటీ ఫలితాలు 'సంక్రాంతి ప్రత్యేక సంచిక'లో ప్రకటిస్తాము...

* * *

రచయితలు తమ రచనలు పంపే కవర్లమీద 'సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక' అని మాత్రమే వ్రాయాలి; వ్యక్తుల పేర్లు వద్దని మనవి. అంతేకాక రచనలు 6, 7 తంబుచెట్టి వీధికి పంపాలి. ఇతర చిరునామాలకు పంపరాదు!


ఇటీవల కొందరు తాము కొన్ని రచనలు చేశామనీ, కావలిస్తే మా పరిశీలనకు పంపగలమనీ వ్రాస్తున్నారు. ఇది కేవలం వ్యర్థమయిన పని! నేరుగా రచననే పంపి మాకు నచ్చేదీ లేనిదీ తెలుసుకొనవచ్చు! తిప్పిపంపగోరితే తగుమాత్రం పోస్టేజితో స్వంత చిరునామాకల కవరు కూడా జతపర్చాలి. ★

లోకంపోకడ



"అమ్మాయిలకే ఆయనగారు కార్లో జాగా చేసి యిళ్లకు దిగబెడతారు. అదే వారిసంఘసేవ."

విషయానుక్రమణిక


శ్వేత జాత్యహంకారం
సాయం! సాయం! జాన్సన్
అమెరికా
జాన్సన్‌గారూ ఎప్పుడు వస్తారండీ?
అంతఎత్తుకు ఎదిగావయ్యా!
జాన్సన్
ప్లానింగ్ కమిషన్
సత్యాగ్రహం
పి.ఎస్.పి.

ప్రణాళికా వైఫల్యం బాధ్యత నెహ్రూజీది కాదా?

శ్రీకృష్ణ

రొట్టెల్లేవమ్మా అంటే కేక్‌లు తినమందిట. వెనకటికి ఒక ఫ్రెంచి రాణిగారు. ఢిల్లీ బజార్లో పంచదార నిండుకుంది గాని పార్లమెంట్‌లో ఆహార మంత్రిగారు చక్కెర వ్యవహారం సజావుగా ఉందన్నారు. బహుశా మంత్రివర్యులు వాళ్ల ఇంటి సంగతి చెప్పి ఉంటారు. మా విలేఖరితో ఒక పంచదార మిల్లు యజమాని "యీ పంచదార ఎద్దడి మొదలైందిగా తనను బస్తాల కొద్దీ పంచదారకై ఫోనుమీద సతాయించడం జరిగిందని" అన్నారు కూడా.

పాత ఆహారమంత్రి అజిత్‌ప్రసాద్ జైన్ దిగుమతి అదేపనిగా జరగడాన్ని వ్యతిరేకించారు. వాడకందారు కాస్త యిబ్బంది పడాలన్న శ్రీ జైన్ కాంగ్రెసు హయాంలో వాడకందారు ఎంత ఇదౌతున్నారో గమనించే ఉండాలి. 1947 నుంచి 1963 రూపాయ కొనుగోలు విలువ ఎంత దిగజారిందో చూస్తే మంచిది.

* * *

ఆహార ఉత్పత్తి విషయంలో కోట్లకోలది రూపాయలు పరిశోధనలకై ఖర్చయి ఫలితాలన్నీ గ్రంథాలయాల్లో పదిలంగా ఉంచడం జరిగింది. రైతు మాత్రం ఇంకా మొగలాయీ శకంలోనే ఉన్నాడు. కోట్లకొలది రూపాయలు వెచ్చించిన "అధికోత్పత్తి ఉద్యమం" దారి దానిదే—ఒక్క అమెరికా నుంచే 1700 కోట్ల రూపాయల విలువకు ఆహారధాన్యాలు దిగుమతి చేసుకున్నాము.

దేశం, ప్రజలు ఎలా పోయినా సోషలిజం ముందుకి వెళ్లాలిగదా మరి! అంచేత పంచాయతీ రాజ్, సహకార సంస్థలను ముందుకు నెంటుతున్నారు. దీనికి సర్వాధిపత్యం శ్రీ ఎస్. కె. డే గారిది. ఆయనకు నెహ్రూ, శక్తి కన్నా మించిన ఊహాశక్తి ఉంది.

ఆయన మంత్రిత్వశాఖకు ఎసరు వచ్చేసరికి శ్రీ డే గారు తెల్లారేసరికల్లా గ్రామ రక్షక దళాన్ని ఒకదాన్ని లేవదీశాడు. ఆ జాబితాలో గ్రామవాసులంతా ఉన్నారనొచ్చు! ఇది చూసే కాబోలు చైనావాళ్లు పారిపోయారు? దేశ రక్షణకి డే గారి సేవను అద్భుతమంటూ వాక్రుచ్చారు నెహ్రూజీ.

ఆయన దుబారాను ఇక విమర్శకులు కూడా మరిచిపోవడం జరిగింది. గ్రామీణాభివృద్ధి సంఘం 'ఉత్పత్తి' నేమాత్రం పెంచలేకపోయినా ప్రణాళికా సంఘం కిమ్మనలేదు. ఏమంటే, నెహ్రూగారికేమన్నా నచ్చదు.

ఏ పంట వేస్తే తన పొలం అత్యధికంగా పండుతుందో రైతుకే తెలుస్తుంది కదా.

1944 లో అధికోత్పత్తి ఉద్యమం నెరపితే అప్పుడు నీలిమందు, చెరకుల ఉత్పత్తి ఈ విషయాన్ని ఋజువు చేసింది కూడా. చెరకు పంట పెంచండి అంటూ ఉద్యమం లేదు గాని, అది పెరుగుతూనే ఉంది. ఎందుకని? దానివల్ల రాబడి రైతుకు బాగా వస్తుంది. ధరల నిర్ణయం ద్వారా ఉత్పత్తిని అధికం చేయాలనే విధానం గనుక అవలంభిస్తే బహుశా లక్షల కొలది రూపాయలు ఆదా అవుతాయేమో దేశానికి. ఉత్పత్తి దెబ్బ తినడానికి ప్రణాళిక సంఘం వాతావరణంమీద నెపం వేసింది. లేదా వాతావరణం బాగుంటే రైతే ఎక్కువ తినేస్తాడంటారు. లేదా ప్రజల సగటు తిండీ పెరిగింది అని లెక్కలు సరిపెట్టవచ్చును.

* * *

సరే నెహ్రూజీ. పరిపాలనా యంత్రాంగాన్ని నిందవేస్తారు. వారు పదవి నలంకరించింది మొదలు ఈ నిందవేస్తూనే వున్నారు. అలాగే వారు 'సర్వీసస్' శాఖలను కూడా ఆయన వెగటుగా చూస్తారు. ఆయన దృష్టిలో ఒక ఇంజనీర్ 20 మంది 'సివిలియన్'లకు సమానమని ఆయన అభిప్రాయము — భారత ప్రభుత్వంలో కార్యదర్శిగా అవడమే ఇంజనీర్‌కు అందని కలగాని మన దేశంలో ఒక యింజనీర్‌ను గవర్నరుగా కూడా చేశారు. పోతే ఇంజనీర్లు కూడా సివిల్ ఉద్యోగులే కదా!

భారత సివిల్ సర్వీసును నెహ్రూగారు పదిహేను సంవత్సరాలుగా కోంపడుతూ ఉన్నా దేశ పరిపాలనా యంత్రాంగాన్ని నడుపుతున్నది వాళ్ళే.

* * *

కాని ఒక్క కాంగ్రెసు వ్యక్తి మాత్రం గట్టి గుండెకలవాడు గనుక కుండబద్దలు కొట్టినట్లు పార్టీకి "నెహ్రూజీయే ప్రణాళికా వైఫల్యానికి అసలు కారణమని" చెప్పాడు. ఆయన శ్రీ హనుమంతయ్య. ఇక పరిపాలనా విధానం విషయంలో శ్రీ నెహ్రూగారు వాణిజ్య పరిశ్రమల పాలనా యంత్రాంగాన్ని పాడుచేశారు. వారి విషయములో తననిర్ణయం తేల్చుకో; లేక చెప్పగల తీరికలేకో మానేస్తే ఇబ్బందిపడేది దేశమే.

ఆహార విషయంలో ఆయన మంత్రిత్వ విభాగాలు చేశారు. అవి దేశం డబ్బు తింటున్నాయే తప్ప సమన్వయం కుదుర్చుకోలేకపోతున్నాయి. ఈ 'మంత్రిమండలి' అనేది దర్బార్ వ్యవహారంగా ఉంది. ఒకసారి శ్రీ డే గారికి ఉద్వాసన చేస్తారనుకున్నారు గాని ఆయన గట్టివాడు జాగర్తపడ్డాడు. వ్యవసాయ వ్యవహారాలకు చెందినంతవరకూ ఎక్కడ లోపముందో నెహ్రూజీకే తెలుసు. రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ వ్యవహారాలను చూసే మంత్రివర్యులంతా ఏకఛత్రాధిపత్యం క్రిందకి రావాలని ఆయనకు సూచన కూడా చెయ్యడం జరిగింది.



అమెరికా నూతన అధ్యక్షుడు శ్రీ లిండన్ జాన్సన్.

అందుకు మారుగా ఆయనొక 'మండలి' (బోర్డు) ని ఏర్పరచారు. దానికి అధికారం బాధ్యత రెండూ లేవు. ప్రణాళిక సంఘం ప్రకారము 3.6 మిలియను ఎకరాలకు చెందగల నీటి వనరుల సౌకర్యాలు నిరుపయోగంగా ఉండిపోయాయని తెలుస్తోంది. దీన్ని వాడుకోలేకపోడానికి కారణం శ్రీ డే గారు గ్రామ రక్షక దళాల నిర్వహణలోనో, లేదా ప్రధాని జన్మదినోత్సవాలలోనో మునిగి ఉండి ఉంటారు.

సమాజ వికాస గ్రామం వ్యవహారాలు చూసిన వాళ్లను శ్రీ డే ఏమాత్రం మభ్యపుచ్చలేకపోయారు ఐనా—ఏం చేస్తాం. శ్రీ డే గారిని ఎవ్వరం కదపలేం! ఎన్నికల దగ్గిర ఆహారం కాదుగా వోట్లు కావల్సింది. అంచేత ఆయన దారి వేరు ★



మీకు ఉల్లాసం ఉత్తేజం కలిగించే కాఫీ యిదే... కాఫీ లాంటిది మరొక పానీయము లేదు ... వెచ్చనిది, స్నేహపూర్వకమైనది. ఏనలేని దాని సువాసన సంపూర్ణ ఆనందాన్నిస్తుంది. త్రాగదలచు కొన్నపుడల్లా కాఫీనే త్రాగండి.

మీ మనస్సు ఎలా వున్నప్పటికీ కాఫీ తృప్తినిస్తుంది


మంచి కాఫీని తయారుచేయటం అతి తేలిక. ఉచిత కరపత్రం కోసం మాకు వ్రాయండి. మీకు ఏ భాషలో కరపత్రం కావాలో కూడా వ్రాయండి.



COFFEE BOARD

కాఫీ బోర్డు,
బెంగుళూరు.

సరాగమాల



వి.ఎ.కె. రంగారావు

'పాటకు పల్లవి ఉండాలి, ఆటకు గజ్జెలు ఉండాలి' లాగానే సినిమా పాటలలో సరదా యుగళగీతాలకు శ్రీనివాస్ జమునారాణి కంఠాల కలయిక ఉండాలి. ఈ కలయిక సువర్ణానికి సువాసన అబ్బినట్లు, సాగరం సంతోషంతో ఉబ్బినట్లు అపూర్వంగా, అందంగా ఉంటుంది. ఇంత వరకు శ్రీనివాస్ జమునారాణి యుగళ గీతాలు సినిమాలలో ఎన్నో లేవు. కాని, ఉన్నవన్నీ శ్రేష్ఠమైనవే. ప్రజాదరణ పొందినవే. వాటి చలామణితో నిర్మాతలను, రికార్డు కంపెనీ అధినేతలనూ ఆనంద సముద్రంలో ఓలలాడించినవే.

వీరిద్దరూ కలసి అల్లరిచేసి అందాన్ని సృష్టించిన పాటల్లో వెంటనే జ్ఞాపకం వచ్చేది "దక్కెనులే నీకు నా సొగసు, నీ టక్కులన్నీ తెలుసూ". జమునారాణి కంఠం చిరు అగరునకు శ్రీనివాస్ చిరుతీపి పెట్టిన అందాలు వింటేనే గాని తెలియవు. శ్రీ శ్రీ సాహిత్యంలో కనబడేదంతా చిలిపి వలపు రేపే తీపి తలపులే. మధ్య మధ్య జమునా రాణి "ఊఁహూఁ" అంటే శ్రోతల యెదలలో నూరు కోకిలలు ఒకేసారి "కూ" అంటాయి". శ్రీనివాస్ మంద్రమైన సంగతులు వింటే శ్రోతల మనసులు మై మరచి పరవశం చెందుతాయి. (జి. ఇ 35292 ఆత్మబంధువు).

నాలుగు నెలల క్రిందట విడుదలైన "అనుబంధాలు" లో వీరి యుగళగీతం ఒకటున్నది. "ఇద్దరు అనుకొని" అని మొదలయే ఆటోమాటిక్ పెళ్లిపాట యిది. ఈ పాటను వ్రాసింది కొసరాజు. దీనినిబట్టి మీరు ఊహించవచ్చు రచన ఎంత సులభంగా ద్రాక్షాపాకంలా ఉంటుందో. రచనకు ఈడైన వరస కొత్త సంగీత దర్శకుడు ఎం. బి. శ్రీనివాస్‌ది. ఈ వరసలో స్వరాలు సంగీతానివి కావు, యువ ప్రణయానివి అనిపిస్తుంది. ఈ మెట్టులో సంగతులు రాగానివి కావు, అనురాగానికి చెందినవి అని తోస్తుంది. ఆతని చేతిలో ఉన్నది గంధర్వ గాండీవం కాబోలు. వాద్యగోష్ఠి కూడ చాల విసురుగా వింతగా ఉంది. అక్కడక్కడ తళుక్కున మెరిసే ఫ్లూట్ విరుపులు. ఆ విరుపుకి ఒకింత మెరుపు జోడించే వాయులీనాల తానలీల. వింటేనే భలే సరదాగా ఉంది.

ఇందులో కూడ ఇంత అందానికి కారణం శ్రీనివాస్ జమునారాణి కంఠాల మేళవింపే. ఇటువంటి పాటలకు జోడీని మించిన జోడి మరి లేదు. ఈ జోడీ కీడైన జోడీ మరి రాదు. ఆ మేళవింపు రెండు కంఠాలది కాదు జంటతేనె, జున్నుపాలది. కొంటె వయసు, కన్నె మనసుది. లేత వలపు మమత పిలుపుది. ఒకసారి వినండి. ఈ విశేషణాలన్నీ విశేషణాలు కావని మీకే తెలుస్తుంది. (జి. ఇ 35358).

ఈ ద్వయమే యిటీవల ఒక ప్రైవేటు రికార్డు కూడ యిచ్చారు. "ప్రణయసీమా" అనే పల్లవితో పయన మవుతాయి ఈ రెండు కంఠాలు వాద్యానుసరణ పాట మొదట్లో, మధ్యలో చివర ఎంత వేడిగా ఉందనుకున్నారు ? కొంతవరకు స్పానిష్ జిప్సీ డాన్స్ పద్ధతిలో చేయబడింది. ఈ పాట వరస, వాద్యగోష్ఠి. ఈ పాటకు సంగీతం సమకూర్చింది ప్రసిద్ధ వైణికుడు చిట్టిబాబు. విచిత్రమైన ఈ సృష్టికి నిండైన మాటలు జోడించినది ఆనందకుమార్. ఈ పాటలో మాత్రం శ్రీనివాస్ జమునారాణి ప్రభావం ఎంతటిదో వాద్యగోష్ఠిదీ అంతే. జి. ఇ 37544.

* * *

"తెలియ వశమా, పలుక గలమా" అన్న పాట "కీలుగుర్రం" చిత్రంలోనిది. తెరపై పాడినది అంజలీదేవి, ఎ. వి. సుబ్బారావు. తెరవెనుక కృష్ణవేణి (జిక్కి కాదు. ఆనాటి నటీమణి), ఘంటసాల. రచన : తాపీ ధర్మారావు. వరస ఘంటసాల. ఈ అంశాలన్నీ పూర్తిగా ఎవరూ వ్రాయలేదు.

గంధర్వ ప్రశ్నల పోటీ చాలా మందిలో విభిన్న భావాలను రేకెత్తించినట్లుంది. లలిత సంగీతమని సినిమా పాటల గురించి అడిగారేమని ఒకరు వ్రాస్తే, అన్నీ ప్రైవేటు పాటల గురించి, సినిమాలో వినపడిన లలితేతరసంగీతాన్ని గురించి ఎందు కడిగారు అని కొందరు వ్రాశారు. బహుమతుల విషయంలో కూడా ఒకరు, 'అందరి దగ్గరా గ్రామఫోనులు ఉంటాయనుకున్నారు కాబోలు' ని అన్నారు. ఈ గంధర్వ ప్రశ్నల పోటీ ప్రధానోద్దేశం చక్కని సంగీత సాహిత్యాలపై పాఠకులకు శ్రద్ధాసక్తులు కలిగించాలని అటువంటప్పుడు బహుమతులు రికార్డులు అయితేనే సమంజసంగా ఉంటుంది.



జె. జమునారాణి

ఈ పోటీలో పాల్గొన్నవారు, వీలయితే పక్కన వారూ కూడా ఈ పోటీ గురించి మీ అభిప్రాయాలు నాకు తెలియజేయండి. కవరుపై నా పేరే వ్రాసి (గంధర్వ ప్రశ్నలు అని వ్రాయకుండా) పత్రిక కార్యాలయానికి పంపండి.

* * *

రెండు వారాల క్రిందట ప్రఖ్యాత తమిళ సంగీత దర్శకులు జి. రామనాథన్ దివంగతులైనారు. మూకీలు టాకీలుగా మారిన నాటి నుండి నేటి వరకు వారు సుమారు నూరు చిత్రాలకు పైగా సంగీతం సమకూర్చి ఉంటారు. వారి ప్రథమ చిత్రం సగం మూకీ, సగం తమిళ టాకీ అయిన "గాలవరుషి". పూర్తయిన ఆఖరి చిత్రం "దైవత్తిన్ దైవం". వీరు కొన్ని తెలుగు చిత్రాలకు కూడ పనిచేశారు.. "వీరపాండ్య కట్టబ్రహ్మన్న", "ఇన్‌స్పెక్టర్", "ఎరుడు కావాలి", "రాణి రంగమ్మ" మొదలైన చిత్రాలలో సంగీత పరిమళం వారిదే. రెండేళ్ల క్రితం ప్రఖ్యాత తమిళ నేపథ్య గాయకుడు టి. ఎం. సౌందర రాజన్‌ని నాయకునిగా "పట్టినత్తార్" అని భక్తి రస ప్రధాన చిత్రాన్ని స్వయంగా నిర్మించారు. అడ్డమైన పాశ్చాత్య ధోరణులతో పడుతున్న చెవుల త్రుప్పు సంప్రదాయసిద్ధమైన కర్ణాట రాగాలతో వదిలించారు.

జి. రామనాథన్ కర్ణాట సంగీతంలో నిధి. వీరికి తెలిసినంతగా శాస్త్రం ఈనాడు మరే సంగీత దర్శకులకీ తెలియదనటం అందరూ ఒప్పుకోవలసిన మాట. వీరి మరణం దక్షిణదేశ చిత్ర పరిశ్రమకు తీరని వదాఘాతం.

"పట్టినత్తార్" విడుదలైన సమయంలోనే వారిని యింట్లో ఒకసారి కలుసుకున్నాను. వారికి నా తెలుగంత బాగా బోధపడకపోయినా, వారి కర్థమయేటట్లు తమిళం నేను మాట్లాడలేకపోయినా, గంటన్నరసేపు అన్ని పాటల గురించి వాటి రాగాల గురించి విడమరచి చెప్పారు. ఇంకెక్కడి రామనాథన్. మరొక తార రాలిపోయింది. నేటి చిత్ర సంగీత జగతిలో మరో వెలుగు తగ్గిపోయింది. వారి ఆత్మకు శాంతి కలుగుగాక. ★

మద్రాస్ సినీమా వార్తలు

రవిచిత్రవారి "కవలపిల్లలు"

జయంతి స్టూడియోలో అక్టోబరు 27 వ తేదీ ఉదయం ప్రారంభమైంది. ఈ చిత్రంలో సావిత్రి, సంధ్య పండరీబాయి, యస్. వి. రంగారావు, జెమినీ గణేషన్, యం. ఆర్. రాధా, రామారావు, బాలాజీ మొదలగువారున్నారు.

మాటలు, పాటలు: అనిసెట్టి, ఛాయ: కమల్ ఘోష్, సంగీతం: టి. వి. రాజు, నిర్మాత. కంచర్ల మాధవరావు, దర్శకత్వం: తాతినేని ప్రకాశరావు.

* * *

1963 ఫిలింఫేర్ దీపావళిస సంచికలో క్రొత్త పద్ధతిలో ప్రశ్నావళి పోటీ పాఠకులకు అందజేశారు. ఈ పద్ధతిలో ఇదివరకెప్పుడూ ఎవరూ చేయలేదని కూడ ఆ సంచికలో ఉంది. కాని ఆంధ్ర సచిత్రవారపత్రిక 1959 నవంబరులో ఈ విధంగానే నిర్వహించి, వాటి ఫలితాలు కూడ 1960 జనవరి సంచికలో ప్రకటించారు. కాబట్టి ఈ విధంగా క్రొత్త పద్ధతిలో ప్రశ్నావళి పోటీ జరిపించి, పాఠకుల లేదా ప్రేక్షకుల అభిప్రాయ సేకరణ ఆంధ్రసచిత్ర వారపత్రిక మొదట చేసిందని చెప్పాలి.

ఫిలింఫేర్ ప్రశ్నావళి "పోటీ" చూసి అసంఖ్యాక ప్రేక్షకులు ఈ విధంగా ఫలానా సంవత్సరంలో ఆంధ్రసచిత్ర వారపత్రికలో జరిపించారు. ఇదే ప్రథమమని ఫిలింఫేర్‌లో ఉందని, మరి కొందరు ఈ విధంగా ఎందుకు జరిపించకూడదని అడిగేరు.

కాని 14. 11. 1959—13. 1. 1960 తేదీల ఆంధ్రసచిత్ర వారపత్రికలు చూస్తే పాఠకులకు, ప్రేక్షకులకు సందేహం నివృత్తి కాగలదు.

సెట్టుమీద "హైదరాబాద్ మూవీస్"

"ఏమండీ......ఫ్యాక్టరీవాళ్ళు ఏమైన మర్యాదిస్తలేనా?"

"దేముడిలాంటివాళ్ళు! జీతం ముందే ఇచ్చారు! ఇదిగో దీనితోనే గడుపుకోవాలి! మళ్ళీ మూడోనాటికే "అయిపోయిందండీ" అంటూ వస్తే నేనేమి చేయలేను. ఇదండీ......మాడండి—నా శక్తి ఇంతే! ముందే చెప్తున్నా!"

"నేను మట్టుకు అనవసరంగా ఏమి ఖర్చు పెడుతున్నానండీ!

"నువ్వు ఖర్చు పెడుతున్నావని అనలేదే! నా సంగతి నేను చెప్తున్నా! ఇంతకుమించి నాకు శక్తి లేదు!......

ఒరేయ్! హరీ! ఇటురా...... బుద్ధిలేదూ?" (అంటూ రామశేషయ్య హరిని కొడతాడు)

"ఎందుకండీ వాణ్ని కొడతారు?"

"ఎందుకో వాణ్నే అడుగు?"

"ఏరా నాయనా?"

"ఏమోనమ్మా! ఎందుకు నన్ను అనవసరంగా కొడతావు?"

"నోరెత్తావంటే పళ్ళు రాలగొడతాను"

"అసలు విషయం ఏమిటండీ?"

"వీడు స్కూల్లో నా పరువు తీస్తున్నాడు! కన బిడ్డ వాళ్ల దగ్గరల్లా చేబదుళ్ళు తీసుకుంటున్నాడు......!"

"ఏం! బదులు తీసుకుంటే తప్పా?"

"తప్పా! తప్పున్నరా! తీర్చ గలిగిన వాడికిరా బదులు! తీర్చలేనివాడు తీసుకుంటే అది బదులు గాదు. భిక్షం—నా బిడ్డలు భిక్షమెత్తడం నేను సహించలేను! ఉంటే తినాలి. లేకుంటే పస్తుండి చావాలి! ఆత్మ గౌరవాన్ని అమ్ముకుని బ్రతకడం కంటె చావడం మేలు......"

"నువ్వు పెట్టాలేవు...... అడుక్కు తినానివ్వవు......ఛీ! కొంపలో ఒక్క క్షణం కూడ ఉండను!"

"పో! పోయి నా కళ్ళముందే అడుక్కుతిను! అదే నాకు తగిన శాస్తి!"

"అడుక్కు తినడానికి నాకేం ఖర్మ! నాటకాల్లో వేషాలు వేసుకొని బ్రతుకుతాను. జమిందారుగారు రమ్మని ఎప్పటినుంచో కబురు చేస్తున్నారు......అమ్మా! నే నీ ఇంట్లో భిక్షగాడికింద లెక్క! నన్ను పోనీయ్! పదిరాళ్ళు సంపాదించినప్పుడే ఇంటికి తిరిగి వస్తాను! (వెళ్తాడు)

"ఏమండీ! హరి వెళ్ళిపోతున్నాడండీ!"

ఈ సన్నివేశం హైదరాబాద్ మూవీస్ వారి తాజా సాంఘిక చిత్రంలోనిది. ఈ సన్నివేశంలో గుమ్మడి, చలం, హేమలత పాల్గొన్నారు.

ఇంకా ఈ చిత్రంలో జగ్గయ్య, జమున, కన్నాంబ, సూర్యకాంతం, రమణారెడ్డి, గీతాంజలి మొదలగువారున్నారు.

ఈ చిత్రాన్ని నిరుపమాదేవి వ్రాసిన "అన్నపూర్ణా మందిరం" బెంగాలీ నవలాధారంగా తీస్తున్నారు. మాటలు: డి.వి.నరసరాజు, పాటలు: ఆత్రేయ, ఆరుద్ర, సి. నారాయణరెడ్డి, కొసరాజు, సంగీతం: కోదండపాణి, ఛాయ: జె. సత్యనారాయణ, నృత్యం: చిన్ని, సంపత్, కళ: వి. సూరన్న బి. ఏ. దర్శకుడు: సి. యస్. రావు, నిర్మాత: పి. గంగాధరరావు.

"కలియుగ భీముడు"

కలియుగ భీముడు చిత్రాన్ని తెలుగులో భరణీ స్టూడియోలో తయారుచేస్తున్నారు. రచన—అనిసెట్టి, సంగీతం—సామర్తి, కూర్పు—బి. గోపాలం, త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో విడుదల కానున్నది.

* * *

చందమామ ఫిలింస్‌వారి తాజా సాంఘిక చిత్రంలో రైలు సెట్టును ఒక దానిని ఏ. వి. యం. స్టూడియోలో వేసి చిత్రీకరిస్తారు. ఆ రైలు పెట్టెలో యన్. టి. రామారావు, జమున ఉన్నారు. అదే షెడ్యూలులో మరో సెట్టులో రమణారెడ్డి, ధూళిపాళ, రాజశ్రీ పాల్గొంటారు. సి. నారాయణరెడ్డి వ్రాసిన ఒక పాటను ఘంటసాల పాడగా ఎస్. రాజేశ్వరరావుగారి సంగీత దర్శకత్వంలో రికార్డు చేయబడింది. ఆ పాటను రామారావుతో చిత్రీకరిస్తారు.

ఇంకా ఈ చిత్రంలో గుమ్మడి, కాంతారావు, సూర్యకాంతం, శారద, జయంతి, సత్యనారాయణ, పేకేటి మొదలగువారు ఉన్నారు.

ఈ చిత్రానికి మాటలు: పినిసెట్టి, ఛాయ: రహమాన్ అండ్ కె. యస్. ప్రసాద్, కళ: గోడగాంకర్, దుస్తులు: అచ్యుతరావు, స్టిల్స్: నాగరాజారావు, దర్శకుడు: పి. సుబ్రహ్మణ్యం.

జగపతి పిక్చర్సు "ఆత్మబలం"

"అగ్ని సంస్కార్" అనే బెంగాలీ కథ ఆధారంగా తెలుగులో జగపతి పిక్చర్సువారు నిర్మిస్తున్న "ఆత్మబలం" చిత్రం త్వరలో పూర్తి చేసి జనవరిలో విడుదల చేయనున్నారు.

ఈ చిత్రంలో నాగేశ్వరరావు, బి. సరోజాదేవి, జగ్గయ్య, రేలంగి, రమణారెడ్డి, నాగయ్య, చదలవాడ, కన్నాంబ, గిరిజ, హేమలత మొదలగువారు నటిస్తున్నారు.

ఈ చిత్రానికి మాటలు—పాటలు: ఆత్రేయ,

46 వ పేజీ చూడండి



'మూగమనసులు'లో దేవిక

ఎ స తా ల ౩ ౦

దక్షిణాది గ్రామాలు

యం. సుగుణ

దక్షిణాదిన అన్ని ఊళ్లూ, అంటే చిన్న గ్రామాలుకూడా బాగా వృద్ధిచెందేయి. ఇంక పట్నాలూ అవీ అన్నిచోట్లా ఒక్కలాగే ఉంటాయి. మన ప్రక్కకన్నా ఇక్కడి గ్రామాలలో సదుపాయాలు చాలా వున్నాయి ఇక్కడి ప్రభుత్వం కూడా ముందంజే! గ్రామాలలోని ప్రజలు కూడా వారికి చేతనైనంత సదుపాయాలు కల్పించుకుంటారు. అందులో కొన్ని వివరిస్తాను


ఇక్కడి ప్రభుత్వం గ్రామాలలో బావులు త్రవ్వించి, బావి చుట్టూ సిమ్మెంటు చప్టా కట్టించి మూడో నాలుగో గిలకలు, వాటికి ఇనుప గొలుసులు స్థాపించి, నీళ్లు తోడుకునేందుకు బకెట్లు ఆ ఇనుప గొలుసులకి అమరుస్తారు. ఇలా ప్రతి ప్రతి పల్లెలో చూశాను. ప్రభుత్వం కట్టించినవికాక, ధర్మానికని ధనవంతులు కట్టించిన బావులు కూడా ఉన్నాయి. కాని ఇక్కడి ప్రజలకి బావిలోంచి నీళ్లు తోడుకోవాలంటే బద్ధకం. వర్షం పడి ఆ నీళ్లు ఎక్కడయినా నిలవ అయితే జలకాలాడతారు. ఇక్కడి చిన్న పిల్లలకి కూడా ఈత వస్తుంది. ఈ చెరువులు చాలా ఉంటాయి. వీటికి "ఊరిని" అంటారు. కొన్ని చెరువులు ప్రభుత్వం త్రవ్వించినవి కూడా ఉంటాయి. అవి మంచి నీరు త్రాగటానికనే త్రవ్వించుతారు. ఈ మంచి నీటి చెరువుల్లో స్నానం చేయకూడదు. స్నానం చేయకుండా చుట్టూ 'బార్బ్‌డ్ వైర్' కట్టి ఒక ప్రక్క కొంచెం త్రోవ ఉంచుతారు. ఈ చెరువు నీళ్లలో సిమెంటుతో నూతికి పిట్ట గోడ కట్టినట్లు కట్టారు. అందులోంచి నీళ్లు ముంచుకుని, తోడుకునే తీసుకోవాలి. ఇటుప్రక్క ఇన్ని బావులూ అవీ త్రవ్వించినా బావి నీరు వాడరు ఇక్కడి గ్రామ ప్రజలు. ఎందుకంటే వర్షపు నీరే తియ్యగా, రుచిగా ఉంటుందని 'ఊరిని" నీళ్ళే వాడతారు.

ఇటుప్రక్క చెట్టియార్‌లు, ధనవంతులూ,మార్గమధ్యన 'తన్నీర్ పందల్' (మంచి నీళ్ళ పందిరి) కట్టించి ఎండలో పోయేవారికి దాహం ఇస్తారు. ఇవి పెంకుటిళ్ళే కట్టించేస్తారు. కూర్చుని సేద తీర్చుకునేందుకు వీలుగా వరండా కూడా ఉంటుంది. కొన్ని చోట్ల మజ్జిగ కూడా ఇస్తారు. బరువులు మోస్తూ ఎండలో పోతున్న వారికి తలమీదున్న బరువు దించి, సేద తీర్చుకునేందుకు మార్గం మధ్యన రోడ్డుకి అక్కడక్కడ రెండు పెద్ద రాళ్లు నిలబెట్టి, ఆ రెండు రాళ్లమీదుగా ఒక పెద్దరాయిని బ్రిడ్జి మాదిరిగా వేస్తారు. దీన్ని "శ్రమతాంగి" అంటారు. సరిగ్గా తలమీద బరువు ఆ శ్రమతాంగి మీదకి సునాయసంగా జరిపి, అలసట తీర్చుకుని మళ్లీ ఒకరి సహాయం లేకండా బరువుని నెత్తి నెక్కించుకుని వెళ్ళిపోయేందుకు అనువుగా ఉంటాయి. ఇవి సరిగ్గా మనిషెత్తున ఉంటాయి. ఇలా ఎక్కడ పడితే అక్కడ శ్రమతాంగీలు కట్టారు. ఇవి ఎవరేనా కట్టించవచ్చును.

ఇంకపోతే ముఖ్య విషయం — ఇక్కడి పాల సరఫరా కేంద్రా (డైరీఫారమ్)లు. మన ప్రక్క పెద్ద ఊళ్లలోనేకాని మధ్య రకం ఊళ్లలో పాలకి ఇబ్బందే! అందరూ హోటళ్లకి పోసేస్తారు. మనకి కావాలంటే తిప్పలే......ఇక్కడ పాలకి ఇబ్బంది లేదు. ఇక్కడ ఆవులూ, గేదెలూ ఉంచుకుని నిర్వర్తించిన కేంద్రాలూ ఉన్నాయి. ఇంకా చిన్న గ్రామం ఉందనుకోండి. అక్కడ ముగ్గురు నలుగురు పెద్దలు కలసి ఒక కేంద్రాన్ని స్థాపించుతారు. ప్రజలకి ఆవునిగాని, గేదెనిగాని కొనుక్కునేందుకు కావాలంటే అప్పు ఇస్తారు. పశువుని కొన్నాక ఈ కేంద్రానికి తెచ్చి పాలు పితికి ఇచ్చే ఏర్పాటు చేస్తార. వీరి దగ్గర పడికి (పడి అంటే సుమారు శేరున్నర) పాతిక పైసలు కమీషను తీసుకుని పాలు తీసుకుని ఇచ్చిన అప్పు జమ కట్టుకుంటారు. ఇంక స్వంత పశువులున్నవారు కూడా ఈ కేంద్రానికిస్తారు. వీరి దగ్గర పన్నెండు పైసలు కమిషన్ తీసుకుంకుంటారు. (అప్పు ఇచ్చి, అప్పు తీర్చాక వారి/దగ్గరా పన్నెండు పైసలే తీసుకుంటారు). ఇలా ఆవు పాలు, గేదె పాలు అన్నీ కలిపి సీలు వేసిన డబ్బాల్లోపోసి ఇంటింటికీ తెచ్చి అమ్ముతారు. ఈ పాలు కావాలంటే ముందుగా సొమ్ము ఇచ్చి పాల చీట్లు కొనుక్కోవాలి. ఇలా ప్రతిచోటా పాల రేట్లు ఒక్కటే. లీటరు డబ్భై పైసలు. ఇలాటి పాల సరఫరా కెంద్రంలో పశువులేమీ ఉండవు. ఉదయం సాయంత్రం గంట కొట్టగానే ఆ టైములో అందరూ పశువుల్ని తెచ్చి పాలు పితకాలి. ఆవు ఖరీదు నూటఅరవై నుండి నూట ఎనభై వరకూ ఉంటుంది. గేదె ఖరీదు రెండు వందలనుండి రెండు వందల ఏభై వరకూ ఉంటుంది. ఈ పాల కేంద్రాలవల్ల అందరికీ సదుపాయంగా ఉంటుంది.

ఇక్కడి ప్రతి చిన్న గ్రామానికీ విద్యుద్దీపాలుంటాయి. కొన్ని పల్లెటూర్లలో అయితే వీధి దీపాలు, ట్యూబ్‌లైట్లు ఉన్నాయి. ఇటు ప్రక్క మంచి విశాలమైన రోడ్లు. ఇంక ప్రయాణీకుల సౌకర్యార్థమై మంచి బస్సులు. బస్సులలో సీట్లు విశాలంగా ఉంటాయి. బస్సు ఎక్కామంటే ఎంత ప్రయాణమైనా సునాయసంగా చేసేస్తాము. కాని తొందరగా బస్సుని మర్చిపోతాము. ఎందుకంటే పాత డొక్కు బస్సులో కూర్చుని గతుకుల రోడ్డులో ప్రయాణం చేస్తే ఒళ్లు నొప్పులు రెండు రోజులుంటాయి గనుక పాత డొక్కు బస్సునే సాధారణంగా జ్ఞాపక ముంచుకుంటాము. రైల్వే స్టేషన్‌లు కూడా ఎంత చిన్న స్టేషనైనాసరే విశాలమైన ప్లాట్‌ఫారమ్‌తో బాగుంటాయి.

ఇక్కడి ప్రజలకి భక్తి ఎక్కువ. ఇటుప్రక్క నాలుగేసి అడుగులకో "పిళ్లయార్" (విఘ్నేశ్వరుడు) విగ్రహం కనిపిస్తుంది. ప్రతి గ్రామంలో ఒక కోవిల ఉంటుంది. ఏ ఊర్లో ఉన్న వాళ్లకి ఆ ఊర్లో దేముడంటే ఎక్కువ భక్తి విశ్వాసాలు. ఈ తమిళనాడులో బస్సులో వెళ్తుంటామనుకోండి. గుడి ప్రక్కనుండి బస్సు వెళ్తుంటే కొంత మంది బస్సులోనే లెంప లేసుకుని, నెత్తిమీద కణ



తల దగ్గర రెండు చేతుల్తో మొట్టికాయలు పెట్టేసుకుని, రెండు చెవులూ పట్టుకుని గుంజీలు సగం సగం తీసేస్తారు. ఈ రకం మద్రాసులో కూడా చూస్తాము. దేముణ్ణి పూజించినప్పుడు కూడా ఇదే పద్ధతిన తమ వినయ విధేయతలు ప్రకటించి తప్పులు మన్నించమని వేడుకుంటారు. దక్షిణదేశం ఆలయాలకి ప్రసిద్ధి. ఆకాశాన్నంటే ఎత్తైన గోపురాలతో కళ్లు చెదరగొట్టే శిల్ప కళా సౌందర్యంతో పూర్వీకుల గొప్పతనాన్ని చాటి చెప్తుంటాయి ఇక్కడి ఆలయాలు. కొబ్బరిచెట్లు ఎక్కువ.

ప్రతి పల్లెలో వారంకి ఒక రోజు సంత ఉంటుంది. ఆ రోజు పప్పులు మొదలగు కిరాణా సామాన్లు, కాయకూరలు, పండ్లు, పువ్వులు, మట్టికుండలు, పాత్రలు, బట్టలు అన్నీ దొరుకుతాయి. మిగతా రోజుల్లో కాయకూరలు దొరకవు. మేమున్నది రామనాథపురం జిల్లాలో......ఎన్నో గ్రామాలు తిరిగేము. ఇక్కడ కాయగూరలు అన్నీ కాయవు. పండ్లూ, కూరలూ అవీ కొడైనాల్, నీలగిరినుండి మధురకి వచ్చి, మధురనుండి అన్ని ఊర్లకీ సరఫరా అవుతాయి. ఇక్కడ సంత కోసమని చుట్టూ ప్రహరీ గోడ కట్టిన బజారు ఉంటుంది. అందులో ఎవరికి వారు చిన్న పాక వేసుకున్నవి, లేక పెంకుతో కట్టించిన షాపులే ఉంటాయి. అందులోకి వెళ్ళటానికి ప్రతీ వ్యాపారి దగ్గరా పన్ను వసూలు చేస్తారు. సంతలు మన ప్రక్క కూడా ఉంటాయనుకోండి. ఇక్కడి గొప్ప, పేద స్త్రీలు కొంతమంది తాటి రేకులతో చక్కని రంగు రంగుల 'డిజైన్లు' వేసి రక రకాల బుట్టలు అల్లుతారు. ఈ బుట్టలు ఇటు ప్రక్క ప్రసిద్ధి. ఇదే రకం డిజైన్లో వెండి బుట్టలు కూడా అమ్ముతారు. తాటి రేకులతో రంగుల డిజైన్లతో చిన్న చాపలు అందంగా అల్లుతారు. ఈ చాపలు భోజనం చేసేటప్పుడు క్రింద వేసుకుని కూర్చునేందుకు పీటకి బదులు ఉపయోగిస్తాయి. బుట్టలకి మూత, అలా బుట్టలో బుట్ట ఇలా ఎన్నో రకాల చేతిపనులు చేస్తారు. ఇక్కడ చిన్న గ్రామమేనా చెట్టియార్ ఇళ్ళు పెద్ద దేవేంద్ర భవనాల్లా ఉంటాయి. కొన్ని ఊర్లలో చెట్టియార్ ఇళ్ళు చూసేందుకు ప్రజలు వెళు౦టారు.

తమిళనాడులోఉన్న జిల్లా లన్నిట్లోకీ రామనాథపురం జిల్లా చాలా వెనుకబడి ఉందంటారు. అందుకు కారణం కొన్నిచోట్ల ఉప్పు నీళ్ళు తప్పించి మంచి నీళ్ళు దొరకవు. వ్యవసాయానికి వర్షంమీదే ఆధారపడాలి. నదులులేని కారణంగా. అందుకనే ఇంతకుముందు పెద్ద వ్యాపారస్థుల దగ్గర్నుండి హొటల్ సర్వర్ వరకూ మలయా, సింగపూర్, సిలోన్ వెళ్ళేవారు ధనార్జనకి......కాని ఇప్పుడు వెళ్ళటానికి అనేక నిబంధన లుండటంవల్ల రాకపోకలు తగ్గేయి.

ఇంకో సదుపాయం ఉంది. ప్రతి ఊర్లో జిల్లాకో—ఆపరేటివ్ స్టోర్సు లున్నాయి. అందులో కిరాణా, ఫ్యాన్సీ సామాన్లన్నీ సరసమైన ధరలలో దొరుకుతాయి. ఏడాది క్రితంవరకూ ఈ స్టోర్సుల్లో విదేశీ వస్తువులు, వాచీలు అవీ దొరికేవి. ఇలా పల్లెలలో కూడా ఇన్ని సదుపాయాలమర్చుకుని ముందంజ వేస్తున్నారంటే అందరం తెలుసుకుని ఆనందించాల్సిందే! ★


మూడువేల ద్వీపాలదేశం

ఇండోనేషియా యాత్ర!

క. దివ్యజ్ఞాన సరోజినీదేవి

(గత సంచిక తరువాయి)

మనోహరమైన ప్రకృతి మట్టుకు జావా పొడుగూన కనపడుతూనే ఉంటుంది. అక్కడి నుండి 'పుంజాక్' మీదుగా 'చిబులాన్' లోని ప్రెసిడెంట్ సమ్మర్ పాలస్ చూసుకొని, ఇండోనేషియన్ పాటలు (ఇక్కడి వారికి పాటలంటె బహు ఇష్టము) పాడుకుంటూ జకార్తాకు నూరు మైళ్ల దూరములోనున్న 'బాండూంగ్' పట్టణమును సాయంకాలమునకు చేరుకొన్నాము. దీనిని 'పారిస్



బమ్మానాన్ దేవాలయం శిథిలాలలో రచయిత్రి.

ఆఫ్ జావా' అని కూడ అంటారు. ఇక్కడ కొద్దిగా చలిగా ఉంటుంది. ఆ రోజు సాయంకాలము బాండూంగ్ వనితా సమితి మమ్మలను ఆహ్వానించింది. ఉపన్యాసముల పిమ్మట నృత్య గానాదులు ఏర్పాటు చేసారు. వాళ్ళ నృత్యములు కొంచెము కొంచెము మన కథకళీ నృత్యములను పోలి యున్నట్లున్నవి వెదురు బొంగులతో చేయబడిన వారి అంక్లున్ అనే వాయిద్యము వినటానికి అతి మృదు మధురముగా ఉంటుంది.

పశ్చిమ జావాకు రాజధానియైన ఈ బాండూంగ్‌లో నూలు మిల్లులు, విశ్వ విద్యాలయము కూడ ఉన్నవట. ఈ విశ్వ విద్యాలయములో 25 వేల విద్యార్థులు ఉన్నారట.

'బాండూంగ్' నుండి మేము మరలా ఆ మరునాడు 'వానోసోబ్' బయలుదేరాము. సాయంకాలానికక్కడకు చేరుకొన్నాము. నలుగురికేసి ఒక హొటలు గది, చలి, పైగా దుప్పట్లు లేవన్నారు. ఏం చేస్తాము. పెట్టెలలోని చీరలే పైకి తీసి కప్పుకొని నిద్రపోయాము.

మరునాటి ప్రొద్దున్నే 'సోలో' పట్టణములో ఉన్న స్త్రీ వయోజన విద్యా కేంద్రమును చూడటానికి వెళ్లాము. ఇది స్త్రీలచేతే నడుపబడుచున్నది. ఇక్కడ స్త్రీలకి తమ సంసారములను సుఖ సంతోషములతో నడుపుకోవలసిన విధానము, భావి పౌరులైన తమ బిడ్డలకు చదువు సంధ్యలు గరుపవలసిన విధానము, ఉన్న ఆదాయముతోనే ఇం... ...గా ఎంతెద్దుకునే మెలుకువలు, వంటా వార్పు, చేతి పనులు నైతిక విలువలు, మతముల, గర్భవతులకు తీసుకోవలసిన జాగ్రత్తలు, వారి దేశమునందుగల స్త్రీ సంఘములు మొదలగు సమస్త విషయముల గురించి బోధిస్తారట. ఈ శిక్షాకాలము కేవలము రెండు రోజులు మాత్రమే. ఇక్కడకు వచ్చే విద్యార్థినులు తమ ఖర్చులకై కొద్దిగా బియ్యము తీసుకు వస్తారట. ఒక్కొక్క సారి ఇరువది, ముప్పదిమంది కన్నా ఎక్కువ మందిని చేర్చుకోరట. ఇంకా ఇండోనేషియాలో ప్రతి పల్లెలోను మహిళా సభలు, సమితులు ఉంటవట. అంతేగాకుండ ప్రతి పల్లెలోనుఉన్న చిన్న చిన్న బాల బాలికల పాఠశాలను పైతము స్త్రీలే నడుపుతారట.

అక్కడినుండి మేము 'బరబదూర్' దేవాలయమును చూడటానికి వెళ్లాము. దేవాలయ మనటానికన్న పెద్ద బౌద్ధ స్థూపమనటము మంచిదేమో. ఇండోనేషియన్లు మాత్రము దీనిని

ఇండోనేషియాయాత్ర

హిందూ దేవాళయమని పిలుస్తారు. నల్ల రాతితో చిన్న కొండపై కట్టబడిన ఈ స్థూపము ఎనిమిదవ శతాబ్దమునకు చెందినది. ఆనాడు సుమాత్రా, జావా, బాలీలలో అలరారిన హైందవ రాజ్యాలకిది నిదర్శనము. ఇది చాలా పెద్ద స్థూపము. ఎత్తు 42 మీటర్లు. విస్తీర్ణము 120 చదరపు మీటర్లు. నాలుగు ద్వారములుగల ఈ స్థూపము తొమ్మిదంతస్తులది. ఇందులో మొదటి మూడంతస్తులు 'కామధాతునకు' (కామము), ఆ తరువాతి మూడంతస్తులు 'రూప ధాతునకు' (రూపము), చివరి మూడంతస్తులు 'అంపధాతునకు' (ఆత్మకు) సాంకేతికములట. ఈ ఒక్కొక్క అంతస్థు గోడపైన ఆనాటి శిల్పులు బౌద్ధ చిత్రములను చెక్కియున్నారు. ఈ చిత్రములేగాక, ఒక్కొక్క అంతస్థులో బుద్ధుని ప్రతిమలు కూడ చాలా ఉన్నవి. పై అంతస్థునందు రాతితో కట్టబడిన పెద్ద పెద్ద గంటల లోపల కూడ బుద్ధ ప్రతిమ లనేకములున్నవి. ఈ స్థూపమునందుగల బుద్ధ ప్రతిమలు మొత్తము 504 ట. వీరు మానుసి బుద్ధులట. ఈ ప్రతిమలు గాక ఈ స్థూపము పై అంతస్థునందుగల గర్భ గుడియందు (హిరణ్య గర్భ) కూడ మరియొక బుద్ధుని విగ్రహమున్నది. ఈ స్థూపము జావా శిల్పులచేతనే నిర్మింపబడినదని ఇప్పుడు అక్కడివారి అభిప్రాయము. కాని ఇందుగల శిల్పమును, ప్రతిమలను చూచునప్పుడు మనము భారత దేశములోగాక, ఇండోనేషియాలో ఉన్నామన్న సంగతి మరచిపోతాము. అంతే గాకుండ ఆనాటి శిల్పుల శిల్ప కళా చాతుర్యమునకు సంభ్రమపడుతూ మనలనే మనము మరచిపోతాము. ఈ స్థూప ప్రాంగణములో ఒక బోధి వృక్షము పైత మున్నది. ఈ వృక్షము ఇండోనేషియాలో మరెచ్చట లేదట.

అక్కడనుండి మేము 'మండూత్' దేవాలయము చూడటానికి వెళ్లాము. ఇది నిజముగా దేవాళయమో, స్థూపమో చెప్పటము కష్టము. గర్భగుడిలో మూడు పెద్ద బోధి సత్వ, మానుసీ బుద్ధ ప్రతిమ లున్నవి. (ఇందు బుద్ధుని ప్రతిమ ఒకే రాతినుండి మలచ బడినదట). గోడలపై బౌద్ధ మత గాథ చిత్రములేగాక, రామాయణగాథ, చిత్రములు కూడ చెక్కబడి యున్నవి. ఈ దేవాలయం పెద్దది గాకపోయినను శిల్పకళందు దాని నేమాత్రము తీసిపోదు. ఇదీ నల్లరాతితోనే కట్టబడినది.

ఇవన్ని చూసుకుంటూ, ఒకనాడు హైందవ సంస్కృతికి ఆటపట్టైన 'జోగ్ జకర్తా' చేరాము దీనిని 'జోగజా' అని కూడ పిలుస్తారు. అది నేటికి కూడ జావనీయుల సంస్కృతికి, కళకు ఆటపట్టు. ఇక్కడ తైలవర్ణ చిత్ర పటములను, వెదురు పేడుతో చేసిన చిత్ర పటములను ఎక్కడ పడితే అక్కడ చాలా చౌకగా అమ్ముతారు. తోలుబొమ్మలు (వీటియందు రాముడు, కృష్ణుడు హనుమంతుడు, జాంబవంతుడు, పాండవులు మొదలగు బొమ్మలు కూడ ఉన్నవి) ఇక్కడ విరివిగా తయారు చేయబడుచున్నవి. వారు చర్మముతో తోలు బొమ్మలనేగాక, చక్కటి చేతి సంచులు, చెప్పులు, విసన కర్రలు కూడ తయారు చేస్తారు. ఇవన్ని కూడ చౌకే. ఈ తోలు వస్తువులపై వర్ణములతో చక్కగా చిత్రిస్తారు అక్కడి చిత్రకారులు. కొన్ని చేతి సంచులపై 'భాతిక్' అద్దకము కూడ చేయబడియున్నవి. జోగజా, భాతిక్ అద్దకమునకు ప్రసిద్ధి చెందినది. ఇక్కడి వెండిపని కూడ చాల బాగుంటుంది. వారు వెండితోను, అల్యూమినియముతోను గరిటెలనుండి రక రకాల తల పిన్నుల వరకు సమస్తము తయారు చేస్తారు. వీటిపై చక్కటి నగిషీ పని కూడ చేస్తారు. వీరి చౌక కృత్రిమ నగలు కూడ చాలా అందముగా ఉంటవి. ఈ ప్రదేశము నాట్యకళకు కూడ ప్రసిద్ధి చెందినది. ఇక్కడైదు నృత్య కళాశాలలు ఉన్నవట. ఇక్కడి వారికి నృత్య సంగీతాదులంటె బహు ప్రీతి. వారు బాల బాలికలకు 8, 9 ఏండ్లకే నృత్య శిక్ష నారంభిస్తారట. మొత్తానికి ఇండోనేషియన్లు కళా ప్రియులు. వారిండ్లయందు కనీసమొక చిత్రపటమైన ఉంటుంది.

ఆనాటి రాత్రి మేము 'పాండునో' నృత్య నాటకము చూడటానికి వెళ్లాము. ఆ కథంతా మహాభారతములో ఉన్నట్లే ఉన్నది. కాని నాకో చిన్న భేదము కన్పించింది. ధృతరాష్ట్రుడు తన కొడుకును చేరపిలచి, పాండవులతో రాజ్యము పంచుకొని, ఐక్యమత్యముతో పరిపాలించమని చెప్పగా గాంధారి పాండవులపైనుండే ఈర్ష్యతో దుర్యోధనాదుల దగ్గిరికి రహస్యముగా వెళ్ళి, తండ్రి చెప్పినట్లు చేయవద్దని బోధిస్తుంది. నాకు తెలిసినంతవరకు భారతములో ఈ సన్నివేశమున్నట్లు లేదు. కాని మొత్తానికి పాటలతో, నృత్యాలతో మన నృత్య నాటకముల ఫక్కీలోనే జరిగినదా నాటకము. ఈ నాటకములన్ని సాధారణముగా రాత్రిపూట భోజనాల తరువాత ఆరంభమై, అర్ధరాత్రికి ముగుస్తాయి.

'ఇదిగో మీ వాణ్ణి చితక్కొట్టేస్తా! నీ యిష్టం!'

'ఏం చేశాడేమిటి?' ఆదుర్దాగా అడిగాడు రామ్మూర్తి.

'నామీద అబద్ధాలు ప్రచారం చేస్తున్నాడు.'

'ఓస్! ఇంతేనా, అబద్ధానికే అంత ఆర్భాటమెందు కయ్యా! నిజంచెప్తే నాతో చెప్పు నడుము అడక్కొట్టేస్తా' అవతల వ్యక్తికి సమాధానం చెప్పాడు రామ్మూర్తి.

రమణబాబు (వంకాయలపాడు)

మరునాటి ఉదయము మేము మరల 'జోగ్ జా'కు దగ్గిరలోనేవున్న 'బ్రమ్మానాన్', 'కళాసాన్' దేవాలయములను చూడటానికి వెళ్లాము. ఇందు 'బ్రమ్మానాన్' దేవాలయ ప్రాంగణమునందు శివ పార్వతులకి, వినాయకునికి గణేష, విష్ణు, బ్రహ్మలకి వేరు వేరు మందిరము లున్నవి. నల్లరాతితో కట్టబడిన ఈ దేవాలయపు గోడలపై రామాయణ గాథ చిత్రములు ఎంతో నైపుణ్యముతో చెక్కబడి యున్నవి. ఇక్కడ పూజా పునస్కారములు మాత్రము ఉన్నట్లు లేవు. కాని ఇక్కడ జూన్, అక్టోబర్ల మధ్య పున్నమి రోజులలో వరుసగా ఆరు రోజులు రామాయణ గాథలోని పవిధ ఘట్టములు 500 నాట్యకారులచే నృత్య నాటక రూపములో ప్రదర్శింపబడుతవి. ఈ నాటకమునకు మేము రెండు రోజుల పిమ్మట వెళ్లటము జరిగినది. ఈ నాటకము కూడ రాత్రి ఎనిమిది గంటలకు ప్రారంభమవుతుంది. మేము వెళ్ళిన రోజు రామరావణ యుద్ధము, సీతాదేవి అగ్ని ప్రవేశము ప్రదర్శించారు. పూర్వము సీత అగ్ని ప్రవేశమునకు నిజమైన అగ్నినే వాడెడివారట, గాని ఈమధ్య మానివేశారట. పండు వెన్నెల ముందు అతి విశాలమైన నృత్యవేదిక, దాని వెనుక వెన్నెలలోను, లైట్ల వెలుతురులోను మెరిసిపోతున్న దేవాలయము, వేదికకు, ఇరుప్రక్క నాటకము చూడటానికి వచ్చే వారి కోసరము కట్టబడిన రాతి మెట్లు, ఇవన్నీ చూస్తుంటె మర లొకసారి ఇది భారత దేశమా, ఇండోనేషియానా అని సందేహము కలుగుతుంది. ఆనాడు నాటకాన్ని అందులో ముఖ్యముగా సీత అగ్ని ప్రవేశమును చూస్తూ ఉంటె కలిగిన అనుభూతిని మట్టుకు నే నెన్నటికి మరువలేను.

జోగ్ జాలో రెండు వికలాంగుల కేంద్రము లున్నవి. ఒకటి పోలియోవ్యాధితో పక్షవాతముక్రమ్మిన బాల బాలికలది. ఇది కేవలము స్త్రీలచేత అధునాతన పద్ధతులలో చక్కగా నడుపబడుచున్నది. ఆ పసిపాపలను చూస్తుంటె మనస్సంతా వికలమైపోతుంది. రెండవది యుద్ధములలోనో, ప్రమాదములలోనో వికలాంగులైన స్త్రీ పురుషులది. ఇది చాలా పెద్దది. ఆ కేంద్రములోని వారికి అనేకమైన పనులు కూడ అక్కడి అధికారులు నేర్పుతారు. ఇంకను, ఇక్కడ కృత్రిమ కాళ్ళు చేసే ఫ్యాక్టరీ కూడ ఉన్నది.

ఈ పట్టణములో ఒక రాజ గృహము కూడ ఉన్నది. నేడది వస్తు ప్రదర్శనశాలగా ఉపయోగపరచబడుతున్నది. ఇక్కడ తోలుబొమ్మలు వెండి సామానులు, నగలు, వారి పూర్వికుల ఆయుధములు, రథములు, ఛత్రములు, శివ, వినాయక, శక్తి, బుద్ధ, అవలోకితేస్వర, విగ్రహములు మొదలగునవన్ని అనేక మిక్కడ ప్రదర్శింపబడియున్నవి. ఇక్కడొక గదిలో జావనీయుల పెండ్లి వేదిక అమర్చబడియున్నది. ద్వారమునకు అరటి స్తంభములు కట్టబడియున్నవి. వివాహ వేదికపై బాసిపెట్టు వేసుకుని ప్రక్క ప్రక్కనే కూర్చున్న పెండ్లికూతురు, పెండ్లికొడుకు ప్రతిమ లున్నవి.

ఈ నగరములో నింక చూడదగినది 'భాతిక్' అద్దకపు సంస్థ. ఇండోనేసియన్ స్త్రీలందరు ఈ భాతిక్ (భాతిక్ అంటె ఇండోనేషియన్ భాషలో బిందువు లేక చుక్కని అర్థమట) అద్దకపు సరోంగ్లనే ఎక్కువ కడుతారు. ఇప్పుడిప్పుడే వారీ 'భాతిక్' అద్దకపు వస్త్రాలతో పాశ్చాత్య దుస్తులు కూడ తయారు చేస్తున్నారు. కానీ 'భాతిక్' వస్త్రాలు చాలా ఖరీదైనవి.

ఈ సంస్థ కూడ స్త్రీల చేతే నడుపబడుచున్నది. ఈ సంస్థలో మూడు విభాగములున్నవి. మొదటి విభాగములో 'భాతిక్' పని నేర్పబడుతుంది. రెండవ దానిలో 'భాతిక్' పని చేయబడుతుంది. మూడవ దానిలో 'భాతిక్' సంబంధమైన పరిశోధనలు జరుపబడుతవి. ఈ భాతిక్ అద్ద

కము రెండు విధములుగా ఉంటుంది. ఒకటి చేతితో చిత్రించినది. రెండవది అద్దకపు అచ్చులతో అద్దకము చేసినది. ఇందులో మొదటిది చాలా ఖరీదు. ఈ పనియందు స్త్రీలు తమ స్వహస్తములతో బట్ట కిరు వైపుల మొదట పెన్సిలుతోను, అటు పిమ్మట మైనము కలిపిన వర్ణములలోను మాదిర్లు చిత్రిస్తారు. ఈ విధమైన భాతిక్ పనిని ఒక సరోంగ్‌మీద చేయటానికి ఒక మనిషికి కనీసము మూడు నెలలైన పడుతుందట. రెండవ భాతిక్ విధానము ఇక్కడకు బహుశా ఈజిప్టు, పర్షియాల నుండి వచ్చి ఉండవచ్చు. దీని ప్రకారము రాగి అచ్చులతో ముదురు మట్టిరంగు ఉండవలసిన (తయారైన పిమ్మట) చోటును లేత మైనము తోను, తెలుపుతోనే ఉండవలసిన చోటును ముదురు మైనముతోను, ఆ బట్టపై అద్దకము చేస్తారు. (ఒక్కొక్క సారా వస్త్రముపై నీలి వర్ణము కూడ అద్దకము చేస్తారు). అటుపైన ఎండిన మైనమును పైపైన గోకివేసి ముదురు మట్టి వర్ణపు నీటిలో ముంచుతారు. అటుపిమ్మట మరల మైనము పూర్తిగా పోవుటకై వేడి నీటిలో ముంచుతారు. ఈ విధముగా ముదురు మట్టి రంగు, నీలము, తెలుపు వర్ణముల భాతిక్‌లు తయారు చేస్తారు. ఈ వర్ణముల భాతిక్‌లను (జోగిజా భాతిక్ అంటారు. ఇవి చౌక ఇతర వర్ణముల 'భాతిక్‌లు' ఖరీ దెక్కువ.

25 లక్షల జనాభాగల ఈ జోగ్ జకార్తా నగరమందింకా ఒక విశ్వ విద్యాలయము తోళ్ల పరిశోధనా కేంద్రము, చక్కెర ఫ్యాక్టరీలు, చేనేత పరిశ్రమలు మొదలగున వెన్నియో కలవు. ఇవన్నీ చూసుకుంటు నగరములో రెండు రోజు లిట్లే గడిపి వేశాము. జావా ద్వీపపు నగరము లన్నిటిలో నా కిది చాలా నచ్చినది. తప్పక చూడవలసిన పట్టణ మిది.

జూలై పదవ తారీఖు ప్రొద్దున అక్కడి నుండి 310 మైళ్ల దూరములోనున్న జకార్తాకు మరల మేమందరము బస్సులలో బయలుదేరాము. ఆ రాత్రి బాండుంగ్‌లో ఆగి మరునాటి మధ్యాహ్న సమయమునకు జకార్తా చేరాము. ఆ రోజంతా ప్రయాణ బడలిక తీర్చుకొని మరు నాడు దుకాణముల వైపు వెళ్ళినాము. ఇక్కడ డిపార్టుమెంటు స్టోరులు కూడ చాలా ఉన్నవి. ఇక్కడ నగిషీ చేయబడిన వెండి వస్తువులు బాలి చెక్క ప్రతిమలు, తోలు బొమ్మలు ప్లాస్టిక్కువి, తోలువి చెప్పులు, చిత్రపటములు, భాతిక్ వస్త్రములు మొదలగునవి అనేకము దొరుకును.

మరునాడు బాలీ, వెళ్ళుదామనుకొన్నాము గాని వీలుపడలేదు. బాలి తప్పక చూడవలసిన ప్రదేశమని, అది ఇండోనేషియాలోని హైందవ సంస్కృతి కింకా ఆట పట్టని అక్కడివారు చెప్పారు. దీనిని వెయ్యి దేవాలయముల దీవి అని కూడ పిలుస్తారు. ఇక్కడి అగ్ని పర్వతముల సంగతి అందరూ వినే ఉంటారు. జోగ్ జకార్తాకు పోయే త్రోవలో కూడ ఇంకా సన్నని పొగలు గ్రక్కుతున్న ఒక అగ్ని పర్వతమును చూచాము.

ఈ విధముగా జావా అంత పర్యటించి జూలై పదమూడవ తేదీన సింగపూర్‌మీదుగా ఢిల్లీ చేరుకొన్నాము. వారి కళా సంస్కృతులను, వారి స్త్రీల శక్తి సామర్థ్యములను మాత్రము నే నెన్నటికి మరవలేను. ★



జరిగిన కథ

జానకిరామయ్య రిటైరైన బడిపంతులు. ఆయనకు నిరంజనం, శంకరం, సుశీల అని ముగ్గురు సంతానం. శంకరం ఉద్యోగ ప్రయత్నంలో వుంటాడు. జానకిరామయ్య సుశీల పెళ్ళిగురించి ఆలోచిస్తూ వుంటాడు. ఉద్యోగం కోసం మిత్రుడు రంగారావు ఇంటికి వెళ్ళిన శంకరం ఆ దంపతులు ప్రవర్తన నచ్చక ఇంటికి వచ్చేస్తాడు. మామగారు తనపై అధికారం చెలాయిస్తున్నాడని నిరంజనం బాధపడ్తాడు. తండ్రికి సాయంగా శంకరం నిరంజనం ఇంటికి వస్తాడు. అక్కడ శారదతో పరిచయమౌతుంది. విజయవాడలో శంకరానికి ఉద్యోగం వచ్చింది. సినిమాహాల్లో శారద కన్పించి ఇంటికి రమ్మని ఆహ్వానిస్తుంది. శంకరం రాసిన నవల త్వరలో ప్రకటిస్తామన్న పత్రికాప్రకటనచూసి సుశీల ఎంతో ఆనందిస్తుంది, అదేవిషయం ఆఫీస్‌లో కొందరికి అసూయాజనకమౌతుంది. సమయం చూసి వాళ్ళపై దెబ్బతీయాలని వాసు, పతి, ప్రసాదం ఎదురుచూస్తుంటారు. శంకరం ముభావంగా ఉంటాడు. శాస్త్రి మృణాళినితో తను నటించబోయే నాటకాన్ని గురించి చెప్పి బయటకువస్తుండగా ప్రసాదం ఆపి పరోక్షంగా గేలి చేస్తాడు. మామగారు క్షమాపణ చెప్పుకోగా నిరంజనం శాంతిస్తాడు.

9

ఏనాడూ లేనిది ఆఫీసరు శంకరాన్ని పిలవడంతో ఆఫీసులో చాలామంది ఆశ్చర్యపోయేరు. ఆఫీసరు, ఆఫీసులో చాలా ముభావంగా ఉంటాడు. అనుకున్న పని అనుకున్న వేళకి కాపోతె, దానికి హెడ్ క్లార్కు సంజాయిషీ చెప్పుకోవాలసిందే గాని గుమాస్తాలు కారు. గుమాస్తాలకి గూడా ఆఫీసరు దగ్గరికి వెళ్ళే పని రానేలేదు. ఏదో శాస్త్రి లాటి బహు కొద్దిమందికి తప్ప.

ఆఫీసరు పదకొండూ పన్నెండు గంటల మధ్య ఆఫీసుకు వస్తారు. మళ్లా మూడున్నర నాలుగు గంటలకి వెళ్లిపోతారు. ఎప్పుడో తప్పని సరైతేనేగాని ఆయన ఏడు గంటల వరకూ కూర్చోరు. అలాంటి రోజులు ఆయన సర్వీసులో చాలా తక్కువ.

శంకరం సైతం ఆఫీసరు తనని పిలవడంతో కాస్త తటపటాయించిన మాట నిజం. పతికి గూడా చిత్రంగా కనిపించింది. ప్రసాదం గుడ్లప్పగించి శంకరంవైపు చూశాడు. వాసు ఆలోచనల్లో మునిగిపోయేడు.

శంకరం ఆఫీసరు గదిలోకి కాలు పెడుతూండగా శాస్త్రి తన పక్క సీటు వాడి చెవిలో ఏదో చెప్పి కిసుక్కున నవ్వేడు. అవతలివాడూ పళ్లికిలించాడు.

శంకరాన్ని చూడగానే సాదరంగా ఆహ్వానించేరు ఆఫీసరు నవ్వుతూ—

"మీ గురించి చాలా విన్నాను" అన్నారు.

శంకరం కాస్త ఖంగారు పడ్డాడు.

"మీరు చక్కటి కథలు రాస్తారని తెలుసు గాని మీరు మీరని మాత్రం తెలీదు. అది నిన్ననే తెలిసింది" అన్నారాయన సంతోషంగా.

శంకరం మనసు కుదుటపడింది.

"మీ 'చెదిరిన మనసులు' చదువుతున్నాను చాలా బావుంటుంది."

"థాంక్స్‌సార్"

"మీరు నా ఆఫీసులో పని చేస్తుండటం చాలా గర్వంగా ఉంది నాకు. కావాలంటే, ఇలాంటి ఏక్టివిటీస్ మన మధ్య ఉండాలి. ఫైళ్లు ముందేసుకుని సర్వం అవే అనే పద్ధతి పోవాలి. అఫ్‌కోర్స్—డ్యూటీ ఫస్టన్నారు గనక మన విధిని మనం సక్రమంగా నిర్వహించాలన్న మాట మరిచిపో కూడదనుకోండి. అంతమాత్రంచేత జీవితాన్ని 'సీటు'కి అంకితం చేయడం తగదు. ఈ పద్ధతి మనో వికాసానికిగానీ, మనిషి విలువకిగానీ ఉపయోగించదు. ఏమంటారు?"

అవునన్నట్టు తలూపాడు శంకరం.

"మొదట్లో మీరు నాకు మరో విధంగా పరిచయమయ్యారు. ఈ లక్షణం కథలు రాసే ప్రతివాళ్ళకి ఉంటుందనే అంటారు. మన తప్పు లేనప్పుడు మరొకళ్ళకి అనవసరంగా భయపడవలసిన పని లేదనే ధీమా మీ కుండటం నేరం కాదు. నా పద్ధతి వేరు—నేను ఎదటివారి మాటని నమ్మి వెంటనే ఒక నిర్ణయానికి వచ్చే మనిషినికాను. మీరు ఆఫీసులో కాస్త అలజడి లేవదీశారుట నిజమేనా?"

"కానీ......"

"ఐ నో మిస్టర్ శంకరం. ఒకడంటె మరొకడు మండి పడుతున్న ఆఫీసుకి ఆఫీసర్నైన తర్వాత కారణాలు ఊహించగలను మరి. మీ గురించి విన్న 'చెడు' ని ప్రత్యక్షంగా చూడాలనే ఉద్దేశ్యంతో, ఆ క్షణాన్ని మిమ్మల్నేమీ అనకుండా వాయిదా వేసాను. కానీ—ఒక్కటి మాత్రం నిజం..... తన పనిని తాను సక్రమంగా చేసుకుపోతె, మిగతా విషయాలు ఎలా ఏడ్చినా ఫర్వాలేదు. పని చెయ్యండి. పైకి రావడానికి ప్రయత్నించండి. ఇదే మీకు నేను చెప్పగలిగేది, ఆజ్ఞాపించేదీను."

"అలాగేసార్"

"మీరు వెళ్ళొచ్చు"

శంకరం బయట కొచ్చేశాడు. అతను బయటకు రాగానే హెడ్‌క్లార్కు పిలిచాడు. శంకరం వెళ్ళేడు

"అవునోయ్......ఆఫీసరేమన్నారు?"

"చాలా అన్నారు"

"ఏమిటో"

"చెప్పినందువల్ల నాకుగానీ, మీకుగానీ లాభించే దేమీలేదు."

"వాట్"

"నిజం......"

"సరి సరి......నువ్వు నీ సీట్లోకి వెళ్ళొచ్చు" బాగా తగ్గిపోయి, కాస్త సిగ్గుపడుతూ అన్నాడు హెడ్‌క్లార్కు.

ఆఫీసంతా చాలా నిశ్శబ్దంగా ఉంది. శాస్త్రి హెడ్ క్లార్కు దగ్గర కెళ్ళి ఏవో మంతనాలు సాగిస్తున్నాడు. అతను చెప్తున్న ప్రతిదానికీ హెడ్ క్లార్కు తలూపుతున్నాడు.

మరి కొద్ది నిమిషాల్లో ఆఫీసరు కుసుమని పిలిచారు. దీంతో ఆఫీసులో 'దుమారం' విజృంభించింది. శాస్త్రి తన అనుచరుల సీట్ల దగ్గరికెళ్ళి, ముసి ముసి నవ్వుతూ ఏదో మాటాడేస్తున్నాడు. ఈ వరస చూచిన ప్రసాదం భయపడ్డాడు.

శంకరం దగ్గర కొచ్చి మెల్లిగా—

"ఆఫీసరు నీతో కుసుమ విషయం ఏమీ అనలేదుగా గురూ! ఎందుచేతనంటే ఈ మధ్య మీ ఇద్దరిపైనా—"

"నువ్వేమీ భయపడకు ప్రసాదం. ఆఫీసరు మన మనుకున్నంత తలూపే రకం కాదు. అన్ని విషయాలూ రూంలో చెప్తాను."

"అయితె సరే......మరేంలేదు......ఆ శాస్త్రి గాడి నటన చూస్తుంటే భయమేసింది అంతే" అన్నాడు ప్రసాదం.

పది నిమిషాల్లో కుసుమ వచ్చింది. ఒక్కొకరు వెయ్యి కళ్ళు పెట్టుకుని ఆమెని నఖశిఖ పర్యంతం పరీక్ష చెయ్యడం మొదలు పెట్టారు. ఆమె తన సీట్లో కూర్చుని ఏదో టైప్ చేసి, ఆ కాగితాన్ని తీసుకుని ఆఫీసరు గదిలోకి వెళ్లింది.

"ఈ దెబ్బతో అమ్మగారికి ఉద్వాసన ఖాయం" అన్నాడు శాస్త్రి కాస్త బిగ్గరిగా.

ప్రసాదం బుర్ర గోక్కున్నాడు. పతి బిత్తరపోయాడు.

మరో అయిదు నిమిషాల్లో కుసుమ వచ్చింది. తన సీట్లో కూర్చుని తన పనేదో తాను చేసుకుపోతోంది.

అప్పుడే గుస గుసలూ, పక పకలూ ప్రారంభమయ్యాయి. ఓ మూల ఊహాగానాలు, తలో విధంగా ఆలోచనలు, పరిశోధనలూను. కానీ, ఎవరికీ సరైన సమాధానం దొరకడం లేదు.

మూడో పిలుపు హెడ్ క్లార్కుకి సంబంధించినది. ఆయనకీ పిలుపు రాగానే ఎగిరి గంతేసినంత పనిచేసి గదిలోకి వెళ్ళేడు. మళ్ళా కొద్ది నిమిషాల్లోనే బిక్కమొగంతో, నీరసంగా తిరిగి వచ్చేశాడు. శాస్త్రి ఆయన దగ్గరికి వెళ్ళేడు.

హెడ్ క్లార్కు శాస్త్రితో ఏదో చెప్పాడు,

శాస్త్రి ఏడుపు మొహం పెట్టేడు. శాస్త్రి వాలకం ప్రసాదానికి నచ్చినట్టుంది. ఒకసారి పకిలించేడు.

ఆ ఉదయమంతా గందరగోళంగా జరిగిపోయింది. మధ్యాహ్నం కుసుమ శంకరం దగ్గరకొచ్చి అన్నది—

"నా పోస్టు కన్‌ఫరమ్ చెయ్యటానికి ఆఫీసరు ప్రయత్నిస్తున్నారట. అప్లికేషన్ ఇవ్వమన్నారు. ఇచ్చాను. ఒంట్లో బాగా లేదని చెపితే, రెండు రోజులు సెలవు గూడా ఇచ్చారు."

"ఇలాటి మంచి మనుషులు ఒక పట్టాన అర్థంకారు." అన్నాడు శంకరం, ఆఫీసరు మంచి తనాన్ని హర్షిస్తూ.

"వీలుంటే రేపు మా ఇంటికి వస్తారా. మీతో మాటాడాలి" అడిగింది కుసుమ.



"తప్పకుండాను" అన్నాడు శంకరం.

ఆనాటి సాయంత్రం నలుగురూ మిత్రులూ అద్దె ఇంటిలో సమావేశమయ్యారు. శంకరం జరిగినదంతా చెప్పాడు. ప్రసాదం విని, ఘొల్లున నవ్వేస్తూ,

"అయితే శాస్త్రిగాడి ఆట కట్టిందన్నమాట. గోవిందా......" అన్నాడు.

"ఆయనింత మంచివారని మనం ముందు అనుకోలేదు సుమా" అన్నాడు వాసు.

"మనం ఒక విషయం మరిచి పోతున్నాం. ఆఫీసన్న తర్వాత రక రకాల మనుషులుంటారు. భోజనం చేసేవాళ్ళూ, సిన్సియర్‌గా పని చేసే వాళ్ళూ, పని దొంగలూను. మరి వీళ్ళందర్నీ ఒక దారిని పెట్టుకోవాలంటే. ఆఫీసరు చాలా వలలు పన్నవలసి వస్తుంది. భజన చేసే వాళ్ళని 'భేష్' అని సమర్థించాలి. సిన్సియర్‌గా పని చేసేవాళ్ళకి ఉత్సాహాన్నివ్వాలి. పని దొంగలని మందలించాలి. వీటన్నిటికంటె ముఖ్యం తన వ్యక్తిత్వం. ఎవరికీ ఏ హానీ చేయకుండా ఆఫీసు వ్యవహారాలు చక్కబెట్టుకోడం—అప్పుడే 'ఆఫీసరు'. ఈ విధంగా చూచి నట్టయితే మన ఆఫీసరు చాలా తెలివి గలవాడు" అన్నాడు పతి.

"గొప్పగా చెప్పావ్" అన్నాడు ప్రసాదం.

"కాబట్టి......ఈ శుభ సమయంలో శ్రీ శంకరంగారు మనందరికీ కాఫీలు సరకించే ఏర్పాట్లు చేయాలని ప్రతిపాదిస్తున్నాం" అన్నాడు పతి.

"దాన్ని మేము బలపరుస్తున్నాం" అన్నాడు ప్రసాదం.

"ఆమోదించాం" అన్నాడు శంకరం.

"అయితే పదండి" అన్నాడు వాసు.

అందరూ నవ్వుకున్నారు. ఉద్యోగంలో ప్రవేశించిన తర్వాత, వాళ్ళకి ఈ రోజున ఆఫీసు స్వర్గంలా కనిపించింది. ఆఫీసరు దేవుడైపోయాడు. మన సారా ఆనందించారు.

అందరూ కలిసి హోటల్‌కి వెళ్ళేరు. కాఫీలు తాగుతుండగా వాసుదేవరావు గభాలున లేచి హోటలు గేటు దగ్గరికి వెళ్ళేడు. అతనికి పది అడుగుల దూరంలో, అప్పుడే హోటల్ లాడ్జింగ్‌లో నుంచి బయట పడిన ఒక వ్యక్తి నిలబడి ఉన్నాడు.

ఆ వ్యక్తిని చూస్తూంటె—సందేహం లేదు. అతనే!

అతను రిక్షాని పిలిచాడు. రిక్షాలో ఎక్కి వెళ్ళిపోయాడు.

వాసు కౌంటర్ దగ్గర కొచ్చి—

"ఇప్పుడు మీ లాడ్జింగ్‌నుంచి బయట కెళ్ళి వాయన పేరేమిటి?" అనడిగాడు కౌంటర్‌లో కూచున్న ఆసామిని. అతను వాసువైపు ఎగాదిగా చూస్తూ—

"పదమూడో నెంబరు గది" అన్నాడు హడావిడిగా.

వాసు బోర్డు దగ్గరికి వెళ్ళాడు. పదమూడో నెంబరుపైన తగిలించిన విజిటింగ్ కార్డు చదివాడు.

'రాజశేఖరరావు'

"రాస్కెల్......ఇంకా ఎన్నాళ్ళు తప్పించుకు తిరుగుతావ్. చేతికి చిక్కావ్" అనుకున్నాడు కసిగా వాసుదేవరావు.

అంతలో శంకరం కౌంటర్ దగ్గర కొచ్చి బిల్ చెల్లిస్తూ—

"ఏమిటి భాయ్! అంత హడావిడిగా లేచావు" అన్నాడు.

మనిషి - మిథ్య

"ఉహు .... ఏంలేదు. నాకు తెలిసి నాయన వస్తేనూ......"

"సరే......పదపోదాం."

అందరూ రోడ్డుమీద పడ్డారు. దార్లో ప్రసాదే ఒక ప్రతిపాదన పెట్టాడు.

"ఈ ఊళ్లో చేనేత సప్తాహం బ్రహ్మాండంగ జరుగుతుందిట. కాబట్టి మనం ఆ యొక్క సప్తాహాన్ని చూడాలని ఉద్దేశ్యం"

"ఆల్‌రైట్........పదండి మరి" అన్నాడు పతి.

దారి సప్తాహం వైపు మార్చారు. అది జింఖానా క్లబ్బు ఆవరణలో ఏర్పాటు చేశారు. వాళ్లు అక్కడికి వెళ్ళి, అక్కడ ఏర్పాటు చేసిన అందమైన ప్రతి షాపునీ పరామర్శిస్తూ బఠానీలు తింటూ నడుస్తున్నారు.

అక్కడ అందంగా అలంకరించిన స్టేజీపైన ఎవరో గాయని ఆర్కెస్ట్రాతో కమ్మని హిందీ (సినిమా) పాటలు పాడుతున్నది. మిత్రులు స్టేజీవైపు నడిచారు. ఆ పాటల్ని శ్రద్ధగా వింటూన్నారు.

మధ్యలో వాసు అన్నాడు.

"నాకు కొద్దిగా పనుంది. నేను వెళ్లాలి. మీరు నెంపాదిగా రండి."

మిత్రులు తలలూపారు.

వాసు బయట పడ్డాడు. గబ గబా రూం కొచ్చేడు. తలుపు తీశాడు. తన పెట్టె తెరిచి బట్టల అడుగునున్న ఒక డైరీ, ఒక ఫోటో తీసుకున్నాడు ఆ ఫోటో వైపు తీక్షణంగా చూస్తూ—

"నీ పాపం పండింది శేఖరం" అన్నాడు.

మళ్లా పెట్టె మూసి, తలుపు తాళం వేసి ఆ హోటలు దగ్గరికి వచ్చాడు. లాడ్జింగ్ సెక్షన్ వైపు నడిచి 13 నెంబరు గది చేరుకున్నాడు. ఆ గదికి ఇంకా తాళం పెట్టే ఉన్నది.

కౌంటర్ దగ్గరకొచ్చి అడిగాడు.

"13 నెంబరు గదాయన రాజశేఖర్‌రావు వచ్చాడా?"

అవతల ఆసామీ విసుగ్గా చూశాడు.

"ఆయన గది ఖాళీ చేసి అయిదు నిమిషాలయ్యింది."

వాసు దెబ్బ తిన్నాడు.

"ఎక్కడికి వెళ్లాట్ట?"

"ఆ విషయం మాకేం తెలుస్తుంది చెప్పండి?"

వాసు హోటలునుండి బయట కొస్తూ తనలో తాను గొణుక్కున్నట్టు—

"నువ్వెప్పటికైనా నా చేతికి చిక్కక మానవు శేఖరం. ఇది తథ్యం" అనుకున్నాడు.

*　　*　　*

సాయంత్రం ఆఫీసయిన తర్వాత శంకరం కుసుమ ఇంటికి వెళ్ళేడు. ఆవిడ నవ్వుతూ ఆహ్వానించింది. అతను లోపలికివెళ్ళి కూర్చున్నాడు. కుసుమ కాఫీ తీసుకొచ్చి ఇచ్చింది. ఇద్దరూ కాఫీ తాగారు.

"ఆఫీసులో చాలామంది రాక్షసులున్నారు" అన్నది కుసుమ.

"................"

45 వ పేజీ చూడండి

మనమూ - మనదేహస్థితి

డా॥ గాలి బాలసుందరరావు

స్థూలాంత్రము - దాని నిర్మాణము


గత వారం చిన్నప్రేగును గురించీ, దాని స్థూల, సూక్ష్మ నిర్మితులను గురించీ తెలుసుకున్నాము. ఇప్పుడు పెద్ద ప్రేగును గురించీ, దాని నిర్మితిని గురించీ తెలుసుకుందాము. ప్రేగుల నిర్మితీ ధర్మములను గురించిన సమగ్ర విజ్ఞానము ఉంటేనేగాని వాటికి సంబంధించిన ధార్మిక (Functional), ఆంగిక (Organic) రోగములను అర్థం చేసుకోవడం సాధ్యంకాదు.

చిన్నప్రేగు చివర భాగమైన 'ఇలియము' అంతమునుండి పెద్ద ప్రేగు ప్రారంభమై, గుదము (Anus) వద్ద అంతమౌతుంది. దీని పొడుగు షుమారు అయిదు అడుగులు ఉంటుంది. పెద్ద ప్రేగు ప్రథమ భాగమును 'సీకము' (Caecum) అంటారు. 'సీకస్' (Caecus) అన్న లేటిన్ మాటకు 'గ్రుడ్డిది' అని అర్థము. ఒక ప్రక్క మూసుకునివున్న సందును ఇంగ్లీషులో బ్లైండ్ లేన్ (Blind lane) అంటారు. సీకము రెండు వైపులా ద్వారమువున్న గొట్టము కాదు. గ్రుడ్డి సందులాగా దారిలేని నిర్మితి గనక దానికా పేరు వచ్చింది. సీకము పెద్దప్రేగు ఇతర భాగము లన్నింటికంటె లావైనది. సీకము వద్ద లావుగా ఉండే పెద్దప్రేగు పోను పోను చిన్నదై 'రెక్టం' (Rectum) అనబడే మలాశయ భాగంలో మళ్లీ బాగా విస్తరించి, ముడి వద్ద అంతమై పోతుంది.

ఆకారంలోనూ, నిర్మాణంలోనూ, ధర్మములలోనూ చిన్న ప్రేగుకూ, పెద్ద ప్రేగుకూ కొన్ని ముఖ్య భేదములు ఉన్నవి. అవి:—(1) పెద్దప్రేగు అంతరాళము చిన్న ప్రేగు అంతరాళం కంటె పెద్దది. (2) చిన్న ప్రేగులా అది నిరంతరం చలిస్తూ ఉదర కుహరంలో వివిధ భాగములలోకి పోకుండా ఏదో ఒక ప్రదేశంలో మాత్రమే కదులుతూ ఉంటుంది. (3) చిన్న ప్రేగులో ఆద్యంతములమధ్య సంపూర్ణంగా ఉండే నిలువు కండరములు, పెద్ద ప్రేగు గోడలో మూడు పట్టీలుగా ఏర్పడి ఉంటవి. ఈ పట్టీలు నవారు లాగా ఉంటవి. ఈ పట్టీలను టీనియా కోలై (Taenia coli) అంటారు. 'టాయినియా' (Tainia) అంటే రిబ్బను. పెద్ద ప్రేగుకు కోలన్ అనే పేరు కూడా ఉన్నది. కోలన్‌లోఉండే రిబ్బను వంటి నిర్మితులు గనక వీటికా పేరు వచ్చింది. పెద్ద ప్రేగు గోడలో ఉండే వలయాకార కండరములతో ఏర్పడిన పొరయొక్క పొడవుకంటె, ఈ టీనియముల పొడవు తక్కువగా ఉంటుంది. అందువల్ల పెద్ద ప్రేగు గోడ అక్కడక్కడ విస్తరించి చూడడానికి టొమేటో పళ్ల దండలాగా ఉంటుంది. పెద్దప్రేగు గోడ బయటకు చొచ్చుకుని వచ్చి సంచులు ఏర్పడిన ఈ విస్తరణలను హాస్ట్రేషనుల (Haustrations) అంటారు.

పెద్ద ప్రేగు కుడి ఇలియక్ ప్రదేశంలో ఆరంభించి, పైకి ప్రాకి, లివరు క్రిందివైపున ఎడమ ప్రక్కకు వంగి ఉదర కుహరంలో అడ్డంగా పోయి ఎడమహైపోకాండ్రియములో స్ప్లీను క్రింద క్రిందికి వంగి, ఎడమ లంబారు, ఇలియక్ ప్రదేశములగుండా క్రిందికి దిగి, పెల్విస్ ఆరంభం వద్ద ఒక మడతగా ఏర్పడి, శరీర మధ్య రేఖకు తిన్నగా నిడుపైన గొట్టముగా మారి, ముడ్డి వద్ద అంతమౌతుంది. సీకము ఊర్ధ్వాంతములో చిన్న ప్రేగు పెద్ద ప్రేగుతో చేరుతుంది. ఆ కలయికనుండి లివరు క్రింద వరకు ఊర్ధ్వగతిలో వున్న పెద్ద ప్రేగు భాగమును ఆరోహ భాగము (Ascending Part) అంటారు. లివరు క్రిందనుండి స్ప్లీను క్రింది వరకు ఉదరానికి అడ్డంగా ఉండే భాగమును తిర్యగ్భాగము (Transverse Part) అంటారు. ఈ భాగము నిడుపుగా ఉండక మధ్యలో తోరణం క్రిందికి వంగినట్లుగా వంగి ఉంటుంది. స్ప్లీను క్రిందనుంచి ఆరంభమై పెల్విస్‌కు పైన మడత వరకూ ఉండే భాగమును అవరోహభాగము (Descending Part) అంటారు. అవరోహ భాగాంతములో ఉండే మడతను సిగ్మాయిడ్ కోలను (Sigmoid colon) అంటారు. గ్రీకు భాషలో 'ఎస్' వంటి అక్షరమును 'సిగ్మా' అంటారు. ఆ అక్షరమును పోలి ఉన్నందున ఈ భాగానికి ఆ పేరు వచ్చింది. సిగ్మాయిడ్ కోలన్ చివరనుండి ముడ్డి వరకూ ఉండే నిడుపైన గొట్టం వంటి భాగమును 'రెక్టం' అంటారు. రెక్టస్ (Rectus) అన్న లేటిన్ మాటకు నిడుపైనది, వంకర లేనిది అని అర్థము. నిడుపైన గొట్టంవంటి నిర్మితి గనుక మలాశయానికి రెక్టం (Rectum) అనే పేరు వచ్చింది. రెక్టము శరీర మధ్య రేఖకు తిన్నగా పెల్విస్‌యొక్క వెనుక గోడను అంటి ఉంటుంది. రెక్టం చివర భాగము ఒక నాళాకృతి గలది. దానిని గుదనాళము అనవచ్చును. (Anal canal)

కుడి ఇలియము (ఎముక)లో "సీకము" ఆరంభమౌతుంది. అది రెండున్నర అంగుళముల పొడవు గల కండరముల సంచీ, పెరిటోనియము మడత దానిని చుట్టి ఉంటుంది. సీకము ఆకారము అన్ని పరిస్థితులలోనూ అందరిలోనూ ఒకే మాదిరిగా ఉండదు. సీకాంతములో ఇలియము (చిన్న ప్రేగు) పెద్ద ప్రేగుతో కలిసి ఉంటుంది. ఈ కలయికకు కొంచెం క్రిందుగా మిరపకాయ ఆకారం గల ఒక నిర్మితి సీకమును చేరి ఉంటుంది. దీనిని వెర్మిఫారం ఎపెండిక్సు (Vermi form Appendix) అంటారు. 'వెర్మిఫారం' అంటే 'చిన్న పాము' ఆకృతిగల 'ఎపెండిక్సు' అంటే అనుబంధము అని ఈ మాట కర్థము. ఎపెండిక్సును గురించి తరువాత వివరిస్తాను. నోటిని రెండు పెదవులు మూసిఉంచినట్లుగానే రెండు పెదవుల వంటి నిర్మితులు ఇలియమును సీకమును కలిపే ద్వారమును మూసి ఉంచుతవి. ఈ ఏర్పాటును ఇలియో సీకల్ వెల్వ్ (Ilea-caecal valve) అంటారు. ఒక ప్రదేశంనుండి మరొక ప్రదేశమునకు పదార్థమును పోనిస్తూ, అది మళ్లీ వెనక్కు రాకుండా చూచే నిర్మితిని 'వాల్వ' (Valve) అంటారు. ఇటువంటి వేల్వులు శరీరంలో చాలా ఉన్నవి. ఇలియమునకూ, సీకమునకు మధ్య వున్న ఈ వేల్వ, ఆహార పదార్థములను ఇలియము నుండి కోలనుకు పోనిస్తుంది. కాని సీకమునుండి ఇలియమునకు రానివ్వదు. ఈ వేల్వ పెదవులు రెండు ప్రేగుల అంతరాళములనూ క్రమ్మి ఉండే మ్యూకస్ పొరల మడతలవల్ల ఏర్పడ్డవి. ఇలియము గోడలో కండరముల పొర, కోలను గోడలలో ఉండే కండరముల పొరలో లీనమై పోతుంది. కాని చిన్న ప్రేగుల గోడలో వుండే వలయాకృతి గల కండరములు ఇక్కడ అధికంగా ఉండి, ఒక స్ఫింక్టరుగా రూపొందుతవి. ఈ స్ఫింక్టరు సంకోచించినప్పుడు ఇలియమూ సీకముల మధ్య ఉండే ద్వారము మూసుకుని పోతుంది.



(1) లివరు (2) జఠరాశయము (3) సీకము (4) అవరోహభాగము (5) తిర్యగ్భాగము (6) ఆవరోహ భాగము (7) సిగ్మాయిడ్ (8) రెక్టము (9) ఇలియం అనే తొంటి ఎముక అగ్రము (10) ఇంగ్వైనల్ లిగమెంటు (11) చిన్నప్రేగు (12) వెర్మిఫారం ఎపెండిక్సు.

వ్యాకోచించినప్పుడు తెరుచుకుంటుంది. దుస్సంకోచ కాలములో పూర్తిగా బిగుసుకుపోతుంది. అప్పుడు ఆహార గతికి ఆటంకము కలిగి కడుపులో శూల ఏర్పడుతుంది.

సీకము ఉదర కుడ్యమునకు అంటి ఉండదు. అందువల్ల అది అటూ ఇటు కదలడానికి వీలుంటుంది. తొంటి ఎముకకూ ప్యూబిక్ సింఫైసిస్‌కూ మధ్య ఒక నవారు పట్టీవంటి నిర్మితి ఉన్నది. దానిని ఇంగ్వైనల్ లిగమెంటు (Inguinal Ligament) అంటారు. దాని క్రింద ఉదర కండరముల మడతలవల్ల ఒక కాలువవంటి

35 వ పేజీ చూడండి



ఉండి ఉండి హఠాత్తుగా గుర్తు కొస్తుంది ప్రభుత్వం వారికి — సంఘానికి వెన్నెముక బడిపంతులని, భావిపౌరులని తీర్చిదిద్దవలసిన బరువు బాధ్యతలు అతడిపేసని వెంటనే మిగిలిన పనులు పక్కకినెట్టి నిమిషాల మీద ఒక ట్రైనింగ్ కోర్స్ అనో, ఒక సమావేశమనో ఏర్పాటు చేస్తారు. వచ్చే జీతాన్ని నెల రోజులకి సర్దటమన్న మహా యజ్ఞంలో సతమతమయే సదరు బడిపంతులు. దొరికినవాడి దగ్గర అప్పుచేసి పట్నం వచ్చి పడతాడు.

అటువంటి సమావేశాల కొకదానికి దిగబడి ఒళ్ళు హూనం చేసుకుని తిరుగు ప్రయాణానికి బస్టాండు దగ్గరకు వచ్చాను. అప్పటికే అయిదయి పోయింది. కుర్రకారు—ఇంకా జీవితపు భారాలు నెత్తిన వేసుకోనివారు—సినిమాలు దర్శించి మర్నాడు వెంచేద్దామని ఉండిపోయారు. కాని నాలాటి వాడికి ఒక రాత్రి గడిచినకొద్దీ అన్ని విధాలా ఇబ్బందే! పైగా అటువంటి సరదాలు చంపుకుని నిర్వికల్ప సమాధిలో మునగకపోతే సంసార సాగరాన్ని ఈదడం అన్నది అసంభవమని గ్రహించి సినిమాలు, అనవసరంగా హోటళ్ళు వగయిరా కోర్కెలని దూరం ఉంచడం నేర్చుకున్న వాడి నవటాన పని అయి గానే నేరుగా బస్సుల వేటలో పడ్డాను.

అక్కడికి చేరుకోగానే నేను సేకరించిన స: చారం—ప్రస్తుతం సిద్ధంగా బస్సులు లేవని, : నవే తిరిగి వెళ్ళవలసి ఉంటుందనిను. వెళ్ళవలసి నడువ నవసరంలేని ఊరు కావడాన, చేరుకోవలసి స్వంత ఇంటికే అయినందున తాపీగా కూర చుట్టూ కలయచూశాను.

నా దృష్టికి—చేతిలో మరచెంబు, చంకలో గొ: దాని ప్రక్కగా జంబుఖానాతో చుట్టబడిన :

వక్క చెట్లలతో వడివడిగా వస్తూ ఉమాపతిగారు అగబడ్డారు.

అసలు "బతకలేక బడిపంతులు" అన్న సామెత ఉన్నా, కొంతమంది షుమారుగా బ్రతక గలిగినవారు కూడా ఇందులోకి జొరబడుతుంటారు. భావి పౌరులని తీర్చిదిద్దుదామని కాని, సేవ చేద్దామని కాని కాదు. కేవలం కదలిక లేకుండా ఉన్న ఊళ్లో పడి ఉండవచ్చునని. మధ్య మధ్య పై దేముళ్ళలో ఎవరికయినా అలక వచ్చి స్థాన చలనం కలిగించినా, మళ్ళీ ఆ అలక పోగానే స్వస్థానం చేరుకోగల అవకాశాలున్నాయి ఇందులో.

అదుగో అటువంటి శాప సమయాల్లో ఒకసారి ఆయన మా ఊరికి పంతులుగా బదిలీ అయాడు. మొత్తానికి ఆరు నెలల కాలం పాటు ఆ శాపాన్ని తిప్ప లేకపోయాడు. నా పరిచయం ఆయనతో ఆ కాలం లోనే!

"నమస్కారం మాస్టరుగారూ! మీరూ ఇవ్వాళే వస్తారనుకోలేదు సుమండీ. లేకపోతే పిలిచి ఉండే వాడిని!" అన్నాను ఆయన్ని చిరునవ్వుతో ఆహ్వానిస్తూ.

"ఏదీ మీకూ తెలియని దేముంది, ఈ రెండు రోజుల్లో నేను ఎంగిలి పడింది ఒక్కపూట మాత్రం. ఊళ్లో ఎరిగిన పీనుగ ఒక్కడూ లేకపోయె!...... ఏదో పాపం ఆయన పుణ్యమా అని ఇక్కడి తెలుగు మాస్టరుగారు ఈ పూట నా వాలకంచూసి ఉపో షాలని పసికట్టి ఇంటికి పిలిచాడు. కాబట్టి కొంచెం ఓపికగా ఉంది ఇప్పుడు!......అయినా వీళ్ళ ట్రయినింగ్‌లు, కాన్ఫరెన్సులు మా కెందుకండీ! తెలుగంటే ఒక్క వెధవ లక్ష్య పెడతాడా? పోనీ ఈ చెప్పే వాళ్ళకి గౌరవం పోతే!......ఇంతకీ ఈ బస్సు ఈ రాత్రికి అఘోరించేనా?"

"వస్తుందిటలెండి. రాత్రికి చేరుకోగలం. ఇక ఎక్కడం అంటారా ఎవళ్ళం ముందు ఎక్కితే వారు రెండవ వారికి స్థలం ఉంచుదాం. కాసేపు మనం పంతుళ్ళమన్న విషయం మర్చిపోయి కుర్రాళ్ళం అనుకుంటే సరి—అవలీలగా ఎక్కిపోగలం" అన్నాను నవ్వుతూ.

కాని ఆయన నా మాట వినిపించుకున్నట్లు లేదు. కండువా పెట్టి, ముఖాన్ని తుడుచుకుని ఉస్సురంటూ అరుగుమీద చతికిలబడ్డాడు.

కాని అంతలోనే బస్సు రావడాన "లేవండి లేవండి. వచ్చేసింది మన రథం" అని రథంలాంటి ఆయనకు చేయి అందించాను.

కింద కూర్చున్న వాడిని లేపేందుకే నేను కావలసి వచ్చినప్పుడు ఈయనతో పెట్టుకుంటే, ఇక నేను బస్సు ఎక్కినట్టేనన్న విషయం గ్రహించి, ఆయన్ని ఆగమని నేను గుంపులోకి దూసుకుపోయి, మొత్తానికి లోపలికి జొరబడి ఆయనకి నాకు కూడా స్థలం సంపాయించగలిగాను. అయితే ఆయన లోపలికివచ్చి నన్ను కిటికీ వైపునుంచి లేపి తను అటు కూర్చోవడం మాత్రం నాకు నవ్వు తెప్పించింది. మధ్యన నడిచేవారు తనకి తగలకుండా నన్న మాట ఈ జాగ్రత్త! "దారిలో నేను దిగిపోయాక ఏం చేస్తాడో మానవుడు!"—అనిపించింది.

చేసిన తప్పు దిద్దుకుంటున్న దానిలా బస్సు వేగంగా పోతోంది. ఉమాపతిగారు ధారాళంగా ఉపన్యసిస్తున్నాడు లోకం ఎలా భ్రష్టు అయి పోయిందీ, మడి ఆచారం ఎలా కలికానికి కూడా లేకుండా పోయిందీ సోదాహరణంగా చెబుతున్నాడు. పూర్వం ప్రతి ఊళ్ళోనూ ఒక "మడి" హోటలుండేదిట! కొన్ని చోట్ల పట్టు బట్టలు వాళ్ళే ఇచ్చే వారుట! అన్నీ చెప్పి తనలాటి వాడికి కదలవలసిన రోజులు కావన్నాడు.

అవునన్నాను.

ఇలా ఆయన చెప్పే మాటలు వింటూ బాధ పడుతున్న నాకు హఠాత్తుగా ఆయన వాక్ప్రవాహం ఆపేసి సంచిలోంచి ఏదో పుస్తకం తీసుకుని అందులో తల దూర్చేయడం ఎంతో హాయనిపించింది. "బహుశ ఆయన మాటలు ఆయన్నే బోరుకొట్టి ఉంటాయి" అనుకుంటుండగానే బస్సు ఆగడం ఒకావిడ ఎక్కడం జరిగింది. వెంటనే మళ్ళీ బయలు దేరింది బస్సు.

కిటికీలోంచి బయటికి చూస్తున్నాను. బలమయిన కొత్త పార్టీలో చేరిపోయేందుకు సిద్ధంగా ఉన్న రాజకీయ నాయకుడిలాగా చీకట్లోకి జారుకుంటూన్న పగటి బలహీనతని గ్రహించి తమ్ము తాము రక్షించుకునేందుకు హడావుడిగా పరుగులు తీస్తున్నాయి పక్షులు.

"చిల్లర లేకపోతే దిగిపొండి. నా దగ్గరలేదు" అంటున్నాడు కండక్టర్ ఖచ్చితంగా.

ఏమిటా అని లోపలికి చూశాను.

కొత్తగా ఎక్కిన ఆవిడ దగ్గర నిలబడి ఉన్నాడు కండక్టర్. ఆవిడచేతిలో పదిరూపాయల నోటుంది.

"లేదు. ఉంటే ఇచ్చేదాన్నిగా! చూడండి!" అంటోంది ఆవిడ మెల్లగా—పది రూపాయల నోటున్నా డబ్బు లేని దాని పరిస్థితిలో.

"నేను మాత్రం ఉంటే ఇవ్వనా— అలా మాటాడతారేం? ప్రతివాళ్ళు అయిదులూ, పదులూ ఇస్తే మా దగ్గర మట్టుకు ఎక్కడినుంచి వస్తుంది?.... ఎవరి దగ్గరయినా ఉందేమో అడగండి పోనీ" అని వెనక్కి తిరిగి అందరివంక చూశాడు.

ఎవ్వరూ మాట్లాడలేదు. ఉమాపతి మాత్రం ఏకదీక్షతో చదివేస్తున్నాడు. ఇంత హడావుడి పడుతుంటే ఈయన కనీసం తల ఎత్తడేం అని ఆశ్చరం వేసింది నాకు.

"చూశారా—లేదు. అయినా నలభయి పైసల టిక్కట్టుకోసం పదులు యిరవైలూ తెస్తే ఎలాగండి? పోనీ చివరిదాకా వస్తారా అంటే అదీ లేదు......లాభంలేదు దిగిపొండి!" అని ఈలేశాడు.

బస్సు వేగం తగ్గుతోంది.

పాపం ఆవిడ అందరివంకా చూసింది. ఒక్కసారి బయటకు చూసింది. చీకటి పడిపోయింది. నాకు జాలేసింది.

"పోనీ ఎక్కినచోటయినా కాదు—ఆవిడ్ని దిగమంటే ఎలా దిగుతుందయ్యా?" అన్నాను కలగజేసుకుని.

"నాకుమాత్రం సరదాటండీ! బస్సు నాదయితే "ఊరికేనే తీసుకుపోదును మీ అందరినీ!...... అంతగా లేకపోతే ఎవరైనా సర్దరాదూ!

నేను జేబులు వెతికాను. మూడు పది పైసల బిళ్ళలు కనబడ్డాయి. ఒక్క క్షణంచూసి ఉమాపతిని తట్టి "మీ దగ్గర పది పైసలుంటే ఇవ్వండి" అన్నాను.

అతనొకసారి నా వంక, ఒకసారి ఆమెవంక చూసి "నా దగ్గర లేవు. ఉన్నా ఇవ్వను. ఇచ్చినా పుచ్చుకోరు!" అనేసి మళ్ళీ పుస్తకంలోకి దూరిపోయాడు.

నాకు చాలా ఆశ్చర్యంవేసి ఆమె వంక చూశాను. ఆమె నా చూపులు తప్పించుకుంటు బయటకు చూడసాగింది. ఇందులోని చిత్రం నా కర్థం కాలేదు.

"నా దగ్గర ముప్ఫయి పైసలున్నాయి" అన్నాను జనాంతికంగా. కండక్టరు వచ్చి అందుకున్నాడు.

మరెవరో ఒక పది ఇవ్వబోతే ఆమె "నా దగ్గర



"పది ఉందిలెండి" అని అందించి "మీరెక్కడిదాకా వెడతారు?" అనడిగింది మెల్లిగా.

"మీ ఊరే!" అన్నాడు కండక్టరు.

ఎందుకో నాకు సిగ్గనిపించింది. ఇంతమందిలో పెద్ద మొనగాడిలా నేనే డబ్బెందుకు ఇవ్వాలి?...... అంతలో హటాత్తుగా ఉమాపతిలోని వింత ప్రవర్తన గుర్తుకొచ్చింది.

"పది పైసలు ఇవ్వమంటే ఎందుకలా మాట్లాడాడు? లేకపోతే లేదని చెప్పచ్చుగా! ఆవిడ కూడా అతనివంక చూసిన విధం లోగడ బాగా పరిచయం ఉన్నట్టుగా ఉంది" అని అనుకుంటుంటే ఉమాపతి మాటలు ఆపేసి పుస్తకంలోకి తలదూర్చేయడం గుర్తుకొచ్చింది. "పాయింటే! బహుశ రోడ్డుమీద ఆవిడని చూసి అలా వేసి ఉంటాడు"

మరొక్కసారి వీళ్ళిద్దరివంక చూశాను. ఆవిడ మాత్రం మధ్య మధ్య అతనివంక చూస్తోంది. ఉమాపతి పుస్తకంలోని అక్షరాలను లెక్కపెట్టేస్తున్నాడు.

అడుగుదామనిపించింది. "ఆవిడ్ని ఎరుగుదురా" అని. కాని సభ్యత అడ్డు వచ్చింది.

కుతూహలంకొద్దీ ఆమెని పరీక్షగా చూశాను. షుమారు ముప్పయి ప్రాంతాల ఉంటుంది. అందమయిన మనిషి. అయితే కష్టపడడంవలన ఎండ దెబ్బ కొట్టిన దానిలా వడిలిపోయింది. చేతికి రెండేసి బంగారపు గాజులు, రెండు మామూలు గాజులు, మెడలో ఒక గొలుసు—మొత్తంమీద ఆకృతి, అలంకరణ కూడా సంస్కారం ఉన్న దానిలా ఉన్నాయి.

నేను దిగవలసిన ఊరు రాగానే గబుక్కున బస్సు దిగిపోయింది ఆవిడ.

ఎవరికయినా ఏదయినా సాయం చేస్తే వారు కృతజ్ఞతలు చెప్పుకుంటుంటే మనం చాలా ఇరుకున పడిపోతాము—అబ్బే ఇందులో ఏముందండి—

ఆంతర్యం

అంటూ. కాని అది మన అంతరాంతరాల్లో తృప్తిని కలిగిస్తుంది. వారలా చెప్పకపోతే బాధ పడడం సహజం.

అందుకనే నేను కూడా "వింత మనిషిలా ఉందే" అనుకుంటూ దిగి కిళ్ళీ కొట్టు దగ్గర నిలబడి ఆవిడనే గమనిస్తున్నాను.

నేరుగా పళ్ళ దుకాణంకి వెళ్ళి అక్కడ పళ్ళు కొనుక్కొని సంచీలో వేసుకుని గబగబ మళ్ళీ బస్సు దగ్గరకు వచ్చి చుట్టూ నాకోసం చూస్తోంది.

నా తొందరపాటుకి సిగ్గుపడి నేను రోడ్డెక్కాను. కాని ఆమె, ఉమాపతి మాత్రం నా మనస్సులో మెదులుతూ ఉన్నారు.

చేపలు నీళ్ళలో మునిగి ఉండి ఊపిరి పీల్చగలవు. అదే వాటి లోకం కూడా! అయితే మధ్య మధ్య నీటిపైకి వచ్చి సూర్యరశ్మిని అనుభవించి మళ్ళీ లోనికి పోతుంటాయి. తిరిగి పైకి వచ్చేదాకా మళ్ళీ వాటి లోకం అదే!

జీవితపు గాడిలో పడిపోయిన నాలాటి వాడికి కష్టమే అయినప్పటికీ అటువంటి సమావేశాలు, వివాహాలే ఆట విడుపులు—ఏదో పోగు జేసుకున్నది ఏమయినా ఉంటే సరదాగా ఖర్చు పెట్టుకునేందుకు నలుగురిలో తిరిగేందుకు. తిరిగి యధాప్రకారం జీవనం. ఉదయం సాయంత్రం నలుగురికి తోచిన నాలుగు ముక్కలు చెవిన వేయడం, పదినుంచి అయిదింటిదాకా బడిలో రంగస్థలం మీది నటుడిలా వాగడం ప్రారంభమవుతుంది.

ఇంతకీ నే చెప్పవచ్చేది ఆ సంఘటన మరిచి పోయాననికాదు—మరుగున పడిపోయిందని దానికి అనుబంధంగా మరోటి జరగకపోతే మరుపున పడిపోయేది. అలాగే జరిగి ఉంటే ఈ కథ చెప్పడమన్నది జరిగేది ఉండేదికాదు.

ఒకరోజు బస్టాండ్‌కేసి వెళ్ళాను. మా బావ మరిది వస్తానంటే ఆయనకి దిగే వ్యవధానం లేదుట, ఏవో రెండు విషయాలు చెప్పవలసినవి ఉన్నాయి బస్ దగ్గరకు రమ్మనమని రాశాడు. ఈ బావ మరుదులు అన్న జనాభా రాజ బంధువుల కోవకి చెందినవారు. మన మనస్సుకి కష్టంగా ఉన్నా, వారిని చిరునవ్వులతో పలకరించాలి, ఎక్కడికి రమ్మంటే అక్కడ వారిని కలుసుకోవాలి. అలా జరగనినాడు ఇంట్లో పుట్టగతులుండవు!

వారికోసమని స్టాండింగులో రేకుల షెడ్డుకింద నిలబడి ఉన్నాను. వచ్చే బస్సు వస్తోంది. వెళ్ళేది వెడుతోంది. కాని ఆయనగారు మాత్రం ఫికరు లేదు. మరోటి అనుకుంటూ నేను అలాగే నిలబడిపోయాను.

అప్పుడే వచ్చిన ఒక బస్సులోంచి నాపేరు వినబడేసరికి చటుక్కున అటు తిరిగాను ఆశగా. కాని తీరా చూస్తే మావాడు కాదు—మోహనమూర్తి.

మోహనమూర్తి, నేను డిగ్రీ క్లాసులో సహాధ్యాయులం. పెద్దలు సంపాయించినది రెండు చేతులకు సరిపడ ఉండగా, మనం వేరే కష్టపడడమెందుకని పరీక్షకి కూర్చోకుండానే ఇంటికి చేరుకున్నవాడు ఇతను. చదువుకునే రోజుల్లోని ఇతని ప్రవర్తనమీద రక రకాల వ్యాఖ్యానాలు ఉండేవి. అవి నిజమన్న నమ్మకమూ ఉండేది. మనిషి మాత్రం బావుంటాడు మేడి పండులా!

దగ్గరగా వెళ్ళి "ఏమోయ్ బాగున్నావా?" అనడిగాను.

"మన బాగుకేం లోటు బ్రదర్! మనకు కావలసినవి డబ్బుకు దొరుకుతూ, కావలసినవి సంపాయించుకునేపాటి డబ్బూ ఉన్నప్పుడు!" అని తన తెలివికి తనే ఫెళ్ళున నవ్వాడు.

ఒక్క క్షణంపాటు ఆ "కావలసిన వేమిటో" పూర్తిగా అర్థం కాలేదు. అంతలోనే గ్రహించుకున్నాను. మనిషిని చూస్తే అసహ్యం వేసింది.

"బస్సు బయలుదేర బోతున్నట్లుంది. ఎక్కితే మంచిది" అన్నాను హెచ్చరిస్తున్నట్టుగా.

కాని అతను నా ఊసు పట్టించుకోవడం లేదు. దృష్టి ఎటో ఉంది. అతను చూస్తున్న వైపుగా చూపు పోనిచ్చాను.

బస్సులో కనబడిన ఆవిడ అగపడింది. అతని వైపు చూస్తున్నదల్లా నేను కూడా తన వైపు చూడడంతో ఖంగారుపడి గబగబ బస్టాండుకి అడ్డుపడి వెళ్ళిపోయింది.

ఇటు తిరిగేసరికి మోహనమూర్తి బస్సు ఎక్కి కూర్చుని "మొత్తానికి భలే భలే వాళ్ళని చేరదిస్తుందోయ్ మీ ఊరు!" అన్నాడు వెకిలిగా నవ్వుతూ.

కష్టంవేసింది నాకా మాటకి. అయినా మామూలుగానే "ఎరుగున్నావా ఆమెని?" అనడిగాను.

"బ్రహ్మాండంగా!"

"ఏమన్నా అవుతుందా నీకు?"


"ఇప్పుడేమీ కాదు!"

"ఒకప్పుడు?" ఆత్రంగా ప్రశ్న వేశాను.

అతను చెప్పేలోపలనే బస్సు బయల్దేరింది.

"మరోసారి వచ్చినప్పుడు......లేకపోతే అడగరాదూ చెబుతుంది!" అని నవ్వాడు.

అచేతనంగా నిలబడిపోయాను.



"అయ్యా! మీరింతవరకు 'కుటుంబ నియంత్రణం' చక్కగా అమలు పర్చారు. సంతోషం, మీరిక ఇద్దరు పిల్లల్ని కనవచ్చు సార్!"

ఆలోచనలు చీకట్లలాగా ముసురుకుంటు న్నాయి. ఆమె ఎవరు—ఉమాపతి ఆమెను ఎరు గున్నాడు. ఎలా? మోహనమూర్తికి బాగా పరి చయం ఉంది ఆమెతో—ఏవిధంగా?...... కొంపదీసి ఆమె ఒక—

...కాని ఆ ఆలోచనని అక్కడితో అణిచి పెట్టేశాను. ఆమెను గురించి చెడుగా ఆలోచించేం దుకు మనసొప్పలేదు.

వచ్చినపని మాత్రం పూర్తి కాలేదు. మా రాజ బంధువు రాలేదు. బజారులో కాసేపు ఊరేగి ఇంటికి చేరుకున్నాను. వెళ్ళగానే మా ఆవిడ చెప్పింది, "మీ కోసం ఎవరో వచ్చారు" అని.

"ఎక్కడున్నారుట?" అన్నాను.

"వంటింట్లో—పిలవనా?"

"అయితే నేరుగా ఇంటికే వేంచేశాడన్నమాట!"

"మా వాళ్ళేం వంటింట్లో చేరరు. ఆ బుద్ధి మీ వాళ్ళకే—నామీద పరీక్షకి!......పిలుస్తా నుం డండి" అని వెళ్ళబోయింది.

"జడని బాగానే ఊపుతున్నావుగాని ఊడి వచ్చేను సవరం!" అన్నాను నవ్వుతూ.

"మీ విగ్గుకన్న నయమేలెండి!" అంది వెక్కి రింపుగా.

"పతి దేముడ్ని అంతలేసి మాట లనచ్చు శే— వాది విగ్గా?"

"మరి నాది సవరమా—ఉట్టి ఈర్ష్య!"

లోపలనుంచి మా ఇందిరతో వచ్చిన ఆవిడని చూసి ఆశ్చర్యపోయాను. నా మనస్సులోని ప్రశ్న లకి సమాధానంలా నుంచునుంది నా ఎదట.

"ఆయనే మా ఇంటాయన, ఇల్లుగలాయ వాను" అని నవ్వి, "రాజేశ్వరి ఈవిడ పేరు. నాకు కాబోయే మాస్టరుగారు" అని పరిచయాలా చేసింది ఇందిర.

నేను ప్రశ్నార్థకంగా ఆమె వైపు చూశాను.

"ఇందిరగారు మా స్కూల్లో కుట్లు నేర్చు కుంటారుట!......మా అబ్బాయి మీ దగ్గర స్టూడెంటు" అని, తరువాత "నమస్కారం" అంది.

నేను కూడా నమస్కారం పెట్టి, "ఇదూ కాస కాఫీ......" అంటూంటే మధ్యలోనే అందు కుని, "మా వప్పుడే అయాయిలెండి. మీ కోసం ఉంచాను" అని లోపలికి వెళ్ళింది ఇందిర.

నేను ఏంచేయాలో తెలీయక "కూర్చోండి" అన్నాను.

కింద చాపమీద కూర్చుంటూ, "నన్ను గురించి నేను కొంత చెప్పుకోకపోతే మీరు నన్ను అపార్థం చేసు కునే ప్రమాదం ఉందని వచ్చాను మాస్టరు గారూ" అంది.

నేనేమీ మాట్లాడలేదు.

"నాకు ఒకప్పుడు ముఖ్యులయిన ఇద్దరితో మీకు పరిచయం ఉండడంవలన నేను మీకు నా కథ చెప్పక తప్పదు. మీరు వినక తప్పదు"

నేను నవ్వుతూ, "సభ్యత అడ్డు వచ్చింది కానీండి, మీరు కనబడగానే అడుగుదామనుకున్న మొదటి రెండు ప్రశ్నలూ అవే!" అన్నాను.

రాజేశ్వరి తలవంచుకుని, "ఉమాపతి మా అన్నయ్య. ఇక రెండవాయన మా ఆయన" అంది.

ఆశ్చర్యపోయాను.

ఇందిర నాకు కాఫీ అందించి, చాపమీద గోడ వానుకుని కూర్చుంది.

40 వ పేజీ చూడండి

గ్రహస్థితి

మిథునంలో రాహువు, ధనుస్సులో సూర్య అంగారక బుధ కేతువులు, మకరంలో శుక్ర శనులు, మీనంలో గురువు, మకర కుంభ మీన మేషాలలో చంద్రుడు.

20-12-1963 శుక్రవారము మొదలు
26-12-1963 గురువారము వరకు.

మేషం :

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా.)

మానసికంగా శ్రమ పెరుగుతుంది. ఆలోచనలు ఎక్కువ. మనస్సులో రహస్యం దాచుకోలేక పోవటంవల్ల విరోధాలు, నిష్ఠురాలు పెరుగుతవి. గృహకృత్యాలలో మీరు అనుకొనేవి యథాతథంగానే కాకపోవచ్చు. అయినా మొత్తంమీద ఇబ్బంది మాత్రం కనుపించదు. ప్రయాణం చేస్తారు. వ్యవహారాల విషయంలో ముందు కొంత అశ్రద్ధగా ప్రవర్తించటం అనంతరం శ్రమపడి సర్దుకొనటం జరుగుతుంది. వారం మధ్యలో సంతోష వార్తలు తెలుస్తవి. లోగడ చేసిన శ్రమకు ప్రతిఫలం లభిస్తుంది. అధికారులను కలుసుకొనటం, శుభ లాభ కార్యాల నిర్ణయాలు ఏదో ఒక కారణంవల్ల తాత్కాలికంగా నిలచిఉంటవి. వ్యాపార రంగంలో భారీగా ప్రవర్తించటంవల్ల శ్రమ ఏర్పడుతుంది.

* * *

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా.)

దైవానుగ్రహంవల్ల ఈ సమయంలో మీ సంకల్పానికి ముందే మార్గం ఏర్పడుతూ ఉంటుంది. అయినా మధ్యలో కొన్ని అభ్యంతరాలు వచ్చి తొలగిపోతవి. పిల్లల మూలంగా సంతోషం, సుఖం లభిస్తవి. ఉద్యోగ వృత్తులలో తెలియని భారం పైన పడుతుంది. మీ స్థానంలో గౌరవం మాత్రం బాగుంటుంది. పరిస్థితుల ప్రాబల్యంవల్ల కోపం పెరగగల అవకాశాలున్నవి. మీ వ్రాతలు, చేతలు సంఘంలో పదిమందినీ ఆకర్షించగల సమయం. ఆదాయం పెరుగుతుంది. వారం రెండవ భాగంలో దుబారా వ్యయానికి అవకాశం ఉన్నది. కొన్ని సందర్భాలలో ముందు నిజం తెలుసుకొనలేక రకరకాల సందేహాలకు గురి అవుతారు. బంధువులవల్ల అనుకూలత ఉంటుంది. 25, 26 తేదీలలో శుభవార్తలు, వృత్తిలో లాభదాయకమైన మార్పు.

* * *

మిథునం :

(మృగశిర 3, 4 పా, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

గ్రహబలం బాగున్నదని నిర్లక్ష్యంగా ఉండతగిన సమయంకాదు. ఎక్కడికక్కడ చిన్న చిన్న విషయాలే



దైవజ్ఞ పాతూరి శ్రీరామమూర్తి

పెంచి కలహాలకు దారితీసేవారు ఉంటారు. మీ ఆరోగ్యము సరిగా ఉండదు. ఖర్చులకు తగినట్లు ఆదాయం అందకపోవచ్చు. కోర్టు కచేరీలలో సమరసంగా సర్దుకుని పనులు పూర్తి చేసుకోవలసిన సమయం. "ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడన్నట్లు" గా ఉంటుంది బాహ్య విషయాలలో గౌరవంగా ఉన్నా ఉత్సాహం, తృప్తి తక్కువ. మీ ఆరోగ్యం గురించి జాగ్రత్తగా ఉండటం అవసరం. వృత్తిలో మీరు విశ్రాంతి తీసుకొందామనుకొంటూఉండగా అకస్మాత్తుగా కార్యక్రమాలు పెరుగుతవి. అనుకొన్న కార్యం పూర్తిచేసేలోపల అనేక రకాల అభిప్రాయాలు వస్తూఉంటవి. సాహసకార్యాలకు అనువైన సమయం కాదు. 21, 22 తేదీలలో ధనలాభం, పుణ్యకార్యాలు, అధికారుల స్నేహం.

* * *

కర్కాటకం :

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష.)

ప్రస్తుతం గురువు అనుకూలంగా ఉన్నాడు. మీ స్థితిని కాపాడుకొంటూ ముందుకు పోగలుగుతారు. సంఘంలో గౌరవం లభిస్తుంది. ఆర్థికంగా ఇంతకుముందున్న కొరతలు చాలా భాగం తగ్గిపోతవి. ఈ సమయంలో అయినవారు శత్రువర్గంలో చేరినా బాధపడవద్దు. ఇతరులకు సహాయం చేయవలసిన బాధ్యతలను మాత్రం నెరవేర్చలేక పోతారు. బంధుమిత్రులమీద కార్యభారం పెట్టతగిన సమయం కాదు. ఇతరులవద్దనుంచి రావలసిన ధనం, వస్తువులు సమయానికి లభిస్తవి. కొన్ని వార్తలు ఆకస్మికంగా మిమ్ములను చకితులను చేయవచ్చు. మీ క్రింది పనివారితో పేచీలు వచ్చి సర్దుబాటు అవుతవి. వృత్తిలో పోటీదారులు కాచుకొన్నట్లుగా ఉంటుంది. కుటుంబంలో అభిప్రాయభేదాలు వస్తూ ఉంటవి. అధికారులవల్ల అనుకూలత.

* * *

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

ఉద్యోగ వృత్తులలో వడిదుడుకులు లేకుండా సహజంగా సాగిపోగల సమయం. మనస్సుకు నెమ్మ

ఈ వారము ధరలు

పప్పుల రకాల ధరలు, అందులో ముఖ్యంగా కందులకు గిరాకి కనుపించగల అవకాశా లున్నవి. చింతపండు ధర నిలకడగా ఉంటుంది. ప్రత్తి, నూలు ధరలు వారం రెండవ భాగంలో తగ్గుతవి. వేరుశనగ నూనె ధరలో మందీ వస్తుంది.

దిగా ఉంటుంది. పైవారివల్ల మంచిపేరు లభిస్తుంది. తోటివారు రకరకాల సలహాలు చెబుతారు. కాని, మీరు నిగ్రహించుకో గలుగుతారు. ప్రయాణ సన్నాహాలు చేయుటమే కాని, జరిగే వరకు నమ్మటానికి వీలుకాదు. సాటివారివల్ల సహాయం బాగుంటుంది. కుటుంబంలో అనారోగ్యాలు, అభిప్రాయభేదాలు తాత్కాలికంగా మిమ్ములను శ్రమ పెడుతవి. దైవకార్యాలు నెరవేరుతవి. బంధువుల వద్ద నుంచి నిరుత్సాహకరమైన వార్తలు తెలుస్తవి. మీ బాధ్యతలను సకాలంలో నిర్వర్తించి మంచిపేరు పొందగలుగుతారు. ఆదాయం పెరుగుతుంది. ముందు ముందు లాభించబోవు పనులకు ప్రారంభ సన్నాహాలు సాగుతవి. 20, 21 తేదీలలో ఖర్చు, శుభవార్తలు, గౌరవం.

* * *

కన్య :

(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా.)

మీ ఓర్పుకు పరీక్షా సమయం. అనుకొన్న పనులు అడ్డం తిరిగినట్లు కనుపిస్తవి. అయినవారు విరోధ మవుతారు. వృత్తిలో శ్రమపడినా ప్రయోజనం తక్కువ. సంఘంలో ప్రతి పనీ పోటీతో జరుపవలసి ఉంటుంది. పర్యవసానంలో ఫలితం అనుకూలంగా ఉంటుంది. ఆదాయం మామూలుగా ఉంటుంది. మనస్సు ఒక సమయంలో ఉన్నట్లు మరొక సమయంలో ఉండదు. పైకి తెలియకుండా మీ ఆరోగ్యం లోపిస్తుంది. నిజం చెప్పి నమ్మించటానికి కూడా శ్రమ పడవలసిన సమయం. పదిమందిలో పెద్దరికం లభించినట్లే ఉంటుంది. అయితే బాధ్యతలు ఎక్కువ. పై అంతస్థులో ఉన్నవారిని కలుసుకొనే అవకాశం లభిస్తుంది. మీ ఆలోచనలు ఇతరులకు లాభిస్తవి. ప్రయాణ సూచన లున్నవి. వ్యవహారాలను ఏదో ఒక విధంగా పరిష్కరించుకొనటం మంచిది. 24, 25 తేదీలలో కార్యానుకూలత, మానసిక ఆందోళన, స్వల్ప లాభం.

* * *

తుల :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ, 1, 2, 3 పాదాలు)

మీరు ప్రయత్నించిన ఏ పనీ సాధారణంగా వృథా కాదు. అయితే అందుకు సంకల్పించటంలోనే

ఆలస్యం. ముందు సందేహాలు, అందుకు సర్దు బాట్లు వీటిని గురించి ఆలోచిస్తూ ఉంటారు. వృత్తిలో మంచి మార్పు వస్తుంది. అధికారులతో స్నేహం కలుస్తుంది. పెట్టుబడి పెట్టి భారీ కార్యక్రమాలకు పూనుకో గలుగుతారు. కుటుం బంలో కావలసిన సౌకర్యాలు, సుఖము లభిస్తవి. కొన్ని సమయాలలో అనుకోకుండా ఉద్రేకం కలుగు తుంది. మీ క్రింది పనివారివల్ల కొంత మోసం జరుగుతున్నట్లు తెలుస్తుంది. అయితే పర్యవసా నంలో కార్య సాఫల్యం కనిపిస్తుంది. వృత్తిలో ముందుగా తెలియని అవకాశాలు, మార్పులు ఏర్పడు తవి. పోటీవారిలో అసూయ కనుపిస్తుంది. మీ ప్రసంగాలలో తొందర పడవద్దు. ధనాదాయం బాగుంటుంది. విశ్రాంతి తక్కువ. కోర్టు కచేరీ లలో పనులు పూర్తికావు. వృథా శ్రమ, వ్యయం.

*　　*　　*

వృశ్చికం:

(విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

శ్రమపడినందుకు పనిని సాధిస్తారు. అయితే ఆ రెంటికీ విలువ చూసుకొంటే నిరుత్సాహం కలుగవచ్చు. వృత్తి వ్యాపారాలలో క్రమక్రమంగా మంచి సూచనలు కనుపిస్తవి. బాధ్యతలు తగ్గు తవి. సన్నిహితులు లభిస్తారు. ఇంతకుముందుకన్నా ఖర్చులు పెరిగే సమయం. ఇంతకుముందు విరు ద్ధంగా తోచిన పనులు ఈ సమయంలో చేస్తారు. ఏ విషయంలోను భంగం అంటు ఉండదు. బాహ్య విషయాలలో గౌరవప్రదమైన సమయం. రాజ కీయాలలో పలుకుబడి పెరుగుతుంది. వస్తువులు, వాహనాదులు కొంటారు. అయినవారితో ఎంత జాగ్రత్తగా ఉండే అంత మంచిది. ఈ సమ యంలో జ్ఞాపకశక్తి తగ్గుతుంది. కొన్ని సమయా లలో చికాకు కలుగుతుంది. కుటుంబంలోనివారి ఆరోగ్యం బాగుండదు. 22, 23 తేదీలలో ప్రయాణ సూచన, గౌరవం.

*　　*　　*

ధనుస్సు:

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)

చేసినకొద్దీ పని పెరుగుతూ ఉంటుంది. మీరు అనుకొన్నంత లాభం కనుపించదు. ఇతరులతో ఒప్పుకొన్న బాధ్యతలను సకాలంలో తీర్చుకొన గలుగుతారు. బంధుమిత్రులవల్ల రకరకాల ప్రశ్నలు ఎదురు అవుతూ ఉంటవి. ఇతరులవద్ద నుంచి రావ లసిన ధనం వస్తుంది. పిల్లల ఆరోగ్యం గురించి జాగ్రత్తగా ఉండవలసిన సమయం. ఈ సమ యంలో ఇతరులకు సలహా చెప్పటం వంటి పను లకు పోవటం మంచిది కాదు. శుభకార్య ప్రయ త్నాలు సుముఖంగా ఉంటవి. తలవనితలంపుగా అప వాదులు రాగల సమయం. క్రొత్త బాధ్యతలు ఒప్పుకొన తగిన సమయం కాదు. రకరకాల ఆలో చనలతో విసుగుదల ఏర్పడుతుంది. మొత్తంమీద మీ వృత్తి కార్యక్రమాలు సాఫీగా జరుగుతవి. త్రిప్పట, పెరుగుతుంది. 21, 22 తేదీలలో ప్రయాణ సూచన, ధనలాభం, శుభవార్త.

మకరం:

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా.)

ప్రస్తుతం ముందు జాగ్రత్త అవసరం. మాట చెప్పినంత సులభంగా పనులు జరుగతగిన సమయం కాదు. ఖర్చులు విపరీతంగా పెరుగుతవి. మీరు ఎంత మృదువుగా మాట్లాడినా ఎదటివారికి విపరీ తార్థమే తోచవచ్చు. వ్యాపార కార్యక్రమాలు ఒక దానికొకటి పొందికలేక శ్రమ పెరుగుతుంది. అయితే ఫలితం మాత్రం సమయంలోనే అందు తుంది. వ్యవహార రంగంలో పెద్ద ప్రయోజనం లేకపోయినా గౌరవం నిలుస్తుంది. కుటుంబంలో సుఖం తక్కువ. సంతోషవార్తలు తెలుస్తవి. క్రొత్త ఆలోచనలు వచ్చినా ప్రస్తుతం అనుకూ లత ఉండదు. అకస్మాత్తుగా దెబ్బ గాయము మొద లయిన వాటివల్ల బాధ కలుగుతుంది. వస్తువులు కొనే ప్రయత్నాలు సాగుతవి.. అయితే తోటివారి వల్ల నిరుత్సాహం కలుగుతుంది.

*　　*　　*

కుంభం:

(ధనిష్ఠ 3, 4 పా., శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)


ప్రస్తుతం సూచనలన్నీ బాగుంటవి. కావలసిన వస్తువులు, హంగులు సమయంలో అందుతవి. శ్రమపడి సహాయం చేసేవారు లభిస్తారు. వ్యయం అయినా కష్టం తోచదు. భాగస్తులతో కలసి వ్యాపారం వంటి పనులు ఆరంభించతగిన సమయం. ఒక్కొక్క సమయంలో పట్టుపట్టి మాట నెగ్గించుకొన గలుగుతారు. లోగడ భయ ఆందోళన లను కలిగించిన వ్యవహారాలు పరిష్కార స్థితికి వస్తవి. కుటుంబంలో కార్యభారంతోపాటు సుఖ సంతోషాలున్నూ లభిస్తవి. ఈ వారంలో సంచారం అధికం. వారం రెండవ భాగంలో తాత్కాలిక మనో వికారాన్ని కలిగించే వార్తలు తెలుస్తవి. చాలాకాలం నుంచి కష్టపడి పనిచేసినందుకు ఫలితం చేతికి వస్తుంది. అధికారుల ఆదరాభిమానాలు బాగుంటవి. నీచులతో సహవాసం చేయవలసి వస్తుంది. జాగ్ర త్తగా ఉండండి. ఆదాయం బాగుంటుంది.

*　　*　　*

మీనం:

(పూ. భాద్ర 4 పా., ఉ. భాద్ర, రేవతి)

అప్పుడప్పుడు ధన సంబంధమైన సర్దు బాట్లలో శ్రమ తెలుస్తుంది. అన్నివిధాలా మంచి తనము, పలుకుబడి బాగుంటవి. మనశ్శాంతి లభి స్తుంది. తలచిన పనులు నెరవేర్చటానికి తగిన స్నేహితులు లభిస్తారు. ఏదో ఒక విధంగా పుష్క లంగా డబ్బు వచ్చి ఖర్చు అవుతూ ఉంటుంది. ఈ సమయంలో పైన వేసుకొనే బాధ్యతలు భార మైనవి. అయినా ధైర్యోత్సాహాలు బాగుంటవి. వృత్తిలో సమస్యలు ఏర్పడి వాటంతట అవి తొలగి పోతూ ఉంటవి. అయితే ఏవిధి విషయంలోను జోక్యం కలిగించుకొన తగిన సమయం కాదు. బంధువులను గురించి అసంతృప్తికరమైన వార్తలు తెలుస్తవి. కుటుంబంలో అనారోగ్య దోషాలు కను పించగల సమయం. 25, 26 తేదీలలో ధన లాభం, వృత్తిలో మంచి మార్పు. ★


కోమలాంట
గంగాధర్
హరిబాబు

నిప్పులు చెరుగుతున్న ఎండలోంచి చెట్టు నీడకి వచ్చేసరికి చెడిన సంసారం ఒడ్డుకు చేరి నట్లు ప్రాణం హాయి గొలిపింది.

చెట్టు క్రిందకు వచ్చాడు వాసుదేవపతి. అంత వడగాడ్పు ముఖంమీద చెమటవల్ల చల్లగాలనిపించింది. సగం అరిగిన చెప్పుల్లోంచి బయటపడ్డ మడమలు ఇంకా మండుతున్నాయి. పైనున్న తువ్వాలుతో చెమట తుడుచుకున్నాడు.

ఆవల చెట్టు మొదట్లో మోళీసాయబు కోతుల్ని ఆడిస్తున్నాడు.

వాసుదేవపతి డమ డమ శబ్దం విని అటు వెళ్ళాడు. చుట్టూ చేరిన జనం కోతి చేష్టలకు నవ్వుతున్నారు.

జనాన్నిచూసి మోళీవాడికీ హుషారు కలిగింది. మగ కోతి తాడు పట్టుకలాగుతూ, "పెళ్ళాం అన్నం పెట్టకపోతే ఏం చేస్తావ్!" అన్నాడు. అది అలిగినట్లు, కోపంగా చూస్తూ తలవంచుకు కూర్చుంది. ఆడకోతి తాడును లాగి "నీ మొగుడికి కోపం వచ్చింది. బతిమాలు పోయి" అన్నాడు సాయబు. అది పోయి బ్రతిమాలుతున్నట్లు గడ్డం పట్టుకున్నది. మగకోతి విదల్చికొట్టి అటు తిరిగి పోయింది. ఆడకోతి దాని కెదురుగా పోయి గడ్డం పట్టుకుంది. జనం విరగబడి నవ్వారు.

వాసుదేవపతికి అంత బరువైన గుండెతోనూ, నవ్వు ఒక తరంగంలా ముఖం పైకి వచ్చిపోయింది. మనసులో ఏదో, మానవ జీవితం మెదలాడింది.

సాయబు అనేక రకాలుగా ఆడించాడు. ఆడ కోతికి ఒక డబ్బాయిచ్చి "పొత్తింటి కాపురం ఎలా చేస్తావ్" అన్నాడు.

ఆడకోతి డబ్బాను విసరి కొట్టింది.

"వేరింటి కాపురం ఎలా చేస్తావే—" అంటూ కొట్టాడు సాయబు.

కోతి డబ్బాను అతి జాగ్రత్తగా దింపింది. చుట్టూ చేరిన జనం పగలబడి నవ్వారు.

వాసుదేవపతికి మనసు కలచినట్లయింది. జుగుప్సతో ముఖం తిప్పుకున్నాడు. ఇంకా సాయబు ఆట సాగిస్తున్నాడిలానే.

అక్కడనుండి బయటకు చరచరావచ్చి ఎదురుగావున్న చెట్టు నీడన చేరాడు. మనసులో ఎక్కడో ఆ కోతులాటే తచ్చాడుతూ ఉంది.

చెట్టు కొమ్మల్లో గూడు కట్టుకున్న కాకమ్మ నీరసంగా కేక వేసింది. తలెత్తి చూసాడు వాసుదేవపతి. ఆ తల్లి ప్రక్కనే పిల్లకాకి ఎర్రని నోరు తెరచి ఆవురావురుమంటూ రెండు సార్లు ప్రాణం లేనట్లు కేరుమంది.

ఒక్కసారి పారిజాతం, మాధవుడూ జ్ఞాపకం వచ్చారు. జేబు చూసుకున్నాడు వాసుదేవపతి. నడక కుదుపులో కాగితపు బిరడాఊడి సీసాలోంచి మందు కొద్దిగా కారి జేబు తడిసింది. సీసా బయటకుతీసి, చేతిలో పట్టుకొని దాని వంక చూసాడు. రక్తం పిండి సంపాదించిన నీళ్ళకు గుర్తుగా ఎర్రగా ఉందా మందు.

"పారిజాతానికి వెంటనే మందు ఇవ్వాలి. వంట చేసేనేగాని మాధవుడి పెట్టి వచ్చినా బాగుండేది. వాడు తిన్నాడో లేదో. అది పక్కలోంచి లేవలేదు. చేసే వాళ్ళేవరు వాడికి పెట్టటానికి—"అనుకోగానే ఎండ మనసును చేరలేదు. రోడ్డున విసురుగా బయలు దేరాడు.

పారిజాతం స్థితి తలుచుకోగానే దుఃఖం పొంగుకొచ్చింది వాసుదేవపతికి—"ఎవరు చేసుకొన్నారు. దిక్కూ మొక్కూ లేకుండా తనకు తనే చేసుకుంది! లక్షణంగా కుదురుగా బ్రతుకుతున్న జీవితాన్ని ఒక్క కుదుపులో దూరంగా లాక్కొచ్చుకుంది. వేరింటి కాపురంతో భామున్న దేవిటో"—కోపంగా గొణుక్కుంటూ త్వరగా నడచాడు.

అన్న బలరామయ్యతో విడిపోవటానికి పారిజాతమే కారణమని వాసుదేవపతికి. మాధవుని మూలంగా రేగింది అనుకున్నా "పసివాడు. వాడికేం తెలుసు. నేచేసిన ఘనకార్యం మాత్రం ఏమిటి" అనుకొని ఆ కోపం తనపై మరల్చుకొనేవాడు.

*　　*　　*

ఇది జరిగి రెండేళ్ళు.

మాధవుడికి పూలు తెచ్చాడు వాసుదేవపతి ఆ రోజు. పారిజాతానికి మాధవుడిని ఆడపిల్లలా అలంకరించడం ముచ్చట. ఆనాడూ అలంకరించింది.

బలరామయ్య కూతురికి ఉక్రోషం వచ్చింది. పూలన్నీ పిన్ని తన కొడుక్కి పెట్టుకుందని. పిన్నినలా వెళ్ళ నిచ్చి మాధవుడి తలలో పూలు పీకి పరుగెత్తింది. మాధవుడు గొల్లున ఏడవడం మొదలెట్టాడు.

పారిజాతం పిల్లవాడి ఏడుపు విని గబ గబా వచ్చింది. జుట్టు మరింత రేపుకుంటూ ఏడుస్తున్నాడు మాధవుడు. తానింత సేపు దువ్వి, తలకు పూలు చుట్టింది. వీడు రేపుకున్నాడన్న కోపంతో ఒక్కటేసి ఏమయిందని అడిగింది. అక్క పూలు పీకిందని చూపాడు.

ఆ విసురనపోయి తోడికోడల్ని నాలుగు మాటలన్నది. అసలే మొగుడన్నా మాట పడదు రుక్మిణమ్మ. పారిజాతం మాటలు జోరుగా అనేసరికి తనూ రెండు మాటలన్నది.

"ఆ పువ్వులు నీ మొగుడు తెస్తే మాత్రం—ఇంట్లో ఆడపిల్ల దానికి ముందు పెట్టాలిగాని మగాడు నీ కొడుక్కి ఎందుకు! అదీ చిన్న పిల్లేగా. దాని కళ్ళు కుట్టాయి" అన్నది కూతుర్ని సమర్థిస్తూ రుక్మిణమ్మ.

"ఏం చిన్నపిల్ల! పదేళ్ళు దున్నని పెట్టుకొని! ఇన్ని తెస్తే అందరికీ సరిపోతాయా? పసి కుంక పెట్టమంటే పెట్టాను. ఆ మాత్రం పెట్టుకో వాలనుంటే వాళ్ళ నాయన్ను అడగలేదా ఏం?" అన్నది పారిజాతం.

తన కూతురు వయసు తలవగానే రుక్మిణమ్మకు ఒళ్ళు మండింది.

"మాట్లాడితే దానికి పదేళ్ళంటావు. నీ వయసెంతా?" అన్నది రుక్మిణమ్మ వెక్కిరింపుగా.

"నా జాతకం చూడాలనుంటే మీ మరది వచ్చిన తరువాత అడుగు" అన్నది పారిజాతం.

"నా మరదితో పనేమిటి? నిన్ను చూస్తే తెలీదూ—" అన్నది రుక్మిణమ్మ.

పారిజాతం కోపంగా చూస్తూ "అవును, నీకు మరది ఎందుకు. ఆయన తెచ్చిన సంపాదన కావాలి గాని" అన్నది.

రుక్మిణమ్మ మాట్లాడలేకపోయింది. భర్త సంపాదన వచ్చేసరికి అహం పూర్తిగా దెబ్బతిన్నది గొంతులో దుఃఖం పేరుకున్నది.

బలరామయ్య సంపాదన స్వల్పం. తెచ్చినదైనా తన సిగిరెట్లకు, చిట్టాటకూ సరిపోతుంది. వాసుదేవపతి కాంట్రాక్టరు దగ్గర మేస్త్రీ. ఇరు చేతుల సంపాదనతో ఇంటిని గుట్టుగా కాసుకొస్తున్నాడు. ఇది అందరికీ తెలిసిందే. పారిజాతానికి ఈ అక్కసు, గర్వమూ ఉన్నాయి. అది ఇవాళ పైకుబికింది.

కోడళ్ళిద్దరి మాటలూ అత్తగారు వింటూనే ఉన్నది. ఆవిడొక్కమాట అనలేదు. కోడళ్ళు చల్లారగానే ఇద్దర్నీ కేక లేద్దామనుకుంటూ చూస్తున్నది.

ఇంతలో బలరామయ్య వచ్చాడు. అతడ్ని చూడగానే రుక్మిణమ్మకు దుఃఖం ఆగలేదు. ఏడుస్తూ ఆయన గదిలోకి వెళ్ళింది. బావగారిని చూడగానే అప్పటిదాకా బరిమీద ఆడిన పారిజాతం బెరుగ్గా లోనికి వెళ్ళిపోయింది.

అసలే విసిగివున్న బలరామయ్యకు రుక్మిణమ్మ చెప్పిన మాటలు చాల వెగటుగా తోచాయి. ఇవాళ తన అసమర్థత మరదలు ఎత్తి చూపింది. జీవుడు చచ్చిపోయినట్లు కూర్చున్నాడు మాట్లాడకుండా. రుక్మిణమ్మ ఎదుట అలానే నిలబడి ఉన్నది.

సరాసరి మరదలు గది దగ్గరకువచ్చి బయట నిలబడి గట్టిగా కోపంగా అన్నాడు బలరామయ్య—"ఏం పారిజాతం! నీ కెందు కింత గర్వం? ఇంట్లో చిన్నా పెద్దా లేదా? నీ మొగుడు సంపాదిస్తున్నాడని మాట్లాడుతున్నావు—నీవేపాటి ఇంటినుండి వచ్చావో తెలుసా!"

బావగారు తనని మందలించడంతో చాల సిగ్గనిపించింది పారిజాతానికి. ఏదో సమాధానంచెబుదామని ఆలోచించుకుంటుండగానే బలరామయ్య తిరిగి—"ఇక మాట్లాడకు. నే నెవరినో తెలుసా? నీ బావగారిని జాగ్రత్త!" అన్నాడు మందలింపుగా.

బలరామయ్య ఎవ్వరితోనూ గట్టిగా మాట్లాడడు. అతడి కింత కన్న మాటలు దొరకలేదు.

బావరిగారి అదలింపు తల గొట్టినట్లయింది పారిజాతానికి—వెంటనే "నేనే ఇంట్లోనుండి వస్తేనేం? ఉన్నవారి చేతుల్లోనే వద్దాను" అన్నది లోగొంతుతో.

బలరామయ్య కంత దూరంలో ఉన్న రుక్మిణమ్మ ముందు కొచ్చి—"అలానే ఇందాకా అంది ఏమమ్మా! మీ ఆయన తెచ్చిన దాంట్లో ఎం వెనకేసావేం. లేకపోతే ఈ సంసారాన్నంతా మీ నడుపుతున్నారా!" అన్నది.

బలరామయ్య ఇంకే సమధానం వినలేదు. ఆయనకు కోపం ఎప్పుడూ రాదు. ఆనాడు వచ్చింది. మరదలు సమాధానంలో ఇంత అంతరార్థం ఉందని భార్య వ్యాఖ్యానించగానే కోపం మిన్నుముట్టింది.

"ఇంక ఆపండి. ఎవ్వరు మాట్లాడినా వాళ్ళ నాలుకలు తెగగోస్తాను. ఆఁ—పోండి. వసులాని—వాడితోనే తేల్చుకుందాం" అని గట్టిగా ఇల్లెగిరేటట్లు కేక లేసాడు.

రుక్మిణమ్మ గబగబా తన గదిలోకి వెళ్ళిపోయింది. పారిజాతం స్తబ్దురాలై అలానే కూర్చుంది.

బలరామయ్య అరుగుమీద కూర్చొని ఒక్కసారి తన ఆర్జన గూర్చి తర్కించుకొన్నాడు. తనమీదే తనకు అసహ్యం వేసింది. అసహ్యం కోపంగా మారి ఇదేదో తేల్చుకొని మరీ నిశ్చయించుకుందాం అనుకున్నాడు.

వాసుదేవపతి బాగా చీకటి పడ్డాక ఇల్లు

30వ పేజీ చూడండి





వర్ధమాన తోరణమున.


కేరాడు. అంతా నిశ్శబ్దంగా ఉంది. తల్లి ఒక్కతే వంటింట్లో పాటుపడుతున్నది. పిల్లలిద్దరూ వంటింటి గుమ్మంలో కూర్చొనున్నారు.

తమ్ముడినిచూసి లోపలికి వచ్చాడు బలరామయ్య. ఎలా ప్రస్తావించాలని ఆలోచిస్తుండగానే వాసుదేవపతి పారిజాతాన్ని పిలుస్తూ వంటింటి

కోతుల లాట

27 వ పేజీ తరువాయి

వైపు వెళ్ళాడు. తండ్రి కేక విని గబగబా ఎచ్చి కాళ్ళకు చుట్టుకున్నాడు మాధవుడు. వాడి నెత్తి కొంటూ, "అమ్మ ఏదిరా!" అన్నాడు వాసుదేవపతి.



"అమ్మ బబ్బుంది నాన్నా!" అని గది వైపు చూపాడు మాధవుడు.

వాసుదేవపతి గదిలోకి వెళ్ళి పారిజాతంపైన చెయ్యి వేసి—"ఏమే ఒంట్లో బాగోలేదా?" అన్నాడు.

"చావొక్కటి రాలేదని చూస్తున్నా!" అన్నది అక్కసుగా.

వాసుదేవపతికి అర్థం కాలేదు.

"ఏమిటే నీ ముఖం? ఏమొచ్చింది" అన్నాడు.

పారిజాతం రుక్మిణమ్మమీద చిలవలు పలవలు చేసి చెప్పింది. బావగారు భార్యను వెంట వేసు కొనివచ్చి పోట్లాడింది చెప్పి—"అత్తగారు ఎదురుగా ఉన్నారు. కొడుకును ఒక్క మాట అనలా—" అన్నది చివరకు ఏడుస్తూ.

"నువ్వేమన్నావు?—" అనడిగాడు ప్రశాంతంగా.

"నేనేమంటాను—నేను లేని దాన్నే. కాని ఇంత సంపాదించే మగవారి చేతిలో ఉన్నా. వాడే దిక్కు అన్నాను.

"అన్న—" అని చెప్పబోతుండగా.

"ఇంకేమంటారు ఆయన. మాట్లాడావంటే నాలుక తెగగోస్తాను జాగ్రత్త అన్నారు—" అన్నది పారిజాతం.

వాసుదేవపతి మెల్లగా గది బయటకు వస్తుండగా పారిజాతం అతడికి వినపడేలా—"ఇక తప్పదు. నే బతికున్నంత కాలం కుక్కిన పేనులా కుక్కబతుకు బతకాల్సిందే లాగుంది. దీని బదులు చావైనా రాదు" అన్నది వెక్కి వెక్కి ఏడుస్తూ.

వాసుదేవపతి వెనక్కి తిరిగిచూసి నీళ్ళ గదిలోకి వెళ్ళిపోయాడు.

బలరామయ్య తిరిగి అరుగుమీద చేరి కూతురితో తమ్ముడికి కబురు చేసాడు.

"ఏం అన్నయ్యా పిలిచావా?" అన్నాడు వాసుదేవపతి వచ్చి అరుగుమీద కూర్చుంటూ.

ఒక్క క్షణం మాట్లాడకుండా కూర్చొని తమ్ముడి వైపు చూడకుండానే—"పారిజాతం చాల దురుసుగా ప్రవర్తించిందిరా వసూ!" అన్నాడు.

"పోనీలే అన్నయ్యా! ఏమీ పట్టించుకోకు" అన్నాడు వాసుదేవపతి నెమ్మదిగా.

బలరామయ్యకు ఇంకా కోపం తగ్గలేదు. రుస రుస లాడుతూ లేచి "దానికి బుద్ధి చెబుతూ గట్టిగా కేక లెయ్యి. లేకపోతే అది మరీ ఎదిరించి మాట్లాడుతుంది" అన్నాడు.

"మనం ఆడవాళ్ళమీద కేక లేస్తే అంత బాగోదన్నయ్యా — ఆడవాళ్ళు ఆడవాళ్ళు ఏవో అనుకున్నారు. వాళ్ళతో మనం కలియబడటం బాగోదు." అన్నాడు వాసుదేవపతి తిరిగి నెమ్మదిగా.

ఎప్పుడు నిలబడిఉందో తలుపు ప్రక్కనుండి రుక్మిణమ్మ—"ఏం? బావగారు ఆమాత్రం కోప్పడ కూడదూ మరదల్ని. అంత ఎదిరించి సమాధానం చెబుతుందేం?" అన్నది గట్టిగా.

బలరామయ్య అక్కడనుండి లేచి భార్య వంక చూసి "నువ్వు లోపలికి పో" అని కసిరి తమ్ముడి వంక చూస్తూ, "నాకు తెలుసురా వసూ! నీ పెళ్ళాం నీకు నూరిపోసింది. నువ్వేమనుకుంటున్నావో చెప్పు. చక్కగా చేద్దాం—నేను ఎందుకూ పనికి రాని వాడినని నీ పెళ్ళాం అంది. సరే! ఈ సంసారాన్నంతా నువ్వే ఇవాళ దాకా గడిపావు అంతేనా!"

అన్నాడు కోపంగా.

"అదంతా ఇప్పు డెందుకన్నాయ్యా? అన్నీ మరిచిపో" అన్నాడు వాసుదేవపతి విసుగ్గా.

లోపలికి చరచరా పోయాడు. బలరామయ్య. వసారాలోంచి గట్టిగా తల్లిని కేక వేసాడు. ఆవిడ రాగానే ఆవిడ వంక చూస్తూ, "చిన్ని కోడలన్న మాటలు నేనెలా మరచి పోతానమ్మా? ఇప్పుడు

కోతులాట

నువ్విక్కడ కూర్చో. వసుగాడిని పిలిచి అన్నీ పరిష్కారం చెయ్యి—లేదా ఈ ఇంట్లో వచ్చి మంచి నీళ్ళైనా ముట్టను" అన్నాడు గట్టిగా.

అరుగుమీదనుంచి వాసుదేవపతి లోపలికి వచ్చి "ఇప్పుడు పరిష్కారం ఏమిటి? అర్థంలేని మాటలు. దాన్ని పిలిచి దండించమంటావా?" అన్నాడు చిరుకోపంగా.

"ఎవరినీ దండించ నక్కరలేదు. మీ మనసులో ఉన్నదేదో మీరిద్దరూ చెప్పేయండి. మీ సంసారం విడిగా పెట్టుకోవాలనుంటే చెప్పు. నువ్వేదో పిఆర్జనంతా మాకే పెడుతున్నట్లు చెబుతుంది నీ పెళ్ళాం—పోనీ మీ సంసారం మీరే చూసుకోండి"

కోతులాట

లన్నాడు గబగబా.

వాసుదేవపతి క్షణం సేపేమీ మాట్లాడలేక పోయాడు. అలానే కూర్చొండి పోయేసరికి బలరామయ్య తల్లి నుద్దేసిస్తూ "చూసావే అమ్మా! వీడు ఇంతకాలం దాచాడిది. వీడు విడిపోయి బాగు పడతానంటేనే కాదన్నానా. ఇప్పుడు బయట పడేసరికి తేలు కుట్టిన దొంగలా మాట్లాడక ఎలా చూస్తున్నాడో" అన్నాడు గట్టిగా.

వాసుదేవపతి అన్న వంకా, తల్లివంకా బిత్తర బోయి చూస్తూ—"అది కాదన్నయ్యా. నేనేమీ.." అనబోయాడు.

బలరామయ్య వినలేదు.

"చాలురా వసూ! ఇక మాట్లాడకు. నీకు ఎలా ఈ ఇంట్లో భాగం కావల్సినా ఇస్తాను. రేపు చెప్పేయి" అంటూ తువ్వాలుమీద వేసుకొని వీధిలోకి వెళ్ళిపోయాడు.

వాసుదేవపతి నిర్ఘాంతపోయి అలానే చూస్తూ ఉండిపోయాడు.

ఇక చక్కబడదనిపించింది. రాత్రంతా అలానే కూర్చుండిపోయాడు. మరునాడు ప్రొద్దుటే ఊరున పడి ఇల్లు వెతుక్కొని వచ్చాడు.

బట్టలు ఒక రేకు పెట్టలో సర్ది అది మాత్రం తీసుకొని కొడుకు, భార్యతో బయటకు వస్తూ అన్న దగ్గరకు వెళ్ళి "నువ్వు చెప్పినట్లే వెళ్తున్నా నన్నయ్యా—నీ దయ ఉన్నప్పుడు మా ఇంటికి రా" అని కన్నీళ్లు పెట్టుకున్నాడు వాసుదేవపతి.

బలరామయ్యకు కన్నీళ్లు జలజల రాలేయి. ఇలా ఇంట్లోంచి పోతాడనుకోలేదు.

"నిన్ను వేరేగా ఉండమన్నాగానీ, వేరే ఇంటికి పొమ్మనలేదు. నీకక్కరలేని ఇల్లు నాకెందుకు" అన్నాడు గాద్గదికంగా.

"ఈ ఇల్లు నీదే—" అన్నాడు వాసుదేవపతి కన్నీళ్లు తుడుచుకొని.

"దీంట్లో నీ భాగం కూడా ఉంది" అన్నాడు గంభీరాన్ని తెచ్చిపెట్టుకొంటూ.

"నాకేమీ వద్దన్నయ్యా—అమ్మ నీ దగ్గరే ఉంటుంది. ఆవిడ భాగంగా అది ఉంచేయి— వస్తాను" అని తల్లి దగ్గరకు వెళ్ళి ఆవిడ పాదాలకు నమస్కరిస్తూ, "నువ్వు బాలన్నయ్య దగ్గరే ఉండమ్మా. నీకు దయ ఉంటే రావాలనుకున్నప్పుడు రా" అన్నాడు బాధగా.

పారిజాతం వచ్చి అత్త పాదాలను తాకి "వెళ్ళొస్తా నత్తయ్యా" అన్నది.

ఆవిడ అలా శిలా ప్రతిమలా కూర్చొనుండి పోయింది. దీనికంతా కారణం తానుగా బాధ పడుతున్నది.

తానే గనుక కోడళ్ళిద్దరూ నోళ్ళు చేసుకున్నప్పుడు గద్దించిఉంటే ఇలా జరక్కపోయే దేమోననిపించింది. ఎలాగైనా వాళ్లూ వాళ్లూ ఒకటి. ఇవాళ పోట్లాడుకొని రేపు ఒకటవుతా రనుకున్నదేగాని ఇలా కొడుకులు నిముషాలమీద విడిపోతారనుకోలేదు. మొదట్లోనే ఈ విషపు చెట్టుని, గిల్లివేస్తే పెరిగి ఉండేది కాదని తనలో తాను కుళ్ళిపోతూ ఉన్నది.

వాళ్లు వెళ్ళిపోయారు. ఇల్లు పాడు బడ్డట్టనిపించింది బలరామయ్యకు. తానెంత తొందరపడ్డాడో ఇప్పుడు తెలుస్తూ ఉంది.

ఎప్పుడన్నా వాసుదేవపతి లోటు తలచుకుంటున్నప్పుడు రుక్మిణమ్మ ఎదురు పడితే—"ఈ ఇల్లు హాయిగా ఉందా నీకు. ఏలుకో నువ్వొక్కదానివే" అనేవాడు మొదటి రోజుల్లో. "వసు ఈ భారమంతా నా నెత్తిమీద కెక్కించి వెళ్ళాడు" అని గొణుక్కునేవాడు ఎవ్వరూ లేనప్పుడు.

*　　*　　*

ఇల్లు వదలి వెళ్ళగానే వాసుదేవపతిని అన్నీ వదలిపోయాయి. ఒక్కసారిగా కాంట్రాక్టరు దివాళ తీసా నన్నాడు.

ఊర్లు వదలి ఊర్లు తిరిగాడు. ఉద్యోగం కోసం. అప్పుడప్పుడూ అనిపించేది—"అన్నయ ఉసురు తగులుతూంది. గర్వంగా ఇల్లు వదిలానే ఏంబావుకుందామని?"—అని.

ఈ ఊరి నీళ్ళు పడక పిల్లాడికి జబ్బు చేసి గాబరా పెట్టింది. వాడు దేవుడి దయవల్లనిం కులాసాగా ఉన్నాడులే అనుకుంటుండగా పారిజాతం మంచం పట్టింది. రెండేళ్ళ నాటి పారిజాతాన్ని చూస్తే ఇప్పుడు గుపర్తు పట్టలేము.

అలవాటు పడ్డ కాళ్లు గుమ్మంలో ఆగాయి. క్షణమాగి లోపలికి అడుగు పెట్టాడు వాసుదేవపతి.

మాధవుడు తల్లి పక్కలో ఉన్నాడు. ఏడేళ్ల వాడు. బహు అర్భకు డవటంచేత నాలుగేళ్ళవాడులా ఉంటాడు.

వీధి తలుపు చప్పుడు విని దిగి వచ్చి తండ్రిని చూడగానే—"నాన్నా! అన్నం తిన్నా" అన్నాడు సహజమైన కీచు గొంతుకు నీరసంతో తోడుగా.

పారిజాతం ప్రక్కకు ఒత్తిగిలి భర్తనుచూసి ప్రాణంలేని స్వరంతో "ప్రొద్దుటనగా ఏమీ తినకుండా వెళ్ళేరు. ఎండలో పరగడుపున తిరక్కండంటే వినరు" అన్నది.

భార్య మాటలు వినిపించుకోకుండా గూట్లో సీసా పెట్టి కొడుకును దగ్గరకు తీసుకొని "నువ్వే పెట్టుకు తిన్నావట్రా!" అన్నాడు ఆప్యాయంగా తల నిమురుతూ.

"ఆహా—కాదూ— అమ్మ పెట్టింది" అన్నాడు తల్లివంక చూస్తూ మాధవుడు.

భార్య లేచి పెట్టిందనగానే విసుగ్గా "నిన్ను లేవద్దన్నానా! డాక్టరు పక్కలోంచి కదలవద్దని చెప్పలా" అన్నాడు.

"వాడు ఆకలో మొర్రో అంటుంటే ఏం చేసేది! ఇంతసేపు ఎక్కడ తిరిగారు?" అన్నది.

"అలానే అక్కడ పెట్టిన జావ తాగక పోయావా" అన్నాడు భార్య వంక చూస్తూ.

"ఓపిక లేకపోయింది. ఎలాగో వాడికి పెట్టి వచ్చి పడుకున్నా—"

ఆవిడ కంఠంలోనే ఎంత ఆయాస పడిందో తెలుస్తూనే ఉన్నది.

వాసుదేవపతి జావ తెచ్చి పక్క ప్రక్కనే పెట్టాడు.

"ప్రొద్దుటనుంచీ ఏమన్నా తిన్నావా!" అన్నాడు ఆవిడ వంక చూస్తూ.

"ఆ—ప్రొద్దున కాఫీ అంతా తాగలేకపోయాను. కొద్దిగా మిగులితే నిన్న రాత్రి రొట్టె ముక్కల్ని వేసుక తిన్నా"

గూట్లో మందుసీసా తీసి గాజు గ్లాసులో పోసాడు.

"జ్వరం పోయిందిగా—నీరసం. అదే తగ్గు

కుంది. ఇంతింత డబ్బు తగలేసి ఎందుకా మందు లన్నీ" అన్నది బాధగా.

పారిజాతం వైపు చూడకుండా మోతాదు పూర్తిగా గ్లాసులో పడిందీ, లేనిదీ చూస్తూ, "నేను చావకుండా బతికుండటానికి—" అన్నాడు వాసుదేవపతి.

భర్తమాట కర్కశంగా గుండెకు తగలగానే దుఃఖం కట్టలు తెంచుకొచ్చింది. అటు తిరిగి మెల్లగా తనలో తాను ఏడవ సాగింది.

వాసుదేవపతి మంచంమీద కూర్చొని—"ఊఁ మందు తాగు" అన్నాడు.

పారిజాతం ఇటు తిరగలేదు. అలానే ఉండి పోయింది.

"మందు తాగు" అన్నాడు మళ్లీ.

పారిజాతం కన్నీళ్లు తుడుచుకుంటూ—"వద్దు" అన్నది ఏడుపు కంఠంతో.

"ఊఁ—ఇటు తిరుగు. ఏమిటదీ" అన్నాడు.

పారిజాతం భర్తవైపు తిరిగి "ఎందుకంతలేసి మాటలంటారు. ఇప్పుడు నేను పడుతున్నది చాలదా" అన్నది కొద్దిగా బిగ్గరగా వణుకుతున్న స్వరంతో.

పారిజాతం చుట్టూ చెయ్యివేసి కూర్చోబెడుతూ —"నువ్వు నన్ను అర్థం చేసుకోవు పారిజాతం. ఈ మందులు మాకులకు డబ్బు తగలేస్తున్నా నంటావు. నువ్వు లేచి తిరక్కపోతే నేనెలా పని లోకి పోతాను" అన్నాడు.

పారిజాతం భర్త చేతిలో మందు తీసుకొని త్రాగి గ్లాసు తిరిగి అతడికిచ్చివేసింది.

ఆమె వంక చూస్తూ—"నువ్వు బ్రతికుంటేనే నేను బ్రతికేది. నువ్వెప్పుడు లేవో నేనూ ఉండను" అన్నాడు. అతడి కంఠం బిగుసుకు పోయింది.

పారిజాతం మాట్లాడలేదు. భర్త వంక దీనంగా బాధగా సంతృప్తిగా చూసింది.

"నీ సుఖం గూర్చి నాకేం తెలుసు. నీవు కోరిన దానిని ఏది వద్దన్నాను. నువ్వు కాదన్న దానిని దూరంగా తోసి వచ్చానే" అన్నాడు ఆవిడను పండుకోబెట్టి.

పారిజాతానికి తెలుసు. ఇది తన అన్ననూ, తల్లినీ వదలి వచ్చిన సంగతని. ఈ బాధలకు అదే కారణ మని అతనూహిస్తున్నాడని ఇప్పుడనిపించింది. మాట్లాడకుండా తాజేసిన అపరాధాన్ని తలచు కుంటూ అలానే భయంగా చూసింది.

"వాళ్ళకూ మనకూ ఋణం తీరిపోయింది" అన్నాడు.

ఇద్దరూ కొద్దిసేపు మాట్లాడలేదు.

భర్త గాంభీర్యాన్ని భరించలేక ఏదో మాట్లాడా లన్నట్లు—"ఇన్ని ఉత్తరాలు వ్రాసినా అత్తమ్మ గారైనా రాలేదు" అన్నది మెల్లగా.

వాసుదేవపతి మనసులో ఎక్కడో దాగిన కోపం బయటకు వచ్చింది.

"ఏ ముఖం పెట్టుకు వస్తుంది. ఈనాడు కష్టాల్లో పిలుస్తున్నాం. అప్పట్లో—అందరినీ వదలి రాలేదూ" అన్నాడు గట్టిగా.

పారిజాతం మాట్లాడలేదు. భర్త వంక చూడ లేక తల పక్కకు త్రిప్పుకుంది.

"నిజం పారిజాతం—ఇది బాలన్నయ్య శాపం. ఆయన ఉసురు తగులుతున్నది. ఇదంతా మనం చేతులారా చేసుకున్నదే" అన్నాడు తిరిగి బాధగా.

అలానే ముఖం చాటు చేసుకొని గొంతులో మాట గొంతులో కూరుకుపోతుండగా—"నేను పాపిష్టిదాన్ని" అన్నది.

వాసుదేవపతి పారిజాతం వీపుమీద చెయ్యివేసి ఓదార్పుగా నిమురుతూ కొంతసేపు మాట్లా డక ఎటో చూస్తూ ఉండిపోయాడు.

మెల్లగా "పారిజాతం! నిన్న ప్రొద్దుట భగ వంతరావు కలిసాడు. ఆయన అన్నయ్యకు బాగా తెలుసు. ఆయనతో అంతా చెప్పాను. వెళ్ళి కబురు చేస్తా నన్నాడు" అన్నాడు. వాసుదేవపతి ఏదో మనసులో పొడమిన ఆశను వెలువరించ యత్నిస్తూ.

పారిజాతంలో ఈ ఆశ ఎప్పుడో చచ్చిపోయింది, పిల్లవాడికి ప్రమాదంగా ఉందని ఎన్ని ఉత్తరాలు వ్రాసినా రాలేదు. ఇప్పుడు తన కొరకు వస్తారా!

భర్త వంక చూసి — "నేను బ్రతికుండగా వాళ్లు రారు. నేను చేసిన పాపం నాకు తెలుసు" అన్నది గాద్గదికంగా.

వాసుదేవపతి బాధగా భార్య వంక చూసాడు. భర్త చేతిని తన చెంపపైకి పెట్టుకొని తిరిగి దుఃఖపు జీరగల కంఠంతో — "రారు. వాళ్లెవ్వరూ మన గుమ్మం తొక్కరింక" అన్నది.

బయట తలుపు పెద్ద పెట్టున కిర్రు శబ్దం చేస్తూ తెరుచుకున్నది. అడుగుల చప్పుడు వినిపిం చింది. మాధవుడు తండ్రిని అనుకొని ఉన్నవాడల్లా గది గుమ్మంలోవచ్చి ఒక్క క్షణం పరీక్షగా చూసి ఆనందంగా "నాయనమ్మ—అమ్మా—నాయనమ్మ" అన్నాడు.

పారిజాతం శరీరం జల్లుమన్నది. రక్తం చల్ల బడుతున్నట్లనిపించింది. వాసుదేవపతి ముఖం పాలి పోయింది. మంచం మీదనుండి లేచాడు.

గది గుమ్మంలో దైన్యమూర్తిలా తల్లి నిలచి ఉన్నది. మాధవుడు నాయనమ్మ కాళ్ళను చుట్టి వేసాడు. వాడిని దగ్గరకు తీసుకొని కోడలి మంచం దగ్గరకు వచ్చింది.

అప్పటివరకూ గొంతున దాచిన దుఃఖం ఆగ లేదు. అత్తకు ముఖం చూపలేక తలావలకి తిప్పు కొని ఏడవసాగింది పారిజాతం.

కోడలిమీద చెయ్యివేసి, నోటి మాట రాక కొడుకు వంక చూసింది. నిర్జీవ దృక్కులతో కన్నీళ్లు కార్చుతూ గుమ్మానికి జార్లబడి నిలబడ్డాడు వాసు దేవపతి.

మాట పెగలి రాక జీరపోయిన కంఠంతో గాద్గదికంగా కొడుకువంక చూస్తూ — "వసు! మంచి శిక్ష వేసావు. నిన్ను ఇంట్లోనుండి వెళ్ళనిచ్చి నందుకు మంచి శిక్ష వేసావురా నాయనా! ఇక చాలు. నా పిల్లాడినీ, కోడల్నీ ఎంతకుతెచ్చి మా మీద కోపం తీర్చుకున్నావురా. ఈ శిక్ష చాలురా" అని భావురుమని ఏడ్చింది.

ముఖం పక్కకు తిప్పుకొని దుఃఖాన్ని కంఠంలో బిగించి పట్టుకున్నాడు వాసుదేవపతి.

ఆ దుఃఖంలో స్పృహ కొచ్చినట్లుగా ఆగి — "వసు! వెళ్ళు బయట అన్నయ్య ఉన్నాడు" అన్నది.


పారిజాతం, వాసుదేవపతులు ఉలిక్కిపడ్డారు. పారి జాతంలో మిగిలి ఉన్న ప్రాణం పోతున్నట్లనిపిం చింది. భర్త వైపు చూసి లేవ ప్రయత్నించింది. వాసుదేవపతి నిర్జీవంగా గది దాటి వెళ్ళాడు.

తల్లి మాటలు వినబడుతున్నాయి — "నువ్వు పడుకో పారిజాతం! మీరు వెళ్ళగానే ఆ ఇల్లు అమ్మే సాడు పెద్దోడు. ఆ ఎడ్రసుకు రాసిన ఉత్తరాలు మా కొక్కటీ చేరలేదే. ఇవాళ భగవంతరావు వచ్చాడు దేవుడిలాగ. వెంటనే మీ బావ, నేనూ వచ్చాము" అన్నది ఏడుస్తూ—

బయట నిలబడ్డ బలరామయ్యకు లోపలి ఏడుపు వినపడగానే నాల్గు అడుగులేసి ఆగిపోయాడు. తమ్ముడు ఎదురుగా రావటం చూసి గోడ వైపు తిరిగి కన్నీళ్ళు తుడుచుకున్నాడు.

వాసుదేవపతికి అన్నను ఎలా పలకరించాలో తెలీలేదు. గోడకు తలాన్చి నిలబడ్డ బలరామయ్య దగ్గరగా వచ్చి "బాలన్నయ్యా" అన్నాడు.

బలరామయ్య దుఃఖంతో వణికిపోతూ ముఖం కండువాతో కప్పుకొని "వసూ! ఈ పాపివాడి ముఖం చూడకరా!—వద్దు......నా ముఖం చూడకు" అని చిన్న పిల్లవాడిలా ఏడుస్తూ తమ్ముడి భుజం పై వాలిపోయాడు. ★



దేశ రక్షణకై ఆయుధాలు
ఎంత అవసరమో ఉత్పత్తి కూడా అంత అవసరమే!



మీరు ఉతికే బట్టలన్నియు మెరిసే తెల్లగాను, పరిశుభ్రంగాను వుంటాయి! సర్ఫ్‌యొక్క ఉతికే అధిక శక్తివల్లనే! ముద్దల కొలదీ నురగ! మీ చీరలు, వోణీలు, షర్టులు, పిల్లల బట్టలు ...ప్రతీదీ అమిత తెల్లగాను, అతి శుభ్రంగాను వుంటుంది. సర్ఫ్‌తో ఇంట్లో ఉతుక్కోండి!

సర్ఫ్ అమిత తెల్లగా ఉతుకును

SU. 38-140 TL

హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి

మనమూ-మన దేహస్థితి

19 వ పేజీ తరువాయి

గాలి ప్రదేశము ఏర్పడుతుంది. ఆ కాలవను ఇంగ్వైనల్ కెనాల్ (Inguinal Canal) అంటారు. ఉదర కుడ్యములో ఉండే దుర్బల ప్రదేశములలో ఇది ఒకటి. ఈ కాలవలో బీజములకు పోయే రక్తనాళములు బీజములనుంచి వచ్చే వెయినులు, వీర్యమును (Semen) వీర్యాశయమునకు తీసుకొని పోయే నాళమూ కలిసి ఏర్పడిన తాడువంటి నిర్మితి ఉంటుంది. దీనిని 'స్పెర్మాటిక్ కార్డు' (Spermatic Cord) అంటారు. కొన్ని సందర్భములలో ఇంగ్వైనల్ కెనాల్ పెద్దదై ఉదరంలో ఉండే, భాగములు క్రిందికి చొచ్చుకొని వస్తవి. ఆ స్థితిని ఇంగ్వైనల్ హెర్నియా (Inguinal Hernia) అంటారు. సీకము కదిలేదయినందున ఆ హెర్నియాలో ఒక భాగంగా ఉండవచ్చును. కాని ఎక్కువగా చిన్న ప్రేగు మడతలే అందులో ఉంటవి. 'ఇంగ్వైనస్' అంటే గజ్జ ప్రదేశము.

ఇలియము సీకమును కలిసే ప్రదేశానికి ఒక అంగుళం క్రిందుగా వెర్మిఫారం ఎప్పెండిక్సు సీకమును అంటి ఉంటుంది. ఎపెండిక్సు కూడా లోపల ఖాళీగా ఉండే నాళిక వంటి నిర్మితి. దీని ఆకారం, స్థితి అందరిలో ఒక మాదిరిగా ఉండదు. ఇది సీకముకు వెనుక ఉండవచ్చును. క్రిందికి వ్రేలాడుతూ ఉండవచ్చును. ఇలియముకు ముందు ఉండవచ్చును. అప్పుడు ఎప్పెండిక్సు ఉదర కుడ్యమును తాకుతూ ఉంటుంది. నాభినుండి తొంటి ఎముక అగ్రము వరకు ఒక గీత గీసి, దానిని మూడు భాగములుచేస్తే, 2, 3 భాగములు కలిసే చోటికి క్రిందుగా ఎప్పెండిక్సు ఉంటుంది. ఈ ప్రదేశమును 'మెక్‌బర్నీ' అనే శస్త్ర వైద్యుడు నిర్ధారించినందున దానిని 'మెక్‌బర్నీ ప్రదేశము' అని పేరు. శస్త్ర వైద్యుల కిది చాలా ముఖ్య విషయము. ఎప్పెండిక్సు తీసివేయడానికి చేసే ఆపరేషనులో ఉదర కుడ్యమును ఇక్కడే సాధారణంగా ఛేదిస్తారు. కోలను ముందు వైపున ఉండే టీనియం ఎప్పెండిక్సు మూలము వద్దకు పోతుంది.

ఎప్పెండిక్సు పొడవు 2 సెంటిమీటర్లనుండి 20 సెంటి మీటర్ల వరకు ఉండవచ్చును. శైశవంలో ఇది చాలా పెద్దదిగా ఉండి వయస్సు వచ్చిన కొలది చిన్నదై పోతుంది. కోలన్ గోడలో ఉండే పొరలన్నీ ఎప్పెండిక్సు గోడలోనూ ఉంటవి. దీని చుట్టూ లింఫాయిడ్ టిష్యూ ఉన్నందున దీనిని ఎబ్డామినల్ టాన్సిల్ (Abdominal Tonsil) అంటారు. దీనివల్ల ప్రయోజనమేమిటో ఎవరికీ తెలియదు. మానవ దేహ పరిణామంలో కొన్ని లక్షల సంవత్సరములకు ముందు దీనికేమైనా ప్రయోజనం ఉండేదేమో తెలియదు. కాని ఈనాడు అది ఇన్‌ఫ్లేం అయి బాధ, ప్రమాదము ఏర్పడడం తప్ప మరే ప్రయోజనమూ కనుపించదు. కాని వ్యర్థాంగముల లాగా దీనిలో రక్త సంచారము అల్పమై ఉండదు. ఎప్పెండిక్సు రక్త పుష్కలమైన నిర్మితి. ఎప్పెండిక్సు ఇన్‌ఫ్లేం కావడమును ఎప్పెండిసైటిస్ (Appendicitis) అంటారు. దీనిని గురించి ఆంత్ర రోగములను చర్చిస్తున్నప్పుడు మళ్లీ వివరిస్తాను.

కోలన్ ఆరోహ భాగము 16 సెంటి మీటర్లు, తిర్యగ్భాగము 50 సెంటి మీటర్లు, అవరోహ భాగము 25 సెంటి మీటర్లు, సిగ్మాయిడ్ కోలను 40 సెంటి మీటర్లు, రెక్టము 12 సెంటి మీటర్లు గుదనాళము 4 సెంటిమీటర్లు పొడుగు గలవి. ఈ భాగములలో ఆరోహ, తిర్యగ్ అవరోహ భాగముల నిర్మితి ఒకలాగే ఉంటుంది. పెద్ద ప్రేగులో మ్యూకస్ పొరలో ఉండే గ్రంథులు విల్లసులలాగా దాని కుహరంలోకి చొచ్చుకుని ఉంటవి. అవి ప్రధానంగా మ్యూకస్‌ను స్యందిస్తవి. లింఫాయిడ్ టిష్యూ పెద్ద ప్రేగు మ్యూకస్ పొరలో విరివిగా కనుపిస్తుంది. సిగ్మాయిడ్ రెక్టములను గురించి వచ్చేవారం చర్చిస్తాను. ★

రామ చరిత మానస



· తులసీదాసు ·

తెలుగు

ముంగర శంకర రాజు

10

కైకేయి రాముడు

ఇంతలో సూర్యోదయ మాయెను. రాజ ద్వారము వద్ద వైతాళికులు మేల్కొలుపులు పాడిరి. వీణ— వేణు— శంఖ— శహనాయి— మున్నగు మంగళ ధ్వనులు మ్రోగెను. సహ గమనము చేయ బోవుచున్న స్త్రీకి శృంగారా లంకరణపై యెట్లు అసహ్యము కలుగునో అట్లు రాజు చెవులకా మంగళ ధ్వనులు దుస్సహముగా నుండెను.

నిత్యమూ ప్రాతః పూర్వమే మేల్కాంచు ధరణీశుడు ఇంకనూ లేవకుండుట జూచి మంత్రులు రాజ పరిచారకులు ఆశ్చర్యపడిరి. అంతట వారు రాజుగారిని లేపి, వారి ఆదేశములు గైకొని వచ్చుటకై సుమంత్రుని రాజమహలునకు బంపిరి.

శయన గృహమంతటా విషాదచ్ఛాయలు వ్యాపించి చూచుటకు భయంకరముగా నుండెను. సుమంత్రుడు దిగులు గొని చిన్నగ రాజా రాణీ, యున్న ప్రదేశము చేరి, వారికి జోహారు పలి కెను. అతిదీనుడై, నాళము నుండి త్రుంచివేయ బడిన కమలము వలె ధరాగతుడై యున్న రాజు దయనీయ స్థితిని జూచి సుమంత్రుడు భయ ముచే మాటలాడలేక పోయెను. అంతట కైక సచివోత్తముని వైపవలోకించి—

"మంత్రీ ! మహారాజుకు రాత్రంతయూ నిద్ర పట్టలేదు, రామ— రామ యని కలవరిం చుచూ రాత్రి గడపిరి. కారణమేమో తెలియ రాకున్నది. నీవు ఈ సమాచారము శ్రీరాముని కెరిగించి, తక్షణమే అతనిని తోడ్కొని రమ్ము, ఆ పైన నీవు సంగతి సందర్భము తెలుసుకొన గలవు" అని చెప్పెను.

ఈ మాటలు విను చుండిన రాజు ఏమియూ పలుకక మిన్న కుండెను. రాణి మాటలు రాజు మాటలుగా భావించి సుమంత్రుడు రాముడున్న చోటుకు హుటాహుటి కదలెను. రాజాజ్ఞ చెవుల బడగనే శ్రీరాముడు సచివోత్తముని వెంట పాద చారియై శయన గృహమునకు వచ్చెను.

కేసరిని జూచి గడగడలాడు వృద్ధ గజము మాడ్కి భయాతురుడై, నేలబడియున్న తండ్రిని గాంచి తనయుడు నివ్వెర పడిపోయెను. ఘడి యలు లెక్క బెట్టుచూ కాచుకొని కూర్చొని యున్న మృత్యువా యన్నట్లు తండ్రికి సమీపము ననే యున్న తల్లిని జూచెను.

దుఃఖ మెటువంటిదో ఇంతవరకు కనివిని ఎరుగని దాశరథి ఇంచుక ధైర్య మవలంబించి, మధుర వచనముల మెల్లగా తల్లినిట్లు ప్రశ్నిం చెను.

"మాతాజీ ! జనకుని ఖేదమునకు కారణ మేమి ? తెలియ జేసిన వారి దుఃఖ నివృత్తికై యథాశక్తి ప్రయత్నము చేసెదను."

"రామా ! తండ్రిగారి దుఃఖమునకు కారణము నీవు. నీపై వారికున్న స్నేహ వాత్సల్యములే ఇందుకు ప్రధాన హేతువులు. వారు నాకు రెండు వరములు ప్రసాదించి యుండిరి ! నేనా వరములు నేడు కోరితి ! నా యభీష్టము తెలుసుకొన్న మీదట నీపై నున్న మమత కొలదీ ఇట్లు విచార గ్రస్తుడై పడియున్నారు. ఒక వైపు పుత్ర ప్రేమ మరొకవైపు చేసిన ప్రతిజ్ఞ. ఈ రెండి మధ్య వారి మనస్సు డోలాయమానమై ముడి వీడక యున్నది. రామా నీ కిష్టమైన తండ్రి ఆజ్ఞనను శిరసావహించి వారి దుఃఖము తొలగిం చుము."

మూర్తీభవించిన కఠోర దేవత వలె తీవిగ కూర్చొని, కైక సమాచార మంతయూ తుది మొదలు శ్రీరామునికి నిర్భయముగ తెలియ జేసెను. తల్లివలన సర్వము తెలుసుకొన్న మీదట కాకుత్థ్యమణి కౌసల్య తనయుడు లోలోన నవ్వు కొని, మధుర మంజుల భాషణముల నిట్లు మాట్లా డెను.

"జననీ ! తల్లి దండ్రుల అభీష్టాను సారము ప్రవర్తించి, వారిని సంతుష్టులను జేయగలవాడే నిజమయిన తనయుడు, అమ్మా ! పితృ వాక్య పరిపాలన, తల్లికి సంతోషము, ప్రియ సోదరు డైన భరతునకు రాజ్యప్రాప్తి, విశేషించి పరమ వాంఛ నీయమైన మునిజన సాంగత్యము, మున్నగునవి ఏకకాలమున సాధించుటకు, బహుళ ప్రయోజనకరమైన చతుర్దశ వర్ష వనవాసము లభించుట నా యదృష్టము. ఈ శుభ వార్తకు హృదయము ఆనందముచే ఉప్పొంగి పోవుచున్నది.

కానీ, ధైర్యశాలి, గుణశీలుడైన తండ్రిగారు ఈ స్వల్ప విషయమునకై ఇంతగా దిగు లొందిరా ! యని నాకు సందేహము కలుగుచున్నది. నా వలన యేదో పెద్ద అపచారమే జరిగి యుండును, అది నాతో చెప్పలేక బాధపడుచుండిరి.

తల్లీ ! నా మీద ఒట్టు పెట్టుకొని నిజము చెప్ప వేడుచున్నాను."

నీటి మట్టము సమతలముగ నుండిననూ దానిపై వంకర టింకరగా సంచరించుట జలగ స్వభావము, అటులనే నిండు మనస్సుతో నిష్క పటముగ పలికిన శ్రీరాముని మాటలను కైక విశ్వసించ లేక పోయెను. అయినప్పటికినీ శ్రీరా ముని అభిమతము తెలుసుకొని లోలోన సంత సించి, పైకి కపట ప్రేమ కనబరచుచు ఇట్లు శ్వాసించెను.

"తనయా ! నీతోడు, భరతునితోడు, ఇంత కంటె మరొక కారణము తెలియదు. జననీ జనకులకు, బంధు బాంధవులకు ప్రేమ పాత్రుడ వైన ఓ రామా ! నీవలన యే దోషమూ జరిగి యుండదు. తల్లిదండ్రుల అభీష్ట ప్రకారము నడచుకొందునని నీవు చెప్పిన మాటలు నిజముగ శ్లాఘనీయమైనవి. జననీ జనకులు చేసిన తప స్సుకు ప్రతిఫలముగ నీ వంటి సుపుత్రుడు కలిగెను. బిడ్డా ! వృద్ధాప్య దశలో తండ్రికి అపకీర్తి రాకుండాడునట్లు వారి అభిమత మెరిగి ప్రవర్తించెదవని విశ్వసించెదను."

గంగలో కలిసిన అశుద్ధ జలము కూడ శుద్ధ మగునట్లు కైక కుటిలోక్తులు రఘురాముని కర్ణములకు శ్రవణ పేయముగ నుండెను.

ఇంతలో దశరథుడు మూర్ఛ నుండి కొద్దిగ తేరుకొని రామా ! రామా !! యని కలవరించెను. అంతట సుమంత్రుడు రాజును లేవదీసి సుఖాసీనుని జేసి, రామమూర్తి వచ్చి యున్నాడని నివేదించెను.

తనకు పాదాభి వందనము చేసిన తనయుని కౌగిటిలోనికి తీసుకొని తండ్రి ప్రేమ విహ్వాలు డయ్యెను, కరుణా కలితుడైన కోసలపతి కన్నుల

జలధార గట్టెను. ప్రేమాధిక్యతచే నోట మాట రాని స్థితిలో దశరథుడు శ్రీరాముని హృదయమున కత్తుకొని కడుదీనుడై భగవంతునిట్లు ప్రార్థించెను.

"ఓ మహేశా ! సకల ప్రాణికోటులు నీ ఇచ్ఛాధీనమై వర్తించు చున్నవి. ఓ శివా ! ఈ దీనునిపై దయయుంచి నా మాట పాటించి శ్రీ రాముడు వనములకు పోకుండునట్లు అతని మనస్సు మార్చి వేయవలెను. నా కీర్తి ప్రతిష్టలు మంట గలసిననూ, నాకు స్వర్గ ప్రాప్తిలేక పోయిననూ చింత లేదు. స్వామీ ! నా రఘురాముడు నా కన్నులకు కనబడుచుండిన చాలు. అదియే నాకు పదివేలు. అని కోసలపతి కైలాస వాసుని కేలుమోడ్చి ప్రార్థించెను.

తండ్రి ప్రేమాధిక్యతచే మాట్లాడ లేకున్నాడని భావించి, తల్లి చెప్పినదే సత్యమని విశ్వసించి శ్రీరాముడు తండ్రి కభిముఖుడై ఇట్లు ప్రవచించెను—

"పితాజీ ! మీ దయనీయస్థితి జూచి మొదట నేను భీతిల్లితిని, కానీ తల్లిగారి వలన సర్వమూ తెలుసుకొన్న మీదట నా మనస్సిప్పుడు శాంతించెను.

జనకా!... ఇంత స్వల్ప విషయమునకై మీరిట్లు శోకించుట శోభ నీయముగాదు. తండ్రీ ! జననీ జనకులను దైవ సమానులుగా భావించి, వారిని సర్వ విధుల సంతోష పెట్టగలిగిన పుత్రుడు చతుర్విధ పురుషార్థములు సాధించి ధన్యుడగుచున్నాడు. మీ యాజ్ఞానుసారము నేను వనములకేగి జన్మ సార్థకము చేసుకొని శీఘ్రమే తిరిగి వచ్చెదను. ఈ శుభ సమయమున మీరిట్లు విచారించకనన్ను వనవాసము చేయుటకు దీవించి పంపుము, ఇప్పుడే తల్లిగారి వద్ద సెలవు తీసుకొని వచ్చెద ! ! అని విన్నవించి రామమూర్తి చరచర నడచుకొనుచూ తల్లి ఇంటి వైపు వెళ్లి పోయెను.

తేలు కుట్టిన ఉత్తర క్షణమందే దాని బాధ నర నరములకూ ప్రాకునట్లు ఈ దుర్వార్త నిముసములో నగరమంతటా శతసహస్ర ముఖంబుల వ్యాపించెను. ఉత్సవోత్సాహములతో వళ్లు మరచియున్న అయోధ్యపై నిముసములో విషాద చ్ఛాయలు ఆవరించెను. కరుణా రస సేనా వాహిని రణ భేరి మ్రోగించుకొనుచు వచ్చి పట్టణముపై విరుచుక పడినదా యన్నట్లు ఆ బాల వృద్ధులు శోకాహతులైరి. దావానలముచే దహింప బడిన కాననము కైవడి సాకేతవాసుల ముఖములు కాంతిహీనమై వెలవెల బోయెను. శోకార్ణవ మగ్నమైన అయోధ్యలోని స్త్రీ— పురుషులు అచ్చటచగట గుంపులు గూడి కైక చర్యను గర్హించుచూ గుసగుసలాడ సాగిరి—

"హా ! ఈ కైక కొంపకు కొరివి బెట్టెనే ! ఈ మూర్ఖురాలు తన చేతులారా తన కండ్లనే ఊడబెరికి చూడదలచినది, ప్రాణముల కంటే అధికముగ ప్రేమించిన పుత్రునికి వ్యతిరేకముగ కుట్ర బన్నుటకు ఈమె చేతులెట్లాడెనో ! స్త్రీ హృదయము అగాధమైనదనీ, వారి అంతర్యము అర్థము చేసుకొనుట అసాధ్యమనీ, బుజువయ్యెను. ఈ ప్రపంచములో అగ్నిచే దహింపబడని, జలధి గర్భమున ఇమడజాలని, కాలునకు జిక్కము కాని వస్తువే లేనట్లు ఆడుది ఆగ్రహించిన సాధింపని కార్యము లేదుకదా !"

"భగవంతుడు ఒకటి చేయదలచి మరొకటి చేసెననీ మొదట అమృతము చూపించి తుదకు విష మిచ్చెననీ" కొందరు దేవుని నిందించిరి." మహారాజు ఆడు దానికి లోబడి, యుక్తా యుక్త విచక్షణ కోల్పోయి చేతులార ఇంతపని చేసె కొనె" అని మరి కొందరు భావించిరి. ఈ కుట్రలో భరతునికి కూడ జోక్య ముండక పోదని ఒకడు శంకించెను, చంద్రుడు అగ్ని వర్షము కురిపించిననూ, అమృతము హాలాహలముగా మారిననూ భరతుడు భ్రాతృ ద్రోహము తలపెట్టడని మరొకడు ముందు వాని మాటను ఖండించెను.

ఇట్లు నగర వాసులు నానా విధముల శంకించుచుచూ, పరిపరి విధముల పరితపించ సాగిరి. కైకకు హితాభిలాషులైన కొద్ది మంది విప్ర వృద్ధ స్త్రీలు ఆమెను సమీపించి హితవు పలికిరి.

"అమ్మారాణీ ! నీ వలన లోకమున కింత క్లేశము కలుగుట వాంఛనీయము కాదు. పూర్వాపరము లాలోచించి చూచిన అవాంఛనీయమైన పరిణామములు సంభవించనున్నవి. సీత రాముని విడిచిపెట్టునా ! లక్ష్మణుడు గృహములో ఉండగలడా ! రాముడు లేని రాజ్యము భరతుడు చేపట్టునా ? ఒకింత విచారించిన యెడల నీకే బోధపడగలదు. అమ్మా ! వనముల కెళ్లు చున్న రాముని నివారింప జేయుము. ఒక వేళ రామచంద్రు డిచ్చట ఉండుట వలన ఉపద్రవోత్పాతములు కలుగునని తలచిన, అతనిని కాననమునకు బదులు గురు గృహమున నివసించునట్లు కోరుము. తల్లీ ! చేతులు కాలిన మీదట ఆకులు పట్టుకొను ప్రయత్నించుట నిష్ప్రయోజనము.

ఇప్పుడే నీవు నిజముగ విజ్ఞతతో ప్రవర్తించి నట్లైన నీ కపకీర్తి రాదు, రఘు వంశము నిలుచును, రాజ ప్రాణములు రక్షింపబడును. లోకమున కానందము కలుగును." అని వృద్ధాంగనలు అనేక విధముల బోధించి హితోక్తులు పలికిరి. కానీ వారి బోధనలు మంథర గట్టిగా దట్టించిపెట్టిన కైక చెవుల కెక్కలేకపోయెను.

పరిజన, పురజన, బంధుజనులు కైకను దూషించుచూ, తుదకు మా రామునికి అడవి దారి పట్టి పోవలసిన రాత కలిగెనా ! యని చింతించుచూ నిర్వ్యాపారులై నిట్టూర్చిరి.

తల్లి వీడ్కోలు

క్రొత్తగ పట్టుబడిన మదగజము కట్లు విప్పగనే అడవికి పారిపోవ సుకించు విధమున ఈ రాజ్య బంధముల నుండి విముక్తుడై స్వేచ్ఛగా వనవాసము చేయుటకు ఇప్పటికి గదా అవకాశము చిక్కెను. అని శ్రీరాముడు సుప్రసన్నుడై, తల్లివద్ద సెలవు తీసుకొనుటకు సంతోషముతో వచ్చి చేరెను.

కౌసల్య రామమూర్తిని ప్రియమాడ ముద్దిడి, ఒడిలో కూర్చుండ బెట్టుకొని, నేత్రముల ఆనంద బాష్పములు రాలుచుండ

"బిడ్డా ! మంగళ ప్రదమగు నీ అభిషేక మహోత్సవ మెప్పుడు ? నాయనా కొద్దిగ భుజించిన పిమ్మట మీ తండ్రిగారి వద్దకు వెళ్లుదువు కానీ, స్నానమునకు లెమ్ము !" అని పలికెను. కౌసల్య పుత్రప్రేమ సంతోషమనె కల్ప వృక్షము వలె పుష్పించి ఫలించి నట్లుండెను.

"అమ్మా ! తండ్రిగారు నాకు కానన రాజ్యము ప్రసాదించిరి, వారి మాట ప్రకారము పదునాలుగేండ్లు విపినము లందు విహరించి, తిరిగి వచ్చి నీ చరణములను దర్శించు కొనెదను. తల్లీ ! ఎలాటి విచారము పెట్టుకొనక నన్నాశీర్వదించి ప్రస్థానము చేయుటకు అనుమతించుము" అని రాముడు ప్రశాంతముగ తల్లితో పలికెను. రాముని మాటలు కౌసల్య హృదయమునకు బాణములవలె తగిలెను. వర్షధారకు 'జవాస' పుష్పము వాడిపోవు విధమున తనయుని చల్లని మాటలకు ఆ తల్లి హృదయము దహించుకపోయెను. సింహగర్జన విని హరిణి చందమున ఈ దుర్వార్త విన్నప్పుడు కౌసల్య సర్వేంద్రియములు ఢీలిగొని గడగడ కంపించి పోయెను. తుదకామె కొద్దిగ ధైర్యము కూడ గట్టుకొని—

"పుత్రా ! నిన్న రాజ్యమిచ్చుటకు ముహూర్తము నిర్ణయించి, ఈ దినము అడవులకు పొమ్మని చెప్పుటకు నీవు చేసిన అపరాధ మేమి? ఈ సూర్య వంశమునకు కార్చిచ్చు పెట్టిన ఆ పుణ్యాత్ము లెవ్వరో చెప్పుము" అని పరివేదనతో పలికెను.

తల్లి పశ్నకు నిరుత్తరుడై నిలబడి యుండిన్న శ్రీరాముని ముఖము చూచి ప్రక్కన నిలబడి యున్న సుమంత్రుని పుత్రుడు పట్టమహిషికి జరిగిన వృత్తాంత మంతయూ సవినయముగ తెలియ పరిచెను.

వివరములు తెలుసుకొన్న మీదట కౌసల్య నోట మాట లేక నిశ్చేష్టితురాలయ్యెను. చుంచెలుకను మ్రింగిన సర్పము కైవడి దుఃఖము మ్రింగనూ కక్కనూ లేని స్థితిలో ఆమె మనస్సు కొట్టుకలాడెను. ఆహా ! విధి వైపరీత్య మెంత విచిత్రమైనది! చంద్రుని పేరు వ్రాయబోయి రాహువు పేరు వ్రాసినట్లాయెనే ! యని నిట్టూర్చి చింతించెను.

ఒకవైపు పుత్రవాత్సల్యము మరొకవైపు నాకీ ధర్మము, దేని ననుసరించ వలెనను విషమ సమస్య ఆమె హృదయమును మథించసాగెను. కౌసల్య ధర్మజ్ఞ, వివేకవంతురాలు కాబట్టి రామ భరతులిర్వురూ నా బిడ్డలే కదా యని భావించి నిస్తరంగ సముద్రమువలె నిముసములో నెమ్మదించినదై ఆమె నిర్మల హృదయముతో ఇట్లు ప్రవచించెను.

"నాయనా రామమూర్తీ ! పితృవాక్య పరిపాలన కంటె మించిన ధర్మము మరొకటి లేదు, కాబట్టి నీవు మంచి పని చేసితివి. బిడ్డా ! నీకు రాజ్యము వచ్చినందులకు హర్షము, వనవాసము లభించినందుకు విషాదము నాకిసుమంతయూ లేదు. నీవు కనబడకుండిన నీ తమ్ముడు భరతుడు, ప్రజలు విశేషించి మీ తండ్రిగారు ఎంతటి దుఃఖ దైన్యములకు లోనయ్యెదరో యని ఊహించి బాధపడుచున్నాను. కానీ, వత్సా ! తల్లీ తండ్రీ ఇద్దరిచే ప్రసాదింపబడిన ఈ వనవాసము నీకు నూరు అయోధ్యలతో సమానమైనదిగా యుండునని నా విశ్వాసము— (కానన శత అవధ సమానా.)

చివరి దశలో రాజులకు విపిన వాసమే శ్రేష్ఠమైనది గదా ! అయితే ఈ బాల్యదశలో నీవు వన

వాస క్లేశ మెట్లు భరించగలవా ? యని నీ తల్లి హృదయం దిగులుతో తల్లడిల్లు చున్నది. నేను గూడ నీ వెంట వచ్చెదనని చెప్పిన నీకు సందేహము కలుగును. అదిగాక భర్తను వదలి పుత్రుని వెంట పోయినదని నన్ను లోకము నిందించును. నీవు నాకు ప్రాణముల కంటె అధికుడవు. అయినను 'అమ్మా, నేను అడవులకు వెళ్ళుచున్నా' నని నీవు అన్నపుడే ఈ దేహము వదలిపెట్టలేక ఇట్లు పరితపించుచున్నాను.

కుమారా ! ఆ వనదేవతలే నిన్ను తల్లిదండ్రుల వలె సర్వదా రక్షించు చుందురుగాక ! మాతా సుతుల సంబంధము సర్వోత్కృష్టమైనదిగా గుర్తించి నన్ను మరచిపోవద్దు. రామా ! వనవాసము క్షేమముగా గడపి, మేము జీవించి యుండగనే తిరిగి వచ్చి మమ్ము కలుసుకొనుము."


అని దీవించిన కౌసల్య పొర్లి వచ్చెడి దుఃఖమును భరించలేక కొడుకు పాదములను బట్టుకొని యెలుగెత్తి యేడ్చెను.

అప్పట్లో ఆ మాతృ హృదయమునకు కలిగిన ఆవేదన వర్ణింపజాలనిది. రాముడు తల్లిని బహువిధముల బోధించి ఊరడించెను.

ఇంతలో జానకి భయ వ్యాకులముతో అక్కడికి వచ్చి అత్త చరణములకు నమస్కరించి, నతవదనయై నేల కూర్చొనెను. కౌసల్య ఒక వైపు కోడలిని దీవించి మరొకవైపు కన్నుల నీరు నింపుకొనెను—.

"నా ప్రాణనాథుడు వనముల కెళ్ళుచున్నాడు, వారి ననుసరించి పోగల అదృష్టము నాకే కలుగనున్నదా ? లేక నా ప్రాణములకు మాత్రమేనా ? భగవదేచ్ఛ ఎట్లున్నదో వూహించలేకున్నాను....." అని చింతించుచూ, నత శిరస్కయై కన్నీరు కార్చుచుండిన సీత నవలోకించి, కౌసల్య రామునితో ఇట్లనెను—

"రామా ! జానకి సుకుమారి, అందాలకుప్ప. అత్తమామలకు, పురజన, పరిజన—బంధుజనులకు మైథిలి గారాబు బిడ్డ. నా ముద్దు కోడలిని సీతను ప్రాణముతో సమానముగ చూచుకొని, కంటికి రెప్పవలె కాపాడుచున్నాను. సూర్యరశ్మి సోకని



రామచరిత మానస్

యీ సుకుమారి నేల అడుగుబెట్టి ఎరుగదు, ఆమె నీతో వనములకు రాదలచినది.

చిత్రములో కోతి బొమ్మను చూచి భీతిల్లు కోమలి కోల భిల్ల కిరాతులకు వాసయోగ్యమై, దుష్ట రాక్షసులు క్రూర మృగములు తిరుగాడు చుండు ఆ కీకారణ్యములందు ఎట్లు నివసించగలదు !

నిర్మల మందాకినీ వీచికల విహరించు మరాళము మట్టి గుంటలో ఎట్లు నివసించగలదు ! సీత ఇక్కడుండిన నా ప్రాణముల కెంతో ఆధారముగ నుండును. పుత్రా ! నేను చెప్పవలసినది ఆమెకు చెప్పితిని, ఇక నీ యభీష్ట మెట్లున్నదో తెలియజేసిన, ఆప్రకార మామె నడచుకొనగలదు.

అని వాత్సల్యపూరితముగ పల్కిన తల్లికి రామమూర్తి తగురీతి సమాధాన మిచ్చెను. రామచంద్రునికి వైదేహిని వెంట తీసుకొని వెళ్లవలెనను కోరిక ఉండిననూ, పూర్వాపరము లాలోచించి వనవాసమందలి కష్ట సుఖములను గురించి జానకితో ఇట్లు ప్రసంగించెను.—"మైథిలీ ! మన ఉభయుల క్షేమ మాలోచించి చూచిన నీవు ఇంటియందుండుటే శ్రేయస్కరము. నా ఆజ్ఞ పాలించిన కీర్తి, అత్త మామలను సేవించగలిగిన అదృష్టము నీకు కలుగును. తల్లిగారు నామీద బెంగ గొని దిగులు పడినపుడు ఆమెకు మంచి పురాణ కథలు చెప్పి ఊరడించగలవు గదా ! మూర్ఖించి పట్టుబట్టిన తుదకు గాలవ మునికి నహుషునికి వలె నీవును కష్టములపాలు కాగలవు.

ప్రియా, వనవాస క్లేశములను నీవు ఊహించలేకున్నావు. నార చీరలు ధరించి, ఎండ కెండి, వానకు తడిసి, ఆకలిదప్పులతో కంటకావృతమగు ఘోరారణ్యంబుల సంచరించవలసి యుండును. అగాధమగు నదీనదములు తరించి, మహోన్నతమైన దుర్గమార్గములు అధిరోహించి వృక సింహ వ్యాఘ్ర భల్లూకాది క్రూరమృగములకు, మానవ భక్షులగు రాక్షస మూకలకు తావలమైన గహనాంతర సీమల నీవంటి సుకుమారి సంచరించగలదా ! నవరసాల కిసలయములు మెసవి తృప్తి జెందెడి కోయిల కుటజనములందు విహరించుటకిష్టపడునా ! ఓ భూపుత్రీ ! నీవు ఇంటియందుండి, అత్తమామలకు సేవ చేయు చుండుము.

శరత్కాల చంద్రికలు చకోరమునకు సంతాపము కలిగించు భంగి రాముడు మెత్తగ చెప్పిన మాటలు సీత కర్ణములకు కటువుగా నుండెను. నన్ను వదలిపెట్టి వెళ్ళుటకే నాథుడు నిశ్చయించినాడని భావించి, సీత కన్నీరు మున్నీరుగా ఏడ్చెను. తుదకు ఆమె అత్తకు నమస్కారముచేసి భర్తతో ఇట్లు పలికెను :

నాథా! సతికి పతియే సర్వస్వము. భర్త నెడబాసిన భార్యకు స్వర్గమైననూ నరక ప్రాయమే గదా! జీవములేని దేహము, నీరులేని నదివలె పతిలేని పత్ని ఎన్నటికీ శోభించజాలదు. సుఖ సంపదలు, ఐశ్వర్య భోగములు, విలాస వైభవములు పురుషుడు లేని స్త్రీకి బాధాకరముగ పరిణమించును. నీ పొంగత్యమున అష్ట కష్టము లొచ్చిననూ ఆనందముతో భరించగలను.

నాథా ! నిత్యమూ మీ చరణ కమలములను సేవించి, శరత్కాల చంద్రబింబము వంటి మీ ముఖము చూచుకొన గలిగిన భాగ్యము నాకు కలుగజేయుము. వాశీల స్వభావములు మీకు తెలియనివి కావు. పద్నాలుగేండ్లు మిమ్ము విడనాడి నేను జీవించగలనా ? ఏవాస మైననూ మీ సహవాసమునకు సాటి రాగలదా ? ప్రభూ నేనేనా సుకుమారిని మీరు కాదా ? మీరు సహించగల కష్టములు నేను సహించజాలనా ? ఎల్లవేళల మీకు తోడునీడగా నిలచి మీకు సేవా శుశ్రూషలు చేసి, సహాయకారిగా నుండగలను. మీ వియోగ దుఃఖము సహించి నేను బ్రతుకుట మాత్రము అసంభవము."

అని భూమిజ అనేక విధముల విన్నవించి రోదించెను. వియోగమను శబ్దమునే సహించలేకున్న ఈమెను బలవంతముగా నిరోధించినయెడల వైదేహి తప్పక ప్రాణములను వదలిపెట్టగలదని శంకించి శ్రీరాముడు సీతతో—

"కల్యాణీ ! ఇది దుఃఖించవలసిన సమయము కాదు, నాతో వనములకు వచ్చుటకు వెంటనే ప్రయాణ ప్రయత్నములు చేయుము." అని చెప్పి, అతడు తల్లికి నమస్కరించి, ఆమె ఆశీస్సులు తీసుకొనెను.

జానకి అత్తకు పాదాభివందనము చేసి, 'మాతా! మిమ్ము సేవించి తరించవలసిన తరుణములో నేను వనగమనము చేయవలసి వచ్చినందుకు బాధపడుచున్నాను. అత్తా ! నేను నిర్దోషిని. నన్ను దయ తలచుము" అని ప్రార్థించెను.

కోడలి వినయోక్తులకు అత్త హృదయము కరుణాభావముచే కరగిపోయెను. కౌసల్య సీతను పలుమార్లు హృదయమున హత్తుకొని "బిడ్డ సీతా ! గంగ యమునల జలధారవలె నీ మాంగళ్యము నిశ్చలమై నిలచుగాక ! అని దీవించెను.

సీతారాములు పునః పునః మాతృపదములకు వందన మాచరించి, ఆమె హితోక్తులు శిరసావహించి తల్లివద్ద సెలవు తీసుకొనిరి. కౌసల్య కాతర దృష్టులతో కొడుకునూ, కోడలినీ చూచుకొనుచూ నిశ్చేష్టయై నిలబడిపోయెను.

ప్రభువు వనములకు వెళ్ళుచున్నాడను వార్త విన్నప్పుడు లక్ష్మణుని హృదయము క్షోభించిపోయెను. ఆత్రముతో పరుగెత్తుకొని వచ్చి అతడు అన్న పాదములపై వ్రాలెను. నీటినుండి వేరు చేయబడిన చేపవలె అతి దీనుడై అగ్రజుని ఎదుట నిలబడెను. దారా గేహములను తృణప్రాయములుగా భావించి చేతులు జోడించుకొని సజలనేత్రుడై నిలబడియున్న సోదరుని అవలోకించి సకల గుణధాముడైన శ్రీరాము డిట్లు ప్రేమపూర్వకముగ పలికెను:

"సోదరా పరవశుడవై కర్తవ్యా కర్తవ్యములను విస్మరించుట ఉచితముగాదు. భరత శత్రుఘ్నులు ఇంట లేరు. తండ్రి వృద్ధాప్య దశలో నీక్షై పరితపించు చున్నాడు. నేను నిన్ను వెంట తీసుకొని పోయినట్లయిన తల్లిదండ్రులు, గురువులు, పరిజనులు, ప్రజలు తీరని వేదనకు లోనయ్యెదరు. అయోధ్యను అనాథ స్థితిలో వదలివేయుట ధర్మమేనా ? ఏ ధరణీశుని పాలనలో ప్రజలు బాధపడెదరో ఆ నరనాథునికి తప్పక నరకప్రాప్తి సంభవించును. కనుక నీవు గృహమందుండిన ఇన్ని అనర్థములు ఏర్పడవు కదా ?" దుఃఖాతిశయముచే రుద్ధ

కంతోషించిన లక్ష్మణుడు అతి కష్టముమీద అగ్రజుని ప్రార్థించెను.

"అగ్రజా! మీరు బోధించిన ఉపదేశ వాక్యములు నేను వింటిని. అయితే ధీరులు, ధర్మ ధురంధరులైన పురుషులే మీ బోధించినట్లు ధర్మశాస్త్రానుసారముగ ప్రవర్తింపగలరు. నావంటి పామరుడు అందు కసమర్థుడు. మందర పర్వతమును మశకము మోయగలదా ?

ప్రభూ! నేను మీ దాసుడను, మీ స్నేహచ్ఛాయలందు పెరిగిన బాలుడను. నాకు తల్లి, తండ్రి సర్వమూ మీరే. త్రికరణశుద్ధిగ మీ చరణ సేవ చేసుకొనుచున్న నన్ను వదలిపెట్టి పోవుట భావ్యము కాదు."

కరుణానిధి శ్రీరాముడు మనస్సు తమ్మునిమాటకు ద్రవించిపోయెను. సౌమిత్రిని గాఢాలింగనము చేసుకొని—"సోదరా లక్ష్మణా? ఇక ఆలస్యమెందుకు! తల్లివద్ద సెలవు తీసుకొని త్వరగా రమ్ము" అని చెప్పెను.

లక్ష్మణుడు అన్న అనుమతించినందుకు సంతుష్టాంతరంగుడై తల్లివద్దకు వెళ్ళి, ఆమె పాదములకు నమస్కరించి సమాచార మంతయును తెలియజేసెను.

కొడుకు మాట విన్న వెంటనే సుమిత్ర భయంకరమైన లక్ష్మణుని మాటలు విని సుమిత్ర భయంకపిత యయ్యెను. తల్లి ముఖ లక్షణములను పరీక్షించి, 'అయ్యో! ఈమె వాత్సల్యము నన్నెక్కడ అటంకపరచునో' యని లక్ష్మణుడు భయ సంకోచముతో—"అమ్మా నాకు సెలవు దయచేయుము" అని మారొక్కసారి కోరెను.


సుమిత్ర దశరథుని పుత్రవాత్సల్యము సీతారాముల గుణశీలములను మనస్సునకు తెచ్చుకొని, క్షాత్ర ధర్మమునకు తగిన ధైర్య మవలంబించి ఇట్లనెను :—

"కుమారా! సీతారాములే నీకు తల్లిదండ్రులు మాద్యమిక్కడ ప్రకాశించునో అక్కడే దివసము నట్లు ఎక్కడ రాముడో అక్కడ అయోధ్యయన్నట్లు భావించుము. అన్నా వదినెలు లేని ఈ అయోధ్యతో నీకేమి పని? నకల జనులకు ప్రాణప్రియుడు, ప్రాణములకే ప్రాణమైన శ్రీరాముని వెంట వెళ్ళ సిద్ధపడిన నిన్ను! ఏ తల్లి కొడుకు శ్రీరాముని సేవించునో ఆ తల్లి అదృష్టవంతురాలు.

నీ అదృష్టమునకే నాయనా నేనుపొంగి పోవుచున్నాను. రాగ ద్వేషములు విసర్జించి, నగర సౌఖ్యములను మరచి బంధుమిత్రుల ప్రేమను వదలి శ్రీరాముని సేవించి తరింపుము. త్రికరణశుద్ధిగ శ్రీరాముని సేవించి తరించుము. ఇదియే నా యుపదేశము" అని సౌమిత్రిని సుమిత్ర తనయుని దీవించి సాగనంపెను.

లక్ష్మణుడు సీతారాములతో కలసి రాజమందిరమునకు వెళ్ళెను. అప్పటి రాజవర్గ పరిజనుల శోక సంతప్తమానసులై మూగవోయి యుండిరి. చింతాక్రాంతులైన వేలాది పౌరులు మంథరను తిట్టుకొన్న రక్తి కలసిన భాంతి, రెక్కలు విరిగిన పక్షులవలె విలపించుచూ రాజ ప్రాసాదమున చేరియుండిరి.

(శేషం)



"మరయితే మీరిలా వంటరిగా ఉండడం...."

"అవసరమయింది. పెరిగిన పరిసరాల్లో వేర్చుకున్న చదువూ, అభిరుచుల వలనా!"

నేనుగాని మా ఆవిడగాని మాట్లాడలేదు. మాట్లాడవలసింది రాజేశ్వరే! అందుకే ఆవిడకే అవకాశం ఇచ్చాం. ఆవిడ ప్రారంభించింది.

"నేను పుట్టగానే మా నాన్నగారు పోయారుట. రెండు సంవత్సరాలు వచ్చేసరికి అమ్మ పోయింది. ఇక నా సంరక్షణ భారమంతా మా అన్నయ్యమీద పడింది. మా అన్నయ్య అప్పటికింకా చదువుకుంటున్నాడు. పెళ్ళి కాలేదు. అందువలన నన్ను మా పిన్ని తనింటికి తీసుకుపోయింది. నేను ఆవిడ దగ్గరే పెరిగాను.

మా అన్నయ్యతో మీ పరిచయం ఎన్నాళ్ళదో నాకు తెలియదు. కాని ఏ కాస్త పరిచయం ఉన్నా ఆయన ఆచారం గురించి తెలుసుకో గలరు. నిప్పుని కడిగేటంత శ్రోత్రీయుడు ఆయన ఆయనే కాదు— మా పిన్ని చెబుతుండేది — మా నాన్నగారు కూడా అలాటి వారేనుట. ఇల్లుదాటితే ఉపోషాలు చేయడం, తమవాడు కానివాడిని తాకితే ఇంటికొచ్చి తలారా స్నానం చేయడం వంటి చాదస్తాలు చెప్పి నవ్వుతుండేది మా పిన్ని.

వాళ్ళ ఇంట్లో ఇటువంటి అతి చాదస్తాలు లేవు. కారణం మా బాబాయిగారు ఉద్యోగస్తుడు. చదువుకున్నవాడు. ఉన్నంతలోనే ఆయన పిల్లల్ని చదివించేవారు. ..... ఆడా, మగా కూడా. అందుకే వీళ్ళ ఇంట్లో "ఉన్నందువలన నేను కూడా స్కూల్ ఫైనల్ దాకా చదవగలిగాను. మా పిన్ని తన కూతుళ్ళతోపాటు కుట్లు, అల్లికలు నేర్పించింది నాకు కూడా!

ఇదంతా అన్నయ్యకు కంటకంగా ఉండేది. నలుగురిలో కలిసి ఆడది తిరిగిందంటే చెడిపోయుంటుందన్న ఊహ అతనికి "అయిన వాళ్ళలో తలెత్తుకో లేకుండా" చేసిందిట! నన్ను మాన్పించుదామని శత విధాల ప్రయత్నం చేశాడు. చివరికి వాడి పట్టుదల చూసి మా పిన్నివాళ్లు కూడా భయపడిపోయారు. కాని నేను మాత్రం మొండికేసి చదువుకున్నాను.

తనమాట వినలేదని వాడు నాతో మాట్లాడడం కూడా మానేశాడు అప్పట్లో.

మా అన్నయ్యకు పెళ్ళి అయి వాడికి పిల్లలు పుట్టటం ప్రారంభించాక ఆడతోడు అవసరమైంది. దానికి తోడు నా స్కూల్ ఫైనల్ పూర్తయ్యేసరికి నన్ను తన ఇంటికి తీసుకుపోయాడు.

పిన్నిగారింట్లో స్వేచ్ఛగా పెరిగిన నాకు అన్నయ్యగారిల్లు ఊపిరాడ నివ్వలేదు. అతి మడితో నా ప్రాణం తీసేవాళ్ళు వదినా, అన్నయ్యానూ! దీనికితోడు బయటకు పోయేందుకు వీలులేదు.

అయితే ఈ వెరనా కెంతో కాలంలేదు "ఎదిగి కూర్చున్న చెల్లెలు ఉంది ఫలానా ఉమాపతిగారికి" అంటే తనకి తల కొట్టేసినట్లవుతోందని అన్నయ్య నా కోసం సంబంధాలు చూడసాగాడు.

తనలాటి సదాచార సంపన్నుల ఇంట్లో పడేయాలని వాడి ప్రయత్నం. ఈ 'ఆచారం' ఒక్కటి దృష్టిలో ఉంచుకుని వెతికేవాడు సంబంధాలు.

అందుకని వీళ్ళ సంబంధం తగలగానే ఎగిరి గంతేశాడు. ఆనందంతో. మా అత్తవారింట్లో ఉప్పుని, నిప్పుని కూడా కడుగుతారు! అంత 'పిర మడి' వాళ్ళది. తనకి దీటైనవాళ్ళు, ఆస్తి ఉంది

ఆంతర్యం

23 వ పేజీ తరువాయి

అని మాత్రమే చూశాడుగాని ఆయనగారి గురించి చెప్పుకునే మాటలు వినదలుచుకోలేదు అన్నయ్య.

అప్పటికే ఆయన ప్రవర్తన, లోక విఖ్యాతం! ఊళ్లో ఎవరిని కదిపినా చెప్పగలిగేవారు. ఆయన లీలా వినోదాలు!

మా పిన్నికి ఆ ఊళ్లో బంధువులుండి చెప్పారుట—"రోజూ ఇంటికిరాడు రాత్రిళ్ళు. పైగా ఆయన తల్లి, చెల్లెళ్ళకి నోరు పెద్దది. వెధవప్పగారు ఒకావిడ ఉంది. ఆవిడ నలుగురు అత్తగార్ల పెట్టు!" అని ఇవన్నీ చెప్పిన మా పిన్నితో అన్నయ్య "ఆఁ మగవాడు తిరక్క చెడ్డాడుట! ఏదో పెళ్ళి కాలేదు కనుక సరదాగా తిరుగుతున్నాడు — సంసార భారం మీదపడితే సరి అన్నీ పోతాయి. అత్తగారు శాశ్వతమా? ...... అసలు ఒక్కమాట— నేను ఇక సంబంధాలు వెదకలేను. మరెవరయినా చేస్తానంటే నిక్షేపంగా దాన్ని తీసుకుపొండి. మా నాన్న మిగిల్చిపోయిన ఆస్తేమీలేదు. నాకూ కొండంత బాధ తప్పుతుంది" అని తెగేసి చెప్పాడు.

"ఏమయ్యా! మీ పొరుగింటి వాళ్ళు నిజాయితీ పరులేనా!"

"ఆహా!"

"మరి నువ్వు అసమానం ఆ తుపాకి వెంటేసుకునే ఉంటావేం."

"వాళ్ళు నిజాయితీపరులవ్వాలనీ!" తుపాకీవాలా సమాధానం.

చిత్తరంజన్ (ఖర్గపూర్)

మారు మాట్లాడలేకపోయింది పిన్ని ఆవిడ. కూడా పిల్లలు కలది పాపం ఏం చెయ్యగలదు?

అసలు అన్నయ్య ఇంతగా మొండి వేయడానికి కారణం వాళ్ళు మా వదినకి దగ్గర బంధువులవడం!

నా అదృష్టాన్ని పరీక్షకు పెట్టుకుని పెళ్ళికి ఒప్పుకున్నాను. ఒకింటిదాన్నయాను. అయితే ఆయనకు మాత్రం కావలసినదాన్ని కాలేకపోయాను.

నేను ఎంతగా ప్రయత్నించినా, ఆయన అలవాట్లు మార్చలేకపోయాను. పెళ్ళయిన కొత్తల్లో ఒక నెల్లాళ్ళు ఇంటిపట్టున ఉంటే ఇహ ఫరవా లేదని మురిసిపోయాను. కాని ఆ సంతోషం ఎక్కువ కాలం నిలవలేదు.

ఆ తరువాత ఆయన మళ్ళీ పూర్వ పద్ధతులనే అనుసరించసాగారు. ఒకొక్కసారి నాలుగయిదు రోజులయాక కనబడేవారు. అదేమిటంటే కొత్తల్లో సొప్యంగానే "పనుండి ఊరెళ్ళాను" అని చెప్పేవారు. కాని రాను రాను ఆ మంచి మాటకి కూడా నోచుకోలేక పోయాను.

పోనీ ఇంట్లో మిగిలిన వారి సానుభూతి ఉంటుందేమోనంటే— కొడుకు 'కొంపల' వెంట పోవడానికి కారణం కేవలం నేనే నన్నట్లుగా మాట్లాడేది అత్తగారు. బహుశ నేను రాని క్రితం ఎవ్వరినీ అనలేక కొడుకుని అడగలేక ఊరుకునే దనుకుంటా! నే నంటూ ఒకతిని వచ్చాక సర్వ విషయాలకి నేనే బాధ్యురాలినయాను !

రాత్రి ఇంటికి రాకపోతే కారణం నేను, ఆయన కొద్దిగా తాగి పుచ్చుకొని వస్తే అందుకు కారణం నేను — ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆయన అవలక్షణాలకి, చెడు నడతలకి నేనే మూర్తీభవించిన కారణం!

దీనికితోడు ఇంటెడు చాకిరి! ఉదయం లేచింది మొదట రాత్రి పదింటిదాకా ఒక్క క్షణం కూర్చునేదాన్ని కాను. నా రక్తమాంసాలన్నీ వాళ్లే పీల్చేశారు.

చెప్పుకుందామంటే మొగుడు తాగి వచ్చేవాడు. పుట్టింటికి పోదామంటే ఆదరించే అన్నయ్య కాదు. "భర్త తన భార్యని సరికేసేందుకు హక్కు గలవాడు" అని మా అన్నయ్య నమ్మకం.

'అమ్మ' అంటూ ఉంటే ఎలాగుండేదో అనిపించేది ఒక్కొక్కప్పుడు. తెలియని ఆవిడ్ని తలుచుకుని భారం తీరేదాకా ఏడ్చేదాన్ని మధ్య మధ్య. పిన్ని మాత్రం సానుభూతి చూపించి ఎవరిచేతనయినా తినేందుకు చేసి పంపించేది. కాని అవి నాకు అందేవి కావు. అటువంటిది మా ఇల్లు.

నేను కాపురానికి రాని క్రితంనుంచి ఆయనకి ఊళ్లో ఒకమ్మాయి ఉందిట. రాను రాను ఆయన ముఖం కనబడడమే అరుదయిపోయేది! ఆ అలుసు చూసి అత్తగారు, ఆడబిడ్డలూ విజృంభించేవారు.

"మొగుడ్ని అదుపు చేసుకోలేని ఆడది బ్రతకడం దేనికో?" ...... "వాడు ఇంటికి రానప్పుడు ఈవిడ మాత్రం మన నెత్తిన ఎందుకు?" ఇటువంటివి వాళ్ళు వాడే సూటీ పోటీ మాటలలో కొన్ని.

కాలం గడిచిన కొద్దీ నాకూ అనిపిస్తుండేది— ఎవరికోసం నా ఈ శ్రమంతా? నా కండలు కరిగించి నేను చేసే చాకిరీ అంతా ఎవరిని సంతోష పెట్టేందుకు?" అని.

ఇటువంటి ఆలోచన రాకూడదేకాని వచ్చిందంటే క్షణక్షణం బలమవుతుంది" నా కొడుకుని నన్ను పోషించుకోలేకపోను" అన్న ఆలోచన నా కెంతో ఆనందా నిచ్చేది. పిన్నిగారింట్లో చిన్నతనంలో అనుభవించిన స్వేచ్ఛా జీవితం వైపు మనస్సు మొగ్గేది.

ఈ ఆలోచనకి ఊపిరి నిచ్చింది మా పద్మావతి, దాని మొగుడు గోపాలరావుగారూను. పద్మావతి మా పిన్నికి పెద్ద కూతురు—షుమారుగా నా ఈడుదే కావడాన చిన్నతనంనుంచి మా ఇద్దరి మధ్యా చనువెక్కువ.

గోపాలరావుగారు ఈ ఊళ్లో కుట్టుమిషన్ల కంపెనీకి మానేజరు. మా చెల్లాయి ద్వారా నా బాధ విని, "ఎలాగయినా ఆమెని ఆ కూపంలోంచి తప్పించాలి" అని భార్యని పురిగొల్పాడు. పాపం వాళ్ళిద్దరూ పూనుకుని నాకు ధైర్యం కలిగించారు.

ఒకరోజున మా ఆయన ఇంటికివస్తే ఆయనతో చెప్పాను—నేనీ ఇంట్లో ఇక ఉండలేను. మీ ఆదరణ లేనప్పుడు ఎవరికోసం నా ఈ చాకిరీ అంతా. వేరేపోయి ఉద్యోగం ఒకటి చేసుకుంటూ, నా కొడుకుని చదివించుకోగలను -అని.

ఆ రోజున ఆయన తాగి వచ్చారు—"వెడతానంటావుగాని వెళ్ళవేం?" అంటూ కొట్టారు.

అదే ఆఖరిరోజు నామీద వారి యాజమాన్యానికి!

"చెల్లెలి మొగుడితో లేచిపోయింది" అని నామీద అపవాదులు వేశారు.

మా అన్నయ్య కూడా ఎరుగున్న వాళ్ళతో అన్నాడుట ఆ మాటే! బంధువులతో "నాకూ, దానికీ సంబంధంలేదు" అన్నాడు.

అసలాయన ఈ ప్రకటన చేసేందుకు ఇటువంటి అవకాశం కోసరమే ఎదురు చూస్తున్నాడనుకుంటా!

నాకు మాత్రం పూర్తి చేయూతనిచ్చి, నాకు ఒక మార్గం చూపించింది మా పద్మ. గోపాలరావు గారూను. ఆయన కంపెనీలోనే కుట్లు నేర్పేందుకు నన్ను వేయించాడు. దానికి తోడుగా పది మంది పిల్లల్ని ప్రయివేట్లకి కుదిర్చాడు.

ఆయనకీ ఊళ్లో మంచి పలుకుబడి ఉంది. వాళ్ళిద్దరి నీడనా నా జీవితం సుఖంగా వెళ్ళిపోతోంది!"

ఆవిడ ఆఘగానే "మరి కొడుకుకోసం మోహన మూర్తి ప్రయత్నించలేదూ?" అనడిగాను.

"చెయ్యకుండా ఉంటారా? చివరికి దౌర్జన్యంగా తీసుకుపోదామని ప్రయత్నించారు. అప్పుడు కూడా నాకు అండగా నిలిచింది మా పద్మ మొగుడే. దౌర్జన్యానికి దిగితే ఈ ఊరినుంచి మరి బయటకు పోలేరు! అన్నాడు. "మీ కొడుకుకోసం మీరు ప్రయత్నించేటట్లయితే మేం కూడా మనోవృత్తికోసం ప్రయత్నిస్తాం! ఇష్టం ఉంటే ఆవిడతోపాటు సుఖంగా వేరే కాపురం పెట్టుకోండి" అని కబురు చేశాడు.

దాంతో మళ్ళీ ఆ గోల లేదు. కాకపోతే—అతనితో లేచిపోయానని, అతని దగ్గరనే ఉంటున్నానని—ఇలా ఇష్టం వచ్చినట్లు నా మీద ప్రచారం చేశారు. ఇప్పుడదీ పాతపడిపోయింది!

మా అన్నయ్య అవన్నీ నమ్ముతాడు. అందుకే నాతో మాట్లాడడు" అని కాసేపాగి, "ఇప్పుడు నా ఆశలన్నీ మా మధుసూధనంమీద. వాడు తెలివి గలవాడు. వాడిని ప్రయోజకుడ్ని చేయగలిగితే, నేపడిన కష్టాలు, మోసిన అపనిందలు అన్నీ మరిచిపోగలను. కావాలంటే ఇంకా భరించగలను కూడా!" తలవంచుకుని కళ్ళద్దుకుంది పమిట చెరుగుతో.

మా ఆవిడ వైపు చూశాను—అప్పుడే అద్దేసుకుని తలెత్తి నన్ను చూసి సిగ్గుపడింది.

"మిమ్మల్ని విసిగించాను. కేవలం నన్ను గురించి మీకున్న అపార్థాలు తొలగించాలని పనిగట్టుకు వచ్చాను" అని లేవబోయింది రాజేశ్వరి.

మా ఇందిర గబుక్కున ఆవిడ్ని ఆపి "ఈ పూట ఇక్కడే భోజనంచేసిపోవాలి అక్కయ్య గారూ, నా మాట కాదనద్దు" అని బలవంతం చేసేసింది.

"చూశారా, మధ్య నేను పరాయి వాడినయ్యాను. చెల్లెలిమాట కాదనకండి—ఏడుస్తూ కూర్చుంటుంది."

"ఆ సంగతి మే మిద్దరం చూసుకుంటాం—మీరు చెప్పక్కర్లా" అంది ఇందిర బుంగమూతి పెట్టి.

"ఇంతకీ అబ్బాయి ఎక్కడ?"

"నన్ను తీసుకెళ్లేందుకు మళ్ళీ వస్తాడు..... అడుగో మాటలోనే వచ్చేశాడు."

వాడు వస్తూనే నమస్కారం పెట్టాడు నాకు.

నాకు ఆశ్చర్యం వేసింది. "నువ్వటయ్యి, నాకు తెలియనే తెలియదు సుమీ—అన్నట్టు తెలిసే అవకాశం మాత్రం ఎక్కడుంది, పరిచయమాల్తైంది. ఇప్పుడేగా! రాజేశ్వరమ్మగారూ, వీడు ఎదుట వాడిని మెచ్చుకోవడం మంచిదికాదు. నువ్వు కాస్త చెవులు మూసుకోవోయ్ మధుసూధనం! మీ వాడు చాలా తెలివయినవాడండీ! బుద్ధిమంతుడు కూడా! నాకు ఇన్నాళ్ళుగా కలిగిన అభిప్రాయం అది" అన్నాను నవ్వుతూ. అబ్బాయి నా క్లాసు విద్యార్థే!

ఆవిడ ముఖంలో కనబడిన సంతృప్తి అపూర్వం!

ఆనాడు మొదలు మధుసూధనం ఇంటిదగ్గర కూడా నా దగ్గర చదువు చెప్పించుకునేవాడు. ఆవిడ పడిన కష్టానికి వీడు పైకి రావాలి. అందుకు నేను కూడా నా శక్తివంచన లేకుండా కృషి చేయ దలుచుకున్నాను. అది కూడా పెద్ద శ్రమయిన పనికాదు. అతను చాలా తెలివిగలవాడు. అతల్లిలాగానే తను రైటనుకున్నది. ఎన్ని అడ్డంకులు వచ్చినా చేసేశేవాడు. కాకపోతే మనం చేయవలసినదల్లా చెడుని రైటని వాడు నమ్మకుండా చూడడమే!

ఆ ఏడు స్కూలు ఫస్టుగా వచ్చాడు మధుసూధనం!

మొదట మాత్రం తను వాడి కాలేజి చదువు భరించగలనా అని భయపడింది రాజేశ్వరి. కాని వాడి మార్కులకి స్కాలర్‌షిప్పు వస్తుందని ధైర్యం చెప్పి, కాలేజీలో చేర్పించాం. నేనూ, గోపాలరావు గారు.

అప్పుడు కూడా ప్రతి రోజూ నా దగ్గర కూర్చుని తెలియనివి చెప్పించుకునేవాడు. వాడి కృషి అనండి, నా గైడన్సు అనండి, వాళ్ళమ్మ అదృష్టం అనండి వాడు యూనివర్శిటీ రాంక్‌తో పాసయ్యాడు.

వాడి నెలాగయినా 'డాక్టర్' చేయాలని రాజేశ్వరి ప్రయత్నం కాని ఈసారి నేనూ, గోపాలరావుగారు కూడా అధైర్యపడ్డాం. "అన్ని సంవత్సరాలపాటు ఈవిడ ఈ శ్రమకి తట్టుకోగలదా?" అని.

అయితే ఇప్పుడు ధైర్యంగా నిలబడింది రాజేశ్వరే!

"నా అదృష్టం పరీక్షకి వచ్చినప్పుడు వెనకంజ [illegible] ఎంత కష్టమయినా—నా శరీరంలో శక్తి ఉన్నంతవరకూ—భరించగలను. అన్నిటికీ ఆ భగవంతుడే ఉన్నాడు.....అంతగా మరీ నా తాహతుకి మించిపోతే మంచి కుటుంబంలోని పిల్లని చూసి వీడికి పెళ్ళి చేస్తేసరి ఆ మావగారు సహాయం చేస్తాడు. వెనకాడకండి—మీరూ, మా మరిదిగారు కలిసి వాడిని మెడిసన్‌లో చేర్పించాలి" అంది మా ఇంటికి వచ్చి.

ఒక దైవ కార్యంలో పాల్గొంటున్న వాడిలా నాకూ ఎక్కడలేని ఉత్సాహం, నా పిల్లాడిని చేర్పిస్తున్నంత సంతోషం కలిగాయి.

గోపాలరావుగార్ని వెంటనిచ్చి విశాఖపట్టణం పంపాం మధుసూధనాన్ని!

ఆయన తిరిగివచ్చి వాడు చేరిన వైనం, స్కాలర్‌షిప్ వివరాలు చెబుతుంటే అందరం కలిసి ఆనందంగా విన్నాం. హాస్టల్లో భోజనం బాగుండదని విన్నప్పుడు రాజేశ్వరమ్మ ఏడవసాగింది. అప్పుడు మా ఇందిర, పద్మావతి కలిసి ఆమెను ఓదార్చారు


జీవితం ఇక్కడిదాకా ఆవిడ అనుకున్నట్లుగానే సాగిపోయిందని అందరం సంతృప్తి చెందాం!

తెలుగువాడికి ఒక జబ్బుంది అని ఈమధ్య నేనేదో పత్రికలో చదివాను. అది ఏమిటంటే ఎవరయినా పైకి వచ్చే దాకా వారెవరో పట్టించుకోనివారు వాడికి పేరు-రాగానే వీడు మన తెలుగు వాడేనన్న విషయం ప్రకటిస్తారుట!......తమిళ సోదరులు బ్రహ్మరథం పట్టేదాకా త్యాగయ్య మనవాడన్న విషయం పోల్చుకోలేక పోయారుట!

మధుసూధనం కాలేజీలో చేరిన ఆరు నెలలకి ఒక రోజున రాజేశ్వరి మా ఇంటికి వచ్చింది. ముఖవైఖరి చూసి "ఏమండీ అలాగున్నారు?" అనడిగాను.

"మన మధుసూధనం దగ్గరకు మాఅన్నయ్య వెళ్ళాడుట!" అంది గంభీరంగా. అని అంతలోనే నవ్వుతూ, "మా అన్నయ్య ఏదో పనుండి విశాఖపట్టణం వెళ్ళాడుట. అక్కడనుంచి వెతుక్కుంటూ హాస్టల్‌కి వెళ్ళి మేనల్లుడిని పలకరించాడుట."

"మావయ్య చాలా ఆత్మీయంగా మాట్లాడాడు. ఇంత ప్రేమ గలవారితో మనకు మాటలు ఎందుకు లేవా అని ఆశ్చర్యం వేసింది" అని రాశాడు అంది.



నేను క్షణంపాటు మాట్లాడలేలేకపోయాను. ఎందుకంటే ఇది ఆవిడకి ఆనందం కలిగించే వార్తేమో నాకు తెలియదు. అంతలోనే ఒక నిర్ణయానికి వచ్చి—

"ఇన్నాళ్ళూ మీరు అక్కరలేని వాడికి మీ కొడుకు బంధువయ్యాడన్నమాట.......కూతుళ్ళు ఉన్నారా?" అనడిగాను.

"ముగ్గురున్నారు. ఈసారి మధు వచ్చినప్పుడు.... ఏమోలెండి. ఊరికినే అకస్మాత్తుగా వచ్చి ఉండవచ్చును ఆయన" అంది మధ్యలోనే చెప్పవలసినదేదో ఆపుతున్నట్లుగా.

"మధుసూధనంతో చెప్పాలని ఉంది—చెరువు నిండితే కప్పలు చేరతాయని, ప్రయోజకుడయితే బంధువులు దగ్గరవుతారని."

ఒక్క నిముషం ఆగి, "మీ ఇష్టం!" అని లేచి వెళ్ళిపోయింది.

శలవలకి వచ్చినప్పుడు మధుసూదనం మా ఇంటికి వచ్చాడు—చక్కటి బట్టలతో దర్జాగా ఉన్నాడు!

"బాగున్నావా?" అనడిగాను.

"మామయ్యగారింటికి వెళ్ళి వస్తున్నానండి మాస్టారూ, ఇంటిల్లిపాది ఎంతో మర్యాద చేసేశారు......ఆయన మరీ మరీ రాశాడు రమ్మనమని. సరే కదా అని దిగి రెండు రోజులు ఉండి వస్తున్నాను. పాపం ఏవో బట్టలు పెట్టాడు" అన్నాడు తన వంక చూసుకుంటూ.

సమయం ఆసన్నమయిందని "చూడు మధుసూధనం, ఇన్నాళ్ళుగా మీ అమ్మని "బతికున్నావా?" అని అడిగిన పాపాన పోలేదు మీ మామయ్య! ఇప్పుడు నువ్వు ప్రయోజకుడివి కాబోతున్నావని పసిగట్టి నిన్ను దగ్గర చేసుకుంటున్నాడు. నువ్వు చదువుకుంటూ నాకన్న పైకి వెడుతున్న వాడివి. అయినా చెబుతున్నాను. ఒక్క విషయం ఆలోచించు—ఇప్పుడు ఎన్ని చేసినా మావయ్య మీ అమ్మకి చేసిన అన్యాయం సవరించగలడా?...... అయినా అంతగా మీతో కలవాలని ఉంటే ఆమె ద్వారావే చేయచ్చుగా ఆపని!" అన్నాను.

అతను కాసేపు మాట్లాడలేదు. నా మాటలు పని చేశాయని ఆనందపడ్డాను. అంతలోనే హటాత్తుగా అడిగాడు.

"మా అమ్మ చేసిన పని మంచిదేనని నమ్ముతున్నారా మాస్టరుగారూ?" అని.

ఆశ్చర్యపోయాను.

"అదేమిటి మధుసూధనం—ఆత్మాభిమానం గలది. చదువు, సంస్కారం ఉన్నది చేయవలసిన పని చేసింది అమ్మ. నేను పూర్తిగా సమర్థిస్తాను ఆవిడ చర్యని" అన్నాను.

లేచి—కాసేపు నిలబడి—"వెళ్ళొస్తాను మాస్టారూ" అని నమస్కరించి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిన వైపు చూస్తూ ఉండిపోయాను. అతని ప్రశ్న అతనికే వేసేందుకు భయం వేసింది నాకు. సమాధానం ఏం చెబుతాడోనని!

మొత్తానికి మునుపటి మధుసూధనం కాదు! మారాడు!

శలవుల్లో లోగడంత ఆత్మీయతతో మాట్లాడలేకపోయాను అతనితో. అది నా లోపమే కావచ్చు. లేక నాకు రాజేశ్వరిపైన గల అభిమానం, గౌరవం

ఆంతర్యం

వలన కావచ్చు. మొత్తానికి నా కతను కొత్తగా కనబడసాగాడు.

శలవలు ఇంకా ఉన్నాయనగానే బయలుదేరాడు మధుసూనం గోపాలరావు ఊళ్ళో లేడు. నేనూ, రాజేశ్వరమ్మా స్టేషనుకి వెళ్ళాం సాగనంపేందుకు.

ఏమనాలో తెలియక "ముందుగా బయల్దేరావేం మధుసూధనం?" అనడిగాను.

"వెళ్ళేప్పుడు వస్తానని మావయ్యతో చెప్పాను మాస్టారూ, అక్కడ రెండు రోజులుండి పోదామని!"

రాజేశ్వరివంక చూడలేకపోయాను. ఆ ప్రస్తావన తెచ్చినందుకు బాధ పడ్డాను.

"మామయ్యని, అత్తయ్యని అడిగానని చెప్పబ్బాయ్" అంది రాజేశ్వరి.

ఆమె వంక చూశాను. తదేకంగా వెలుగుతూన్న సిగ్నల్ లైట్‌ని చూస్తోంది.

అక్కడ పచ్చ లైటు పడింది అప్పుడే!

వెళ్ళిన వారానికి మధుసూధనం దగ్గరనుంచి ఉత్తరం వచ్చిందిట. "మామయ్య వంద రూపాయలు బట్టలు కుట్టించుకోమని ఇచ్చాడు. కాబట్టి

"ఛా, వెధవ బ్లేడు, వెధవ బ్లేడు! దీంతో గొంతుకూడా తెగేట్లు లేదు!" ఓ భర్తగారి విసుగు.

"ఇదేమిటండీ మరీ చోద్యం, నిన్న నేను చెక్కుకున్న పెన్సలు కన్న బిరుసా మీగెడ్డం," అమాయకపు భార్య సమాధానం.

శివరాం (చిలకలూరిపేట)

నువ్వు పై నెల డబ్బు పంప నవసరం లేదు" అని రాజేశ్వరి నాకీ ఉత్తరం చూపించి, "నా మీంచి కొంత భారం తీసేశాడు. మాస్టరుగారూ మా అన్నయ్య, ఇక నేను నిశ్చింతగా ఉండచ్చు" అంది.

ఆమె మాటల వెనకనున్న తాత్పర్యానికి ప్రయత్నించి విఫలుడ నయాను.

సంక్రాంతి శలవలకి ముందు నా పేరట ఉత్తరం ఒకటి రాశాడు మధుసూధనం. "మాస్టారూ, మనకు అనుభవం కలుగుతేగాని ఏ విషయం నమ్మకూడదని" మీరు చెబుతుండేవారు ఎంతో ముందు చూపుతో చెప్పిన మాటలండీ అవి!

మొన్న మావయ్య ఒకాయన్ని వెంటబెట్టుకు వచ్చాడు. ఆయన మంచి స్ఫుర ద్రూపి. చూడగానే ఆకర్షణ కలిగింది ఆయన పట్ల. ఇంతా చేస్తే ఎవరో తెలుసా ఆయన—మా నాన్నగారుట!

మొదట నా కాయనతో సరిగా మాట్లాడ బుద్ధి కాలేదు. కాని ఆయన ప్రేమ, అప్యాయత నన్ను ముగ్ధుడ్ని చేసేశాయి. నన్ను క్షణం వదల లేక పోయారాయన......ముగ్గురం కలిసి విశాఖపట్టణం అంతా ఏలేశాం రెండు రోజులపాటు..... తండ్రి ప్రేమని ఈజీవితంలో పొంద లేననుకున్నాను. కాని అదృష్టవంతుడ్ని......వెడుతూ వెడుతూ నా చేతికి నాలుగు వందల రూపాయలు ఇచ్చారు మా నాన్నగారు. అమ్మకి చెప్పండి—ఇప్పుడూ డబ్బుకి అవసరం లేదని. బహుశ శలవలకి 'మా ఊరు' వెళ్ళి తరువాత వస్తాను" అని.

ఆ ఉత్తరంలోని సారాంశాన్ని ఆవిడకి ఏవిధంగా అందజేయాలో తెలియలేదు నాకు. చెప్పడం కన్న ఆవిడకే ఈయడం మంచిదనిపించింది. ఇంటికి వెళ్ళాను.

చదువుకుని తేలిగ్గా నవ్వేసి, "ఇంకా కొంత బాధ్యత ఉందనుకున్నాను. అది ఈయన తీసేసుకున్నారండోయ్ మాస్టరుగారు—ఇంక నాకే చింతా లేదు. నిశ్చింత. అంతా నిశ్చింతే!" అంది రాజేశ్వరి.

అక్కడనే ఉన్న గోపాలరావుగారు మాత్రం చదివి మండిపడ్డాడు "ఈ వెధవకి బుద్ధి చెప్పాలండి మాస్టారూ. ఇప్పుడు నాయన వచ్చాట్ట, మొన్న మావ వచ్చాట్ట—రేపు మామయ్య కూతురు బాగుందంటాడు! అంట్ల వెధవ—కష్టపడింది ఆవిడాను అనుభవం వీళ్ళపాలా? ఒక్క వెధవ ఆవిడని పలకరించిన పాపాన పోయాడా? పోనీ మెడిసిన్‌లో చేరేదాకా ఈ వెధవని పలకరించారా?...... రేపు రానీండి వాయించేస్తాను" అన్నాడు ఉద్రేకంగా.

రాజేశ్వరమ్మకోసం చూస్తే అక్కడలేదు. లోపలికి వెళ్ళి చెబుదామనుకున్నానుగాని చెప్పకుండానే గోపాలరావుతో బయటకు వచ్చేశాను.

ఆయన మాటలు విన్నాను. ఆవేశం చూశాను. కాని నా కనిపించింది ఒక్కటి—ఇక రాబోయే మార్పుల్ని చూస్తూ ఊరుకోవడం! చాతనయితే వాటితోపాటు సర్దుకుపోవడం తప్ప చేయగలిగిందేమీ లేదని.

మధుసూధనం జగన్నాథ రథం వంటివాడు. అది కదిలింది. ఇక ఆపడం కష్టం.

నా అయినా తప్పలేదు కూడా!

సంక్రాంతి శలవలన్నీ అయిపోతున్నాయనగా దిగబడ్డాడు మధుసూధనం ఆ సాయంత్రం నా దగ్గరకు వచ్చాడు.

"మాస్టారూ, ఒక మాట చెబుదామని వచ్చానండి" అన్నాడు సీరియస్‌గా.

"చెప్పు" అన్నాను నిర్లిప్తంగా.

"అయిన వారందరికీ దూరంగా ఇన్నాళ్ళూ పెరిగాను. ఒక్క తల్లి ప్రేమ తప్ప మరేదీ ఎరగనివాడిని. అటువంటిది నా వాళ్ళంతా నన్ను ఆదరిస్తుంటే వాళ్ళతో కలవడం తప్పంటారా" అనడిగాడు.

నేను మాట్లాడే లోపలే మళ్ళీ అందుకుని "నన్ను చిన్నతనంనుంచి ఎరుగున్నారు మీరు కూడా. నా మనస్సుకి నచ్చిన పనిని ఎవరెన్ని చెప్పినా ఆపనిని మీకూ తెలుసు....మా మావయ్య కూతురు రాధికని పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాను" అన్నాడు.

ఆశ్చర్య పడేందుకు నాకు కొంత టైమిచ్చాడు. కాని నే నటువంటి దేమీ చెయ్యకపోవడంతో అతనే విస్తుపోయాడు. "ఏం మాస్టారూ నేను చేస్తున్న పనిని విమర్శించరేం? మా గోపాలరావు బాబాయిలాగా తిట్టరేం నన్ను? మా అమ్మ

లాగా నిలువునా ప్రశ్నలతో నింపరే?"

"చూడు మధుసూధనం, నువ్వు చదువులో నాకన్న పెద్దవాడి వవుతున్నావని ఇదివరకే చెప్పాను. నేను నీకు చెప్పవలసిందీ చెప్పాను......పైగా నువ్వే చెప్పావు కూడా—నీ విషయం పూర్తిగా తెలిసిన వాడివని"—

వా తరహాకి కొద్దిగా దెబ్బ తిన్నట్టున్నాడు—అయినా తన ధోరణిలోనే "మా రాధిక చాలా బావుంటుంది మాస్టారూ! అంతా మా అమ్మ పోలికేనుట మామయ్య అన్నాడు. నిజం కూడా అంతే......అయినవాడు, పైగా నాన్నగారికి ఈ సంబంధం చేసుకోవడం చాలా ఆనందం కలిగి స్తోంది. అమ్మకూడా ఒప్పుకుంది......"

ఇంకా ఏదో చెప్పబోతుండగానే "శుభం. చాలా మంచి పని చేస్తున్నావు మధుసూధనం. అయిన వాళ్ళనందరినీ దగ్గర చేసుకుంటున్నావు....మరి వస్తాను కొద్దిగా పనుంది" అని లేచాను.

ఇద్దరం కలిసి బయటికి నడిచాం.

నాకయితే ఈ వార్త ఎంత బాధ కలిగించిందో చెప్పలేను. డాక్టరు చదువుతున్న కొడుకు సిద్ధంగా వస్తున్నాడు మోహనమూర్తికి. డాక్టరవబోతున్న అల్లుడు అతి చౌకగా దొరుకుతున్నాడు ఉమా పతికి. కాని పోతే ఈ డాక్టరు తయారయేం దుకు తన రక్త మాంసాలని, సుఖాలని ధార పోసిన వ్యక్తికి లభ్యమవుతున్నది ఏమిటి? పోనీ ఈ విషయంలో వాళ్ళు నేరుగా వచ్చి ఆమెతో సంప్రదించారా? అదీ లేదు. ఆమె పూర్తిగా విస్మ రించబడింది! ఎవరికోసం అయితే తన సర్వస్వాన్ని పణం పెట్టిందో అటువంటి కొడుకు చేత కూడా! ఇలా జరుగుతుందని ముందుగా తెలిసిఉంటే దాచు కున్న ప్రతి పైసా ఖర్చు పెట్టేదా? తన కడుపు మాడ్చుకుని వీడిని నవనవ లాడేట్టు చేసేదా?......

ఉద్రేకంతో వెళ్ళిపోతున్న నన్ను గోపాలరావు పిలుపు ఈ లోకంలోకి తెచ్చింది. అప్పుడు గమ నించాను రాజేశ్వరమ్మ ఇంటిని దాటి వెళ్ళిపోతున్నానని!

లోపలికి అడుగు పెట్టగానే మంచంమీద నున్న రాజేశ్వరి అగపడింది.

రెండు రోజుల క్రితం చూసిన దానికి ఇప్ప టికీ చాలా తేడా అగపడింది. రెండు రోజుల్లో మనుష్యులు ఇంతగా తగ్గిపోవడం నే నెక్కడా చూడ లేదు!......


"అక్కయ్యకి ఉదయంనుంచి జ్వరమండి" అంది పద్మావతి.


నేనేమీ మాట్లాడలేదు. నోరు తెరిస్తే మధు సూధనంని తిడుతూ, మాటలు వస్తాయని భయం. అవి ఆమెనేం బాధ పెడతాయోనని భయం.... రాజేశ్వరమ్మ మాత్రం మూసిన కన్ను తెరవకుండా పడి ఉంది. కాసేపు కూర్చుని లేవబోతుంటే "పెళ్ళి కబురు చెప్పాడా ప్రబుద్ధుడు?" అనడిగాడు గోపాల రావు.

"ఊఁ" అని మాత్రం అని గబుక్కున బయట పడ్డాను.

తొందర పనిమీద ఊరు వెళ్ళవలసి వచ్చిన నేను రెండు రోజులదాకా తిరిగి రాలేకపోయాను. వచ్చీ రావడమే రాజేశ్వరమ్మకి సుస్తీ చాలాఎక్కువగా ఉందని తెలుస్తే వెళ్ళాను మా ఇందిరతో సహా. అయితే మేం వెళ్ళేసరికే అంతా అయిపోయింది.

... చెల్లెలుగా నాలోని జాలిని పంచుకున్న రాజేశ్వరి ఇక లేదనగానే నా గుండె బరువెక్కి





ఆంతర్యం

పోయింది. ఇక అక్కడ నిలబడలేకపోయాను. మధుసూధనం మేనమామగారింటికి వెళ్ళడంవలన అతనికి కబురు తెలిసి, వచ్చేసరికి కొంతసేపు పడుతుందని నేను ఇంటికి బయలుదేరాను.

ఈ రెండు రోజులో ఎప్పుడో వచ్చిన ఉత్తరం ఒకటి నా కోసం ఎదురు చూస్తోంది. తీసి చూశాను. రాజేశ్వరి రాసినది. ఆత్రంగా చదివాను.

"అన్నయ్యగారికి!

మిమ్మల్నిలా పిలవడం ఇదే మొదటిసారి— బహుశ ఆఖరిసారి కూడా! ఎందుకో అనిపిస్తోంది ఇక బ్రతకనని.

జీవితంలో నేను కోరినది ఒక్కటి -- మధుసూధనాన్ని ప్రయోజకుడిని చేయడం. మీ అందరి సహకారంతో నా కోర్కె తీర్చుకో గలిగాను. వాడు డాక్టరు కబోతున్నాడు.

అయితే, చివరలో నేను ఆశించనిది మరొకటి జరిగింది. అది వాడి తండ్రి, మేనమామ వాడిని దగ్గరకు తీయడం. ఆఖరికి వాడి చదువు భారాలు కూడా వీళ్ళే వహించడం......వాడు కూడా వాళ్ళతో కలిసిపోవడం చిత్రం కదూ మాస్టరుగారూ, రక్తం ఎక్కడికి పోతుందిట?

మొత్తానికి నా నెత్తిమీది బరువు దింపారు వాళ్ళు వాళ్ళు. చివరికి మా అన్నయ్య కూతురి నివ్వ బోతున్నాడు. మధు కేవలం మామయ్య అన్న గౌరవంతో ఈ పెళ్ళికి వప్పుకున్నాడేమోనని. ఇందాక వాడిని పరీక్ష చేశాను. చివాట్లు వేశాను. "నన్ను కాదన్నవాడు నీకు మామయ్య ఎలాగవుతాడు?" అనడిగాను.

"మామయ్యగా కాకపోతే ఉమాపతిగా చూస్తున్నాను" అనుకోమన్నాడు. అదీ కాకపోతే, "రాధిక కోసం ఇష్ట పడ్డాననుకో" మన్నాడు. "ఏది ఏమయినా నా నిర్ణయం మారేదిలేదు. రాధిక నా భార్య" అన్నాడు.

ఆనందపడ్డాను. వీడి నిర్ణయాన్ని మార్చడం ఎవరి తరమూ కాదు! కాబట్టి వీడు మనస్ఫూర్తిగా చేసుకుంటున్నా డీ పెళ్ళి.

ఇక నా కీ లోకంలో పని తీరిపోయింది. నాకు తెలుసు—నేను మృత్యువుకి రోజుల దూరంలో ఉన్నానని.

నా వాళ్ళు నన్ను స్వీకరించకపోయినా బాధ లేదు. నా కొడుకుని చేరదీశారు అంతే చాలు.

మీ సహకారానికి కృతజ్ఞురాలిని. ఇందిరకి ఆశీస్సులు.

మీ చెల్లెలు,
రాజేశ్వరమ్మ".

అయితే ఆమె మధుసూధనం వివాహాన్ని, అతను తన వాళ్ళతో చేరడాన్ని హర్షిస్తోందా లేక అందుకు బాధ పడుతోందా అన్న విషయం స్పష్టంగాతేలలేదు.

ఉత్తరాన్ని మరోసారి చదివాను. అప్పుడు మరో అనుమానం కలిగింది — కొంపదీసి ఈమెది ఆత్మహత్య కాదు కదా అని.

ఆలోచించాను కాని ఒక నిర్ణయానికి రాలేకపోయాను.

నా జీవితంలోకి ఒక సమస్యతో ప్రవేశించింది. ఒక సమస్యనిచ్చి నిష్క్రమించింది. ఆమె గురించి ఎటు చెప్పడం కష్టమే.

ఆమె శరీరానికి చేయవలసిన అంత్యక్రియల కోసం వాళ్ళ ఇంటికేసి బరువుగా నడిచాను. ★

"మీరు నాకు అప్పివ్వడం ఎవడో చూసేడు. 'డికది విడ్డూరంగా కనిపించి ఉంటుంది. కొంత ఊహించేడు. కథ తయారయింది. అది ప్రచా ంలో పెట్టాడు. ఆ కథ విని తలలూపాయి చాలా ్రెలు. నోటి కొచ్చినట్టు వాగారు. నేనీ వాగు కి భయపడి పోయేదాన్నికాను. అదే మరో అమా యకురాలైతే ఎంత క్షోభించేదో గదా! జీవితంలో 'లా దెబ్బలు తిని ఉన్నాను శంకరంగారూ! ప్రతి న్న దానికీ భయపడే దాన్నవుతే ఈ భయం బతుక్కు ఎప్పుడో ముగింపు పలికేదాన్ని."

"వాళ్ల మాటలు నేనూ విన్నాను."

"మంచి మనసు కాని వాడికి ప్రతిదీ వింతగా, అనుమానాస్పదంగా కనుపిస్తుందంటారు. ఇలాటి వాళ్లు చాలామంది మన ఆఫీసులో ఉన్నారు. వాళ్లని చూస్తుంటే ఒక పక్క జాలీ మరో పక్క కోపంగా ఉంది" అన్నది కుసుమ.

"ఇలాటివి అసలు పట్టించుకో కూడదు"

కుసుమ పేలవంగా నవ్వింది.

"ఇదే కాదు. నేను చాలా విషయాలని పట్టించు కోలేదు. నన్ను సవాలు చేసిన సమస్యల్ని నవ్వుతూ అవతలకి నెట్టేను. క్షమించండి. ఉద్రేకంగా మాటాడుతున్నాను కాబోలు......"

"..............."

"చిన్నప్పట్నుంచీ నా బ్రతుకు ఒక ప్రయోగంలా జరిగింది శంకరంగారూ! లేబరేటరీలో రసాయనిక ప్రయోగాలు జరుగుతాయి చూడండి... ఆ విధంగానే.......నా చుట్టూ అనేక విధాలైన పరిస్థితులు నా మనో నిబ్బరాన్ని పరీక్షించాయి. ఇప్పటివరకూ నా లోని సహనం చావనందుకు గర్వపడుతున్నాను. మొన్న మొన్నటి వరకూ మా అమ్మ బ్రతికే ఉంది. ఆవిడ దేవత. ఆమె జీవితం ఒక ఎదురీత. జీవితం బ్రతకటానికని అమ్మ మొట్ట మొదటిసారిగా చెప్పింది. ఈ సూత్రాన్ని ఆవిడ ఆచరించకపోతె, మా అమ్మ బ్రతికేదీ కాదు, నే నిలా తయారైయ్యేదాన్నీ కాదు. అమ్మ చిత్రమైన వలలో చిక్కుకుంది. మా ఊరు తిరువూరు. ఆ ఊళ్లోనే అమ్మ పంతులమ్మ ఉద్యోగం చేసింది. మాది ఏమంత ఉన్న కుటుంబం కాదు. ......నా కథ చెప్పి మిమ్మల్ని విసిగించాలని నా ఉద్దేశ్యంకాదు. నే నెలాటి పరిస్థితిలో ఈ ఉద్యోగం చేస్తున్నానో, అర్థం చేసుకునేపాటి సంస్కారంగల మీతో చెప్పుకుందామని ఎప్పట్నుంచో అనుకునే దాన్ని. అవకాశం లేక ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వచ్చాను. ఇవ్వాళైనా మీతో చెప్పుకుందామనే తలంపుతో మిమ్మల్నిక్కడికి రావలసిందిగా కోరుకున్నాను. మీ కేమీ అభ్యంతరం లేకపోతే నా కథ వింటారనే ఆశిస్తాను" అన్నది కుసుమ.

"చెప్పండి" తన కుతూహలాన్ని ప్రదర్శించాడు శంకరం.

"అమ్మకి ఒక వ్యక్తితో పరిచయ మయ్యింది. ఇద్దరూ పెళ్ళి చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చారు. ఇటు అమ్మ తరఫువారు, అటు నాన్న తరఫు వాళ్ళూ ఈ పెళ్లికి వప్పుకోలేదుట. వాళ్ల పెళ్ళి ఆటంకాల్తోనే జరిగింది. రెండు పక్షాలవారూ వెలివేశారు. సంవత్సరం గడిచింది. నేను పుట్టాను.

"చూడండి శంకరంగారూ మగ బుద్ధు లెలా ఉంటాయో? అంతవరకూ 'పార్వతే నా ప్రాణం' అన్ననాన్న ఈ సంవత్సర కాలంలో మారిపోయారు. తన వాళ్లందర్నీ రోజూ తలుచుకుంటూ, అందర్నీ

మనిషి - మిథ్య

18 వ పేజీ తరువాయి

దూరం చేసుకున్నాననే దుగ్ధని బహిరంగంగా చాటుకునేవారుట. అమ్మ ఆయన మాటలన్నీ వినేది.

"ఎంతకీ తన వ్యథా, తన త్యాగం గురించే చెప్పుకునే వారేగాని, అమ్మనీ ఆమె సాహసాన్నీ ఆయన ప్రస్తావించేవారు కానే కారుట.

"ఒకనాడు నాన్నగారి తరఫున ఎవరో పెద్దలు మా ఇంటికి వచ్చారుట. ఆ రాత్రి అంతా నాన్నగారితో మాటాడారు. ఉదయమే వెళ్ళిపోయారు.

"ఆనాడు లగాయితూ నాన్న అమ్మమీద, తమ పెళ్ళిమీద, తమ సంసారంమీదా విసుక్కోడం ప్రారంభించారుట. ప్రతి చిన్న విషయానికీ అమ్మని దెప్పి పొడవడం, ఆమెను ఏడిపించడం నేర్చుకున్నారు. 'నీ గురించే మా వాళ్ళందరికీ దూరమై నరకం అనుభవిస్తున్నాను, ఈ ప్రేమ పెళ్ళిలో

మనిషి మిథ్య

ఇంత నరకం ఉంటుందని తెలిస్తే నిష్కృతిని చేసుకునే వాడినేగాదు. నాకీ ఇంట్లో సుఖం లేక పోతోంది' అని ఆయన రోజూ అనేవారు.

"అమ్మ తన బాధనీ, దుఃఖాన్నీ, లోలోన దిగ మింగుకునేది. నన్ను చూచి ధైర్యం వహించేది కొన్నాళ్ళు ఇలా గడిచిన తర్వాత ఆయన ఒక రాత్రికి రాత్రి ఇల్లు విడిచి వెళ్ళిపోయారు. అమ్మకోసం ఒక చిన్న చీటీ రాశారు! 'న్యాయా న్యాయాలు నిర్ణయించే భగవంతుని సన్నిధానంలో నా తప్పుల్ని ఒప్పుకుని శిక్ష ఆమోదిస్తానేమోగాని, మా వాళ్ళకి దూరమై ఇక్కడ నరకం అనుభవించలేను పార్వతీ!' అని ఉందిట.

ఆమదాలవలసలో మావయ్య వాళ్ళున్నారు. వాళ్ళకి ఖబురు తెలిసింది. వచ్చి అమ్మని తీసు కెళ్ళారు. ఆమె నోరార్పారు. కొందరు దెప్పి పొడి చారు, అమ్మ చేసిన 'పిచ్చి' పనిని గేలి చేశారు. ఎవరికీ సమాధానం చెప్పలేదు అమ్మ.

"మావయ్య వాళ్ళు అన్నారుట, నాన్నని వెతి కించి మళ్ళా నీ కాపురం నిలబెడ్తే పూచీ మాదని. అమ్మ వాళ్ళని వారించింది. ఆయనకి సంసారంలో సుఖం లేదనీ, ఎక్కడైనా ఆయన హాయిగా ఉంటే చాలనీ వాళ్ళకి నచ్చచెప్పింది. వాళ్ళ ప్రయత్నం తప్పని సరిగా విరమించుకోవలసి వచ్చింది. చెప్పండి......అమ్మ దేవతగాదూ......నాన్నని క్షమించ గల సహృదయం అలాటి దేవతల్లోనే ఉంటుంది గదూ" అన్నది కుసుమ బాధగా.

శంకరం జాలి చెందాడు.

"ఇదీ అమ్మ కథ. ఆ అమ్మ దగ్గరనే పెరిగి పెద్దదాన్నయ్యాను. నాకు బాగా వయస్సు వచ్చేంత వరకూ ఆవిడ కథ తెలిసిందికాదు. అదీ చెప్పేది కాదేమోగానీ—నాకు వచ్చే ప్రతీ సంబంధం 'అమ్మ కథ' తెలిసి, వెళ్ళిపోవడంతో ఆమె తన కథని చెప్పక తప్పలేదు.

"నాకీ జన్మలో పెళ్ళి కాదేమోనని అమ్మ బెంగపడి పోయింది. ఆ బెంగలోనే ఆవిడ మంచం పట్టింది. నేను టైప్ నేర్చుకున్నాను. ఆ ఊళ్ళోనే ఒక ఆయిల్ మిల్లులో టైపిస్ట్‌గా కాలు పెట్టాను. అక్కడే నాకు రాజారావుతో పరిచయమయ్యింది.

ఈ పేరు వినగానే శంకరం ఉలిక్కిపడ్డాడు. అతనిలోని ఈ మార్పు గమనించి కుసుమ అడి గింది—

"మీ కాయన తెలుసా?"

"ఎక్కడో విన్నట్టు గుర్తు. పూర్తిగా చెప్పండి మీ కథ"

"రాజారావు గురించి అప్పటికీ ఇప్పటికీ నా ఉద్దేశ్యం ఒక్కటే. అతను నన్ను అమితంగా ప్రేమిస్తాడు. ఈ విషయం అమ్మతో చెప్పాను. అమ్మ నవ్వి అన్నది 'నా కథ నీకు తెలుసు. నా కూతురు గతి అలాగే కావాలని ఏ తల్లీ కోరదు తర్వాత నీ ఇష్టం' అని.

కాని రాజారావు గుణంలో, అతని మాటల్లో అనుమానించదగ్గ అంశమేదీ కనిపించలేదు. రాజా రావుకీ, నాకూ పెళ్ళి అయింది. మా పెళ్ళయిన, మూడు నెలలకి అమ్మ పోయింది. పోతూ పోతూ 'జాగ్రత్త తల్లీ జీవితం పట్ల నిర్లక్ష్యం తగదు' అని హెచ్చరించింది.

నేనెప్పుడూ జీవితాన్ని నిర్లక్ష్యం చెయ్య లేదు. రాజారావే నాకు సర్వస్వం, దేవుడూను. రాజారావు నా ఉద్యోగం మాన్పించాడు. ఇంటి పనులు చక్కపెట్టుకోడం నీ వంతు అన్నాడు. తలూపాను.

రాజారావు విపరీతమైన ఖర్చులకి అలవాటు పడ్డ మనిషి. చివరికి అదే నా సంసారాన్ని నాశనం చేసింది. స్తోతికి మించిన ఖర్చులకోసం మితి మీరిన అప్పులచేసి, ఆఫీసులో డబ్బు దొంగిలిం చేడు. నాలుగు రోజులు అటు ఆఫీసులోనూ, ఇటు ఇంట్లోను. ఈ దొంగతనం తెలీనివ్వలేదు. చివరికి తెలియక తప్పిందికాదు. మానేజరు రాజా రావుని పోలీసుల కప్పగించటానికి చూసేడు. అతను పారిపోయాడు.

దొంగ భార్యని. నాకు ఆ ఊళ్ళో ఎవ రుద్యోగం ఇస్తారు. ఆఫీసులో దొంగలించిన పైకం మమ్మల్ని కట్టమని మానేజరు వత్తిడి చేశారు. అత్తయ్యవీ, నావీ నగలు అమ్మి పైకం కట్టేశాం.

చివరికి అదృష్టవశాత్తూ ఇక్కడ ఉద్యోగం దొరికింది. వచ్చాను. నన్ను నేను పోషించుకునే ధైర్యం నాకుందిగాని, నా నిజాయితీని లోకానికి నచ్చచెప్పగల సహనం రోజు రోజుకీ తగ్గిపోతుంది.

ఇక్కడే మరొక మాట — రాజారావు మా నాన్న గారిలా మోసగాడు కాదు. ఇప్పటికీ అతనికి నా పైన అనురాగం తప్పకుండా ఉండి ఉంటుంది. రెండు రోజుల క్రితం మావయ్య వాళ్ళ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. రాజారావు ఆమదాలవలస వచ్చాట్ట. నాగురించి అడుగుతే, నిజం చెప్పటానికి వాళ్ళ కిష్టం లేక మాకు తెలీదని బొంకారుట. రాజారావు వెళ్ళిపోయాడు. చెప్పండి శంకరం— రాజారావుకి నామీద ప్రేమ లేదంటారా? ప్రేమ లేకపోతే మళ్ళీ నన్ను వెతుక్కుంటూ ఆమదాల వలస వచ్చేవాడేనా?" అడిగింది కుసుమ.

"మీరు చెప్పేది వింటే నాకూ అలాగే అని పిస్తుంది"

"ఒక్క నిమిషం .... ఇప్పుడే వస్తాను" అంటూ లోపలికి వెళ్ళి ఒక ఫోటో తీసుకొచ్చింది.

"చూడండి.....రాజారావు మొహంలో ఎక్క డైనా మోసం కనిపిస్తుందేమో" అన్నది ఆవే శంగా.

శంకరం ఫోటో చూశాడు. తలని తల తిరిగి నంత పనయింది తిరిగి ఇచ్చేస్తూ,

"మళ్ళా మీ సంసారంలో సుఖశాంతులు కలగా లని ఆశిస్తాను. వస్తాను. సెలవు" అని చెప్పేసి గబ గబా బయటికి వచ్చేశాడు. అక్కడికి దగ్గర్లోవున్న హోటల్లో దూరాడు.

అప్పటిగ్గాని తన కలవరపాటు తగ్గిందికాదు.

"రాజారావు!"

పెంచి పెద్ద చేసిన నాన్నని బాధ పెట్టి ఇంట్లో డబ్బు దొంగిలించి పారిపోయిన రాజా రావు కుసుమతో చెలగాట మాడుతున్నాడు. అతని బుద్ధి కించిత్తు గూడా మారలేదు. పాపం రాజా రావుని కుసుమ ఇప్పటికీ నమ్ముతుందేమిటి?

శంకరానికి కుసుమపైన జాలీ, రాజారావుపైన విపరీతమైన కోపమూ కలిగాయి. అతని మనసు వికలమయ్యింది. ఇప్పుడేం చెయ్యాలో తోచకుండా ఉంది.

అందరిచేతా అనిపించుకుని, సాధించేది ఏమీ లేదని, తనమీద తనకి అప నమ్మకం కలిగిన రాజా రావు ఏ నాటికైనా నాన్న దగ్గరికి వచ్చి క్షమించ మని ఆయన కాళ్ళమీద పడక తప్పదు. ఆ తరు ణమూ అతి దగ్గరలోనే ఉంది. రాజారావు చేసిన పాపాన్ని అతని చేతనే ఒప్పించి, కుసుమని అతని కప్పగించి, వాళ్ళ సంసారంలో మళ్ళీ వసంతం నింపడం తన ధర్మం.

శంకరం రూమ్ వైపు నడక సాగించాడు గాని, కొంత దూరం వచ్చిన తర్వాత ఆగిపోయాడు. అతనికింత త్వరగా రూమ్ కెళ్ళాలనిపించలేదు.

శారద పాట గుర్తు కొచ్చింది. ఆమె రూపం అతనిముందు లీలగా నిలచింది. అప్రయత్నంగా అతని కాళ్ళు శారద ఇంటి వైపు దారి తీశాయి.

శారద ఇల్లు కనుక్కోడం ఏమంత కష్టమని పించలేదు. చాలా చక్కగా ఉంది ఇల్లు, అధునా తన పద్ధతిలో కట్టారు.

గేటు తెరుచుకుని ఆవరణలోకి అడుగు పెట్టాడు. లోపల హాల్లో శారదా, మృణాళినీ ఏదో మాటాడుకుంటున్నారు. శారద తనని చూడగానే మృణాళినితో మాటలాపి లేచి నిలబడుతూ,

"రండి రండి, చాలా రోజులకి దయ కలిగింది. లోపలికి రండి" అని ఆహ్వానించింది.

శంకరం లోపలికి వచ్చాడు. అతన్ని చూచి మృణాళిని శారద దగ్గర సెలవు తీసుకుని వెళ్ళి పోయింది.

"అయ్యో రామ. ఇంకా అలాగే నిలబడి ఉన్నారే. కూర్చోండి" అన్నది శారద. శంకరం కూర్చు న్నాడు.

"ఒక్కక్షణం అమ్మని పిలుస్తా నుండండి" అని ఆమె లోపలి కెళ్ళింది. (సశేషం)

సినిమా వార్తలు

11 వ పేజీ తరువాయి

సంగీతం: కె. వి. మహాదేవన్, ప్లేబేక్: ఘంటసాల, పి. సుశీల, కె. జమునారాణి, ఛాయ: సి. నాగేశ్వర రావు అండ్ జి. వి. సుబ్బారావు, నృత్యం: హీరాలాల్, కూర్పు: సంజీవి, దర్శకుడు:వి. మధుసూధనరావు, నిర్మాత: రాజేంద్రప్రసాద్.


సంజీవి

ప్రముఖ సినీ దర్శకుడు శ్రీ ఎల్. వి. ప్రసాద్ సోదరుడు—ఫిలిం ఎడిటర్‌గా చాల కాలంనుండి ఫిలిం పరిశ్రమలోవున్న సంజీవి ఒక తెలుగు చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు తెలుస్తుంది.

రోనా ఫిలింస్ "అమ్మా-నాన్న"

రోనా ఫిలింస్ పతాకం క్రింద "అమ్మా—నాన్న" చిత్రాన్ని తెలుగులో, మెజస్టిక్ స్టూడియోలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి రచన, నిర్మాత, దర్శకుడు: యడవల్లి లక్ష్మీనారాయణ, సంగీతం: టి. వి. రాజు, ఛాయ: మల్లీ ఇరానీ, కళ: రాజు, కూర్పు: మార్తాండ్.

ఈ చిత్రంలో కాంతారావు, జానకి, నాగయ్య, హరనాథ్, రాజశ్రీ, రాజనాల, ఛాయాదేవి, సురభి బాలసరస్వతి, చదలవాడ, బాలకృష్ణ మొదలగువారు ఉన్నారు. వీరుకాక ఇంకా సాత్రికేయులు జి. వి. జి. పోతుకూచి సాంబశివరావు, నూతన నటుడు జ్ఞాన లోచనరావు కూడా నటిస్తున్నారు.



out of this powder box
comes the softest look
you've ever
worn

*the **matte-mist** finish*
of Max Factor face powder

SO FEATHER LIGHT YOU CAN HARDLY FEEL IT ... SO BEAUTIFULLY BLENDED IT NEVER CHANGES COLOR OR PATCHES ... THE MATTE-MIST FINISH OF MAX FACTOR FACE POWDER, PERFECTED TO ENHANCE TODAY'S SUBTLE, SOFT MATTE LOOK.

MAX FACTOR

SOLE SELLING AGENTS: T. T. KRISHNAMACHARI & CO. BOMBAY-CALCUTTA-DELHI-MADRAS

Aiyars MF 271

సినీమా వార్తలు

యస్. ఆర్. ఫిలింస్‌వారి "ప్రమీలార్జునీయం" ప్రారంభోత్సవం

నవంబరు 27 వ తేదిని వాహినీ స్టూడియో 1 వ ఫ్లోర్‌లో యస్. ఆర్. ఫిలింస్‌వారు "ప్రమీలార్జునీయం" చిత్రంను లాంఛనప్రాయమైన పూజతో ప్రారంభోత్సవం చేశారు.

విజయా అధినేత శ్రీ నాగిరెడ్డి స్విచ్ ఆన్ చేశారు. దర్శకుడు: శ్రీ సి. యస్. రావు క్లాప్ కొట్టారు. ప్రథమ చిత్రీకరణ యన్. టి. రామారావుతో చేశారు. ఇంకా ఆ రోజు సెట్టులో. కాంతారావు, పద్మనాభం మొదలగువారు ఉన్నారు. ఈ చిత్రానికి దర్శకుడు: మల్లికార్జునరావు.

సెట్టుమీద సింహాచలక్షేత్ర మహిమ

శిరీష అంతరిక్షలోకాల్లోని ఒక అప్సరస. అయినా తానొక ఊహా సుందరుణ్ణి చిత్రించుకొని వానికే తన సర్వస్వం అంకితంచేసి, వానికై త్రిలోకాలూ గాలించి తిరిగింది. కడకు ఒకనాటి భూలోక విహారంలో, గాయపడి నిస్సృహలోవున్న అతనిని చూడగలిగింది. ఆ అదృష్టశాలే పురూరవ చక్రవర్తి. ఆమె అతనికి స్మృతి కలిగించింది. హృదయాన్ని కృతి చేసింది. ప్రేమను చిలుకరించింది. దివినుండి భువికి ప్రతి రాత్రి దిగివచ్చి, అతనిని కలియ నారంభించింది. శుక్లపక్ష చంద్ర కిరణాల్లా వారి హృదయానుబంధం పెరిగి పవిత్ర ప్రేమగా ఇద్దరి హృదయాల్లోనూ ముద్ర పడింది.

శిరీష సౌందర్యానికి ముగ్ధుడైన దేవేంద్రుడు ఇది గ్రహించి—ఆమెను తన దానిగా కావాలని శాసించేడు. స్వేచ్ఛగా పొంగి పారతే సెలయేటి కెరటాలను పారకుండా ఎవరు శాసించగలరు. శిరీష విముఖతకు సహించలేని దేవేంద్రుడు—ఆమెను భూలోకవాసిగా కమ్మని, పురూరవుని స్మృతి పథంలోంచి కూడ తొలగి పొమ్మని పరోక్షంగా శపించాడు. అమరత్వం కోలుపోయిన శిరీష అవనిపై సామాన్యగా అవతరించి పురూరవునికై నగరుకు పయనమైంది ఎంతో ఆశతో శిరీష.

ఆనాడు పురూరవ చక్రవర్తి నిండుకొలువు తీర్చిఉన్నాడు. వందలాది ప్రజలు, రాజ ప్రముఖులు, సామంతులు కొలువు నిండిపోయేరు. మణిమయ ఖచిత సింహాసనంపై పురూరవుడు కోటి సూర్యప్రభతో దేదీప్యంగా వెలుగొందుతున్నాడు. అంతలో ఒక భటుడు ప్రవేశించి—సవినయంగా రారాజుకు నమస్కరించి, "మహారాజా! తమ దర్శనార్థం ఎవరో స్త్రీమూర్తి వేచి ఉంది" అని విన్నవించుకున్నాడు. "సత్వరం ప్రవేశపెట్టు" అన్నాడు చక్రవర్తి. భటుడు మరలిన మరుక్షణంలో శిరీష ప్రవేశించింది. దూరాన సింహాసనాన తన ప్రేమదైవాన్ని గుర్తించింది.అస్ఖార రూపానికి, ఆ నిండు గాంభీర్యానికి ఎంతో మురిసిపోయింది. మరుక్షణంలో తనాతడినుండి పొందబోయే ఆదరాభిమాన ప్రేమల నూహించుకుంటూ, అడుగులు ముందుకు వేసింది. కోరికలు సిగ్గుల దొంతరలు కాగా, కోరికలచే తన దేవుని వంక చూస్తూనే మెల్లిగా నడిచింది.

నిస్తబ్దగా—నిర్నిమేషగా తనను సమీపిస్తున్న శిరీష వంక పురూరవుడు కూడ చూశాడు. ఆమెహోని ఆత్రము అతనికెందుకో కలవరంలా అనిపించింది. ఆశ తీరా ఆమె అతనిలోకి చూసింది. అతని చూపు



"త్యాగమూర్తులు"లో బి. సరోజాదేవి

లో ఆమెకు అనుకున్న సమాధానం కనుపించక కాబోలు అదే పనిగా అతని వైపు దృష్టి నిలిపి వేసింది.

ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ పురూరవుడు—"ఎవరు నవ్వు!" ఆ మాట అతని నోటివెంట రాగానే శిరీష తన కళ్ళను తనే నమ్మలేక పోయింది. ఆమె హృదయంలో అగ్ని పర్వతం బ్రద్దలయింది.సముద్రం ఘోషించింది. కళ్ళెదురుగావున్న తన ప్రభువు కొలువు. రాచ మందిరం గిర్రున తిరుగునట్లయింది. అర్థంకాని ఆవేదనతో, హృదయంతోపాటు పెదిమలు కూడా వణికి పోయాయి. నోటి మాట రాలేదు. పురూరవునికి మాత్రం ఆమె నిస్సమాధానం అనూహ్యమైంది.

"నానుండి నీకు కావలసిన న్యాయం ఏమిటి?" అని అనునయంగా పలికేడు పురూరవుడు.

జతగా, కలిసి, మెలిసి, ఆశను నిలుపుకొని, బాసలు చేసుకొని, అమూల్య స్వర్గాలలో ఓలలాడిన—తన ప్రేమ దైవమే తననలా అపరిచితవలె అడిగేసరికి ఆమె హృదయంతోపాటు పెదవులు కూడా అచేతనమై పోయాయి.

అవ్యక్తమైన ఆమె వేదనేదో అర్థంకాక తిరిగి రారాజే ఆమెను పలుకరించేడు. "ఎందుకలా నీలో నువ్వే సతమతమౌతావ్! నీ బాధేమిటో బాహాటంగా చెప్పుకోవచ్చు. మా పరిపాలనలో నీకేమైనా అన్యాయం జరిగిందా!" అని. ఆ మాటలకు ఆపాదమస్తకం కంపించి, కదలలేని పెదవులను కదిలించి "ప్రభూ" అని మాత్రం అనగలిగింది. ఆ మాటలో అలవికాని నిస్పృహ—నిరాశ పెల్లుబికేయి.

"సంకోచించకు! నిన్ను చూస్తూంటే ఏదో తీరని వ్యథతో నీ మనసు సంక్షోభిస్తున్నట్లున్నది. నిన్నిలాటి క్షోభకు గురి చేసిన దుర్మార్ము డెవరు?" అని పురూరవుడు సూటిగా ప్రశ్నించేడు.

తన కన్యాయం జరిగినా, తన దైవ దూషణకు ఆమె సహించలేక "ప్రభూ!" అంటూ అతని వాక్ఝరికి మాత్రం ఆనకట్ట వేసింది. కాని జారి వరదలై కారే తన కన్నీటిని మాత్రం ఆపుకోలేకపోయింది. అది గమనించి,

"ధర్మ లక్ష్యపరుడైన ఈ పురూరవుని సామ్రాజ్యంలో ఒక అబల కన్నీరొలికించడానికి వీల్లేదు" అంటూ పురూరవుడు తన ఆత్మాభిమానాన్ని సభాముఖంగా ఉద్ఘాటించేడు.

బదులిచ్చే వ్యక్తే—ప్రశ్నవేస్తే, బదులివ్వడం ఎవరితరం? తన బాధ అతని కెలా ఎరిగించాలో ఆమె కర్థం కాలేదు. అయినా పరోక్షంగా తన కన్నీటి గాథను చూఛాయగా వెల్లడించింది.

"కనుల ముందే కన్న కలలన్నీ కరిగి పోతుంటే, కన్నీరుగాక, జీవితంలో నాకింకేముంది ప్రభూ!" అని బాధితులనుచూసి జాలిపడటం, బాధ నివారించి సాయపడటం క్షేత్ర ధర్మం. పురూరవుని మనస్సుకు ఆ సన్నివేశం అంతవరకే అర్థమైంది.

"లేనిదానికై చింతసాత వెందుకు. ఇప్పుడు నీకు కావలసిం దేమిటో కోరుకో! ధన, కనక, వస్తు, వాహనాదుల్లో ఏదైనా తక్షణమే నీకు లభిస్తుంది" అన్నాడు పురూరవుడు.

ఏడవలేక నలిగిపోయే ఆమె హృదయం పేలవంగా నవ్వుకుంది.

"మీరిచ్చే సిరిసంపదలు, ధనికురాలిగా నా అంతస్థును పెంచగలవేమోగాని, నా అంతరాత్మను సంతృప్తిపరచలేవు ప్రభూ?" అంది శిరీష.

దానితో ఆమె రాకలో వైనమే అతని కర్థం కాలేదు. "ఇంతకూ ఏమిటి నీ విన్నపం!" అని సూటిగా ప్రశ్న వేశాడు పురూరవుడు.

గత గాథను ఒక్కసారి అమూలాగ్రంగా నెమరుకు తెచ్చుకొని—"విన్నపం విన్నవించుకున్నా, అది మీ దృష్టిలో అపరాధమే కావచ్చు ప్రభూ!" అంటుంది శిరీష.

"కానక్కర్లేదు. నువ్వు పడే పశ్చాత్తాపానికైనా నిన్ను నేను క్షమిస్తాను. నువ్వు చేసిన నేరమేమిటో నిర్భయంగా చెప్పు!" అంటూ జాలి పడుతూ అంటాడు పురూరవుడు.

శిరీష మనసును కొంచెం దిట్టపరచుకొంది. ఒకవేళ తనను, తన దైవం మరచేడా! అయినా గుర్తు చేసి చూద్దాం అంటూ లేని ఓపిక తెచ్చుకుంటూ......

"నేరం......నే చేసినా నేరమేదైనా ఉంటే, అది నేను మీ రాణిని కావాలని కోరుకోవడమే"— అంటుంది శిరీష. రాజ ప్రముఖులలోనేకాక— కొలువులోవున్న ప్రజల్లో కూడా కోలాహలం బయలుదేరింది. రాజ ప్రముఖుడు ఒకడు లేచి—"అపాత్రురాలా! ఆపు నీ వాచాలత!" అన్నాడు. మరొకడు లేచి "నీ దురాశ క్షమార్హం కాదు" ఇంకొకడు లేచి "ఇది పట్టమహిషిత్వానికే పన్నాగం!" మరొకడులేచి రాజు వంక తిరిగి—"మహాప్రభూ! తమ సెలవైతే ఇప్పుడే ఇక్కడే ఈ నీచురాల్ని అంతం చేస్తాను" అంటూ తను తమ రాజభక్తిని బాహాటంగా వెల్లడించేరంతా!

"ఆగండి!" అని చెప్పే పురూరవుని కంఠ ధ్వనికి అంతా స్థబ్దులై పోయారు.

"నా అభయం చూసుకొని ఈ అబల తనమనసులోని కోరిక నిర్భయంగా వెల్లడించింది......" అంటూ శిరీష వంక తిరిగి—

"ఇంతేనా! నీవు చెప్పుకునేదింకేమైనా ఉందా!" అని ఎంతో ఆదరంగా అడిగేడు పురూరవుడు.

ఏనాటి పాపమో, ఏనోటి శాపమో తన ప్రేమ దైవం తన నౌక కలవలె మర్చిపోయినట్లు తన కర్థమైంది. తనకు జరిగిన అన్యాయానికి తనే కలవరపడింది. అతని కెలా తన బాధ చెప్పుకోవాలో తెలియక—

సినిమా వార్తలు

"ప్రభూ! ఏ మాయా పొరలు మీ మనసు నావరించాయో నాకు తెలియదుగాని, నే చెప్పగలిగేదేంతైనా, మీరు వినగలిగేది మాత్రం ఇంతే ప్రభూ! కాని మీరు లేనిదే నాకు ఈ లోకమే చీకటి"— అంటూండగానే ఆమె కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగేయి.

"అమాయకురాలా! అంతస్థుకు మించిన ఆశలు పెట్టుకోవడం నీ అవివేకమనుకోక తప్పదు. అయినా నిన్ను క్షమిస్తున్నాను" అన్నాడు పురూరవ చక్రవర్తి.

"ప్రభూ! అంటూ పురూరవుని సమీపించబోయింది శిరీష. రాజభటులు శూలధారులై ఆమె నడ్డగించేరు. ఇది చూసిన పురూరవుడు "నువ్వికలోచ్చు" అనగానే ఆమెలో వేదన ఆగలేదు. ఉరకలువేసి, హృదయాన్ని కలచి వేసింది. ఆ బాధకు తట్టుకోలేక గిర్రున వెను తిరిగి వెళ్ళిపోయింది.

ఈ పై సన్నివేశం శ్రీ సరస్వతీ మూవీస్ అండ్ శ్రీ వెంకటేశ్వర ఫిలింస్ ప్రయివేట్ లిమిటెడ్‌వారు సమర్పించనున్న "శ్రీ సింహాచల క్షేత్ర మహిమ" చిత్రంలోనిది. శిరీషగా కృష్ణకుమారి, పురూరవుడుగా కాంతారావు ఈ సన్నివేశంలో పాల్గొన్నారు. ఇంకా ఈ చిత్రంలో రేలంగి, గిరిజ, రాజనాల, చలం, నాగయ్య, సూర్యకాంతం, నల్ల రామమూర్తి, రాజబాబు మొదలగువారు నటిస్తున్నారు.

ఇప్పటికి ఈ చిత్రం 12 రీళ్ళకుపైగా పూర్తి అయింది. 7 పాటలను రికార్డుచేసి చిత్రీకరించారు. మరో పాట రికార్డు చేసి చిత్రీకరించారు. "డిసెంబరు నెలాఖరుకు ఈ చిత్రాన్ని పూర్తి చేయనున్నట్లు నిర్మాతలు తెలియజేశారు.

ఈ చిత్రానికి మాటలు, పాటలు రాజశ్రీ, సంగీతం: టి. వి. రాజు, ఛాయ: ఆర్. మధు, కళ: బి. ఎన్. కృష్ణ, నృత్యం: చిన్ని సంపత్, కూర్పు: మార్తాండ్, స్టూడియో: వాహిని, విజయ, కథ, దర్శకత్వం: బి. వి. ప్రసాద్, నిర్మాతలు: యస్. ఓ. కోమలిత అండ్ శ్రీ వెంకటేశ్వర ఫిలింస్.

విజయకళ మూవీస్ ప్రొడక్షన్ నెం. 1

నవంబరు 23 వ తేదీ ఉదయం విజయకళ మూవీస్‌వారు తమ ప్రథమ చిత్రానికి పూజ చేశారు. స్క్రిప్టువర్కు చురుకుగా జరుగుతుంది. మాటలు, పాటలు: రాజశ్రీ, సంగీతం: టి. వి. రాజు, నృత్యం: వి. జె. శర్మ, కళ: బి. ఎన్. కృష్ణ, దర్శకత్వం: బి. వి. ప్రసాద్.

సెట్టుమీద దేశద్రోహులు

"రఘూ! మిస్టర్ రఘూ!"

"............"

"రఘూ!"

"ఇంట్లో లేరండి!"


"నన్నిప్పుడు రమ్మని చెప్పారు. సరే ఆయన వచ్చేవరకూ కూర్చుంటాను లెండి"

"హా ఎప్పుడొస్తారో కూడ తెలియదు......"

"పర్వాలేదులెండి. అసలు ముఖ్యంగా మీతో మాట్లాడాలనే వచ్చాను."

"నాతోనా......మీ రెవరు?"

"అన్నీ చెబుతాను. మీరు కొంచెం ఇలా వస్తారా?"



ఇటీవల 'ఆంధ్రసచిత్రవారపత్రిక' వారు నిర్వహించిన అఖిలాంధ్ర నవలారచన పోటీలో 'మనిషి — మిథ్య' నవలా రచనకు ప్రథమ బహుమతినందిన శ్రీ ఆదివిష్ణుకు 10—11—63 వ తేదీ సాయంత్రం బందరు 'కళాప్రగతి' దర్శకులు శ్రీ నందివాడ జగన్మోహన గణేశ్వరరావుచే 'కళాప్రగతి' ఆధ్వర్యాన అభినందన సమావేశము జరుపబడినది. శ్రీ ఆదివిష్ణు ఎడమ నుంచి నాల్గవ కుర్చీలో ఉన్నారు.



ఆంధ్రసచిత్రవారపత్రిక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన శ్రీ బోడపాటి హరికిషన్‌గారిని విజయవాడ పి. డబ్ల్యు రిక్రియేషన్ క్లబ్బువారు సత్కరించిన సందర్భంలో తీసినచిత్రం. వివిధ ప్రముఖులు రచయిత(కుడిప్రక్కవారు)ని ప్రశంసించారు.



శ్రీవాణీ ఫిలిమ్స్ వారి చిత్ర
ప్రారంభోత్సవంలో తీసిన చిత్రం.



జగపతి ప్రొ॥ నెం 3 లో నాగేశ్వరరావు.

"ఆ! ఏమిటీ స్వతంత్రం?"

"ఇంత అందమైన మిమ్మల్ని వదలిపెట్టి ఆ రఘూ తప్ప త్రాగి అడ్డమైన ఆడవాళ్లతోటీ తిరుగుతూంటే......"

"ఆపండి. వారిని నిందిస్తే నే నెంతమాత్రం సహించను"

"మీ రెంత అమాయకులండి. అసలు విషయం తెలుసుకుంటే మీరు......"

"ఏమిటది?"

"ఆయన మిమ్మల్ని వదిలేసినట్టే."

"ఆ!"

"మీరేం విచారించనక్కరలేదు. మీ సౌందర్యం ఎన్నటికీ వృధాగాపోదు. నే నున్నానుగా (చెబుతూ ఆమె చేతిని పట్టుకుంటాడు. ఆమె కొడుతుంది)

"నీచుడా!"

"ఊ! కొడతావా (దగ్గరగా చేరుతాడు) బాగా ఆలోచించు. ఇప్పుడు నిన్నేం చెయ్యాలన్నా చెయ్య గలను."

(ఆమె తన పట్టునుండి విదిలించుకుంటూ)
"నీచుడా! నన్ను వదులు......" (ఆమె తండ్రి భుజంగరావు వీధిలోనుండి వస్తూ చూస్తాడు.)

"జోగిందర్! ఆగు! లీల వంటిమీద చెయ్యి వేశావంటే నీ ప్రాణాలు దక్కవు."

"ఓ! నువ్వా! నా చేతిలో కీలు బొమ్మవి. నోరు మూసుకొని కుక్కిన పేన్లాగ పడుండు. లేకపోతే నీ బ్రతుకు బయట పెట్టేస్తా!"

"నోర్మూయ్! నాకూతురి సుఖంకంటే నా కింకేమీ ఎక్కువకాదు. వెంటనే బయటకు వెళ తావా? లేక పోలీస్‌కి ఫోన్ చెయ్యమంటావా?"

"వెడతా! భుజంగరావ్ ఈ జోగిందర్‌తో విరోధం నీ ప్రాణంతో చెలగాటం. జాగ్రత్త (అంటూ జోగిందర్ కోపంగా బయటకు వెళ్లి పోతాడు)

"నేను చేసిన పాపాలన్నీ నిన్ను పీడిస్తున్నాయి

సినిమా వార్తలు

తల్లీ!" అంటూ భుజంగరావు లీల దగ్గరకు వెళ్తాడు. "రామన్నా!"

"ఏం? బాబూ!"

"ఏం? చేస్తున్నావ్?"

"వచ్చి పది రోజు లయిదిగా బాబూ! పొద్దునే నేమో ఊరెళ్ళటానికి సామాన్లు అన్నీ సర్దు తున్నా!"

"వద్దు రామన్నా! రఘు సంగతి ఏమి తెలియ కుండా అమ్మాయిని ఒంటరిగా విడిచి ఎలా వెడ తాము. మనం పది రోజులవరకూ రావటం లేదని ఉత్తరం వ్రాస్తానులే!"

"అట్లాగే బాబూ!"

* * *

"నీ వెందుకు తెచ్చావ్ నౌకర్లంతా ఏమై పోయారు?"

"మీకు నేను స్వయంగా తీసుకు రావాలనే తెచ్చాను."

"నీ ముఖం నాకు చూపించవద్దని చెప్పలేదూ?"

"ఏమండీ పచ్చగావున్న మన కాపురంమీద ఇంత విరక్తి కలగడానికి నేనేం పాపం చేశానండీ? మీ మనస్సింత మారిపోవడానికి నేనేం అపరాధం చేశానండి?"

"ఆ సంగతి నీకే బాగా తెలుసు!"

"అయ్యో! నన్ను మీరింకా అపార్థం చేసుకుం టూనే ఉన్నారు. ఇంతకూ నేను రాముతో మాట్లా డినందుకేనా మీకింత అనుమానం? మనస్సాక్షిగా చెబుతున్నాను. కొంచెం వినండి!"

"అక్కర్లేదు. నా కంతా తెలుసు"

"చిన్నప్పుడిద్దరం కలిసి మెలిసి తిరిగాము గనుక చనువుతో మాట్లాడానండి. అది తప్పైతే నన్ను క్షమించండి!"

"నీ నటన నాకు అర్థం కాలేదనుకోకు."

"దైవసాక్షిగా చెబుతున్నాను, రాముా నేనూ చిన్నప్పటినుంచీ కలిసి మెలిసి తిరిగిన మాట వాస్త వమే. కాని మన వివాహమైన మరుక్షణంనుంచీ రామూ నాకో అన్నతో సమానం. మీరేనా సర్వ స్వంగా భావించి పూజిస్తున్నాను"

"అవు నీ ధర్మాలాపాలు. కళ్ళారా చూచిన దాన్ని కనికరించడం జరగని సంగతి. ఇక మనిద్దరి మధ్యా భార్యా భర్తల సంబంధం అసంభవం!"

"భార్యకు భర్త తరువాతే సకలైశ్వర్యాలూను. మీ అనురాగమే దూరమైన రోజున నా కెందుకీ సంపద. మీ చేతులతోనే ఇంత విష మివ్వండి. సంతోషంగా తీసుకుంటాను."

"ఆగు! నా పరువు ప్రతిష్ఠలు మంట గలి పావు. నన్ను సర్వ నాశనం చేశావు. నీ సాంగత్యంతో స్వర్గ సుఖం లభిస్తుందనుకున్నాను. అంతా నరక యాతనగా మారింది."

"నాకు చిన్నతనంలోనే తల్లి దూరమైంది. ఇప్పుడు నాకు తల్లీ, తండ్రీ, దైవం అన్నీ మీరేనని నమ్ముకునివున్న నా బ్రతుకు నలుగురిలో నవ్వుల పాలు చేస్తారా! నా మాట వినండి!"

"లీలా......నా మనసు విరిగింది. తిరిగి అతకడం కష్టం. నా త్రోవను నన్ను పోనియ్"

ఈ రెండు సన్నివేశాలూ శ్రీ రామా పిక్చర్సు వారి "దేశద్రోహులు" చిత్రంలోనివి. ఈమధ్య వాహినీ స్టూడియోలో చిత్రీకరించారు. రాముగా యన్. టి. రామారావు, రఘుగా కాంతారావు, లీలగా దేవిక, జోగిందర్‌గా రాజనాల, భుజంగ రావుగా మిక్కిలినేని పాల్గొన్నారు. వీరుగాక ఇంకా పెరుమాళ్ళు, రేలంగి, రమణారెడ్డి, బాలకృష్ణ, చలదవాడ, రామకోటి, రాజబాబు, రామకృష్ణ, సత్యనారాయణ, శోభన్‌బాబు, ధూళిపాళ, జి. ఎన్. స్వామి, దేవిక, జానకి, గిరిజ, మాలతి, జెమినీ చంద్ర వర్ధన, గీతాంజలి, బేబి ఇంద్రాణి, గంగారత్నం, వల్లం నరసింహారావు, కోళ్ల సత్యం, బి. యన్. ఆర్, ఇద్దరు నూతన నటీమణులు, మరియు సంగీత దర్శకులు యస్. రాజేశ్వరరావుగారు కూడా నటి స్తున్నారు. ఈ చిత్రానికి శ్రీ సాయిరాం, మాటలు శ్రీ గిరిరాజు రామారావు అండ్ ఆరుద్ర, పాటలు: మల్లాది రామకృష్ణశాస్త్రి అండ్ ఆరుద్ర, సంగీతం: యస్. రాజేశ్వరరావు, ఛాయ: వరదరాజన్, నృత్యం: చిన్నీ సంపత్, వి. జె. శర్మ, రాజు అండ్ ధర్మరాజ్, కళ: యస్. వి.యస్. రామారావు, కూర్పు: కృష్ణ అండ్ గోపాల్, స్టూడియో: విజయా, వాహినీ, ఛాయాగ్రహ పర్యవేక్షణ, నిర్మాత, దర్శకుడు: బోళ్ల సుబ్బారావు.

ఈ చిత్రాన్ని డిశంబరు ఆఖరు వారంలోగాని, జనవరిలోగాని ఈస్టిండియా ఫిలిం కంపెనీవారు ఆంధ్రప్రదేశ్, మైసూర్‌లలో విడుదల చేయ నున్నారు.

హైదరాబాదు నగరంలో ప్రముఖ వ్యాపారి, ధనికుడు అయిన రఘు ఇంట్లో ఈ పై రెండు సన్నివేశాలు చిత్రీకరించారు.

సెట్టుమీద "దేశద్రోహులు"

అర్బత్ నాట్ డ్రెమెటిక్ ఎసోషియేషన్ ట్రూవ్ మెంబర్లు సోమయ్య, శివమ్, మూర్తి వగైరాలు కూర్చొని బాతాఖానీ కొడుతుంటారు.

"ఒరేయ్ సోమయ్యా ! మొన్న హీరోయిన్ వేషం వేయడానికి ఒక అమ్మాయి వచ్చింది చూశావా !"

"చూశా ! చూశా ! చాలా బాగుంది. చట్టి ముక్కు, దబ్బ మొఖం !"

"వెళ్లండిరా చెప్పారు కబుర్లు, ఏం అమ్మా! ఆ అమ్మాయి కేం ? ఫస్టు క్లాసుగా ఉంది."

"ఈయన పనే బాగుందిరా ! ఎడా పెడా కేవర్సు."

"అదెల్లా గరోయి."

"ఎల్లాగేంట్రా, ఇంటికా అద్దె లేదు. శరణాలయంలో ధర్మ పిండం. కరుణాలయంలో మజా!"

నాటక కంపెనీ మిత్రులు పై విధంగా అనుకుంటున్న మాటల్ని కథానాయకుడు వింటాడు. బాధపడతాడు. ఎదురుగా కరుణ ఇంట్లో ఆడుకుంటున్న చెల్లెలు వాణీని కోపంగా పిలుస్తాడు.

"ఎక్కడికి వెళ్లావ్ ? ?"

"కరుణక్కాయ్ గారింట్లో ఆడుకుంటున్నా నన్నయ్యా ! ఇదిగో చూడు అక్కయ్య కొత్త బొమ్మలిచ్చింది."

ఇంకెప్పుడూ కరుణగారింటికి వెళ్లవద్దని వాణీని కొడతాడు. ఎదుట ఇంట్లోంచి కరుణ చూసి చాల బాధపడుతుంది. బయట సోమయ్య, ఇతర బృందం అంతా కూడా చాల బాధపడతారు.

"అరెరే ! అనవసరంగా పాపం పిల్లని కొట్టేస్తున్నాడు."

"ఇవ్వాళ నుంచి నువ్వు వాళ్ల ఇంటికి వెళ్లావంటే ప్రాణాలు తీసేస్తాను. జాగ్రత్త."

తర్వాత ఆవేశం తగ్గుతుంది. చెల్లెల్ని చూస్తాడు. చాలా బాధపడతాడు. తన తల్లి చనిపోయేటప్పుడు చెల్లెల్ని తనకు అప్పజెప్తూ చెప్పిన మాటలు గుర్తుకు వస్తాయి.

"నాయనా ! రామూ ! వాణీ చిన్న పిల్ల— దాన్నెలా చూసుకుంటావో."

రామూ ఆవేశంతో చేసిన పనికి పశ్చాత్తాపంతో ఇంక అక్కడ ఉండలేక బయటకు వెళ్లిపోతాడు.

* * *

మాష్టర్ గోపీనాథ్ (డ్యాన్సు డైరెక్టర్)గారిల్లో అతని నాటక బృందం అంతా హాల్లో పైలా యించి బాతాఖానీ కొడుతుంటారు.

"ఒరేయ్ ! ఇవ్వేళ గురువు స్పెషల్‌గా మేకప్ అవుతున్నాడు."

"అవునులోయ్ !"

"అయితే ఏదో క్రొత్త హీరోయిన్‌ను పట్టాడన్న మాటే !

"ఒకవేళ ఏదీ దొరక్కపోతేనో ?"

"ఏముందీ వేసిన పౌడరు దండగే. . . .

ఇస్త్రీ డబ్బులు దండగే. . . ."

"అందుకే త్వరగా నాటకం యేర్పాటు చెయ్యి గురూ !"

"డడడా. . . .డడడా. . . .డడడా. . . ."

"అబ్బబ్బ ! ఏమిట్రా కాకిగోల ?"

"అవును కాని గురూ ! ఏదైనా పిట్టని పట్టినట్టున్నావేం ?"

"అవున్రా అక్కడికే ప్రయాణం !"

"గురూ ! నాకు తెలీక అడుగుతాను. ఈమె కూడా మన పాత హీరోయిన్ లాగ కాస్త పేరు రాగానే ఎగిరిపోదు కదా !"

"ఒరేయ్ ! శివం ! అది ఎందుకు ఎగిరిపోతుందో తెలిసికొని ఆ పని కాస్తా మనమే చేస్తే పోలా !"

"అంటే ?"

"అంటే ఏముందిరా ! వెరీ సింపుల్. దాన్ని మన మిద్దరం పెళ్లాడేద్దాం.

"ఛ. . . .ఛా !"

"అంటే మువ్వు గాని— నేను గాని"

"ఒరేయ్ ! మీ వళ్లు ఏమయినా చిమచిమలాడుతుందా ? తీటగా ఉందా ? జాగ్రత్త !"

"అదేంటి గురూ అలా అనేశావ్ ?"

"మరి కాకపోతే ఏమిట్రా ? నే వెదుతుంది నాటకంలో హీరోయిన్‌కోసం గాదురా. నా జీవితంలో హీరోయిన్ కోసం తెలిసిందా."

"గురూ నువ్వా గొడవలో పడితే నాటకాల సంగతి"

"ఆ అమ్మాయిని పెళ్లాడేదాకా నాటకాలు గీటకాలు బంద్."

"మరి నాటకాలు ఆడకపోతే మన బ్రతుకు కాటకమే."

"నోర్ముయ్‌రా కీటకం. టిఫిన్ కారియర్‌లు వస్తాయి. మీరు హాయిగా ముక్కుదాకా పట్టించి, తిరుబడిగా నిద్రపొండి. నా కోసం చూడనక్క





శ్రీ శంభుఫిలిమ్సు వారి 'పూజాఫలము' చిత్రంలో సావిత్రి, జమున

సినిమా వార్తలు

ర్లేదు. నే వస్తా!"

"టాటా !"

"చీరియో !"

"గుడ్‌లక్". . . .

గోపీనాథ్ హుషార్‌గా బయటకు వస్తాడు. విజిటర్సు రూమ్‌లో 18 సంవత్సరాల అమ్మాయి ఉంటుంది.

"నమస్కారమండీ !"

"నమస్కారమండీ ! నా పేరు కరుణ గోపీనాథ్ గారంటే తమరేనా ?"

"ఆ. . . ఆ. . . . నేనేనండి— కూర్చోండి."

"నేను ఈ బ్లాకులో ఉమెన్సు వెల్‌ఫేర్ ఆఫీసరుగా పనిచేస్తున్నాను. ఈ చుట్టుపట్ల సరియైన వైద్య సౌకర్యాలు లేక ఎంతోమంది— ముఖ్యంగా స్త్రీలు, శిశువులు చాలా ఇబ్బంది పడుతున్నారు. అందుకని మా బ్లాకువాళ్లమంతా కలిసి హాస్పటలు స్థాపించడానికి పూనుకుంటున్నాము."

"వెరీగుడ్, బాగుంది. అలాగే స్థాపించండి."

"ఈ సందర్భంలో మేము కొంత సొమ్ము వసూలు చేస్తే మిగతాది సర్కారు ఇస్తామని ప్రామిస్ చేశారు, మీరు పూనుకుంటే మా ప్రయత్నం విజయవంత మవుతుందనే ఆశతో వచ్చాను."

"నావల్లేమవుతుంది చెప్పండి ?"

"అలా అనకండి— మీరు ప్రఖ్యాత కళాకారులు, మీ నాటక బృందంతో ఒక్క బెనిఫిట్ పెర్‌ఫార్‌మెన్సు ఇస్తే ప్రజలు మీకు ఎంతో ఋణ పడి ఉంటారు."

"నావల్ల ఈ సౌకర్యం ఏర్పడుతుందంటే తప్పకుండా సహకరిస్తాను. అలాగే ఏర్పాటు చేసుకోండి."

"థాంక్సు ! మిగతా ఏర్పాట్లన్నీ చేసుకుని మీకు ముందుగానే ఆ తేదీ తెలియపరుస్తాము. సెలవు"

"మంచిదండీ !"

ఈ పై రెండు సన్నివేశాలు శ్రీరామా పిక్చర్సు వారి "దేశద్రోహులు" చిత్రం లోనివి. సంగీతం: ఎస్. రాజేశ్వరరావు, ఛాయ : వరదరాజన్, ఛాయాగ్రహ పర్యవేక్షణ, నిర్మాత, దర్శకుడు : బోళ్ల సుబ్బారావు.

సి. ధర్మారావు. ★

అవీ - ఇవీ - అన్నీ

కాంతారావుకు సన్మానము

జనగామలో, నవంబరు 10 న ప్రముఖ సినిమా నటులు శ్రీ కాంతారావుగారికి జ్యోతిర్మయి నాటక కళా సమితివారిచే ఘన సన్మానం శ్రీ పెద్ది నారాయణగారి అధ్యక్షతన జరుపబడినది. కళాసమితి అధ్యక్షులైన సి. హెచ్. హనుమంతరావుగారు ఆహ్వానితులకు పరిచయం చేసిరి. శ్రీ చిట్టిమళ్ల శంకరయ్యగారు నటరాజ విగ్రహము, సన్మాన పత్రము సమర్పించిరి. శ్రీ కాంతారావుగారు తమ జీవిత విశేషములను వివరిస్తూ, ఉన్నత స్థాయికి చేరిన వివరాలను అభిభాషించిరి. పదివేల ప్రేక్షకుల సమక్షంలో వి. రా.మూర్తిగారి దర్శకత్వమున రుద్రశ్రీగారి "బంగారం" గేయ నాటికన్న మరియు శ్రీ భమిడిపాటి రాధాకృష్ణగారు రచించిన "పేటెంటు మందు" ఏకాంకికను ప్రశంసనీయంగా ప్రదర్శించిరి. జాతీయ గీతంతో సభ సమాప్తమైనది అని చిట్టిమళ్ల శంకరయ్యగారు రాస్తున్నారు.

ఘంటసాలకు సన్మానం

ప్రముఖ సినీ సంగీత దర్శకులు శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావుగారికి ఉయ్యూరు శ్రీ లలిత కళా సమితివారు ఉయ్యూరు కిసాన్‌హౌస్‌వద్ద ఘన సన్మానం చేశారు.

సన్మాన సభకు డాక్టరు కె. రంగారావుగారు అధ్యక్షత వహించారు. శ్రీ రామకుమారవర్మ, శ్రీ మోపర్రుదాసుగార్లు శ్రీ ఘంటసాలవారి గాన మాధుర్యాన్ని గూర్చి మాట్లాడిరి. కార్యదర్శి శ్రీ శివరావు మన్నె అభివందనాలతో సభ జయప్రదంగా ముగిసెను.

* * *


నవంబర్ 21 వ తేదీనాడు మద్రాసు రసిక రంజని సభ హాలులో శ్రీ ఎస్. కె. ఆర్. అయ్యర్ గారి మనుమరాలు, కుమారి శోభ భరతనాట్యం అరంగేట్రం జరిగింది. ముఖ్యమంత్రి భక్తవత్సలం అధ్యక్షత వహించారు.

కాశీనాథ్ తాతా

మద్రాస్‌లో తెలుగు మహాజన సమాజం వారి ఆధ్వర్యాన 1—12—63 న వసంత బంగళా భవనంలో వన భోజనం జరిగింది. ఉదయం శ్రీ జోగయ్య పంతులు ఫ్లూట్ వాయించారు. తర్వాత శ్రీయుతులు ఎ. వి. ఎల్. నరసింహారావు, విఠల్‌లు లలిత సంగీతం వినిపించారు. మధ్యాహ్నం 2 గంటలకు శ్రీ కాశీనాథ్ తాతా (సినీ నటులు) సుమారు గంటన్నర సేపు మిమిక్రీ మరియు ఇతర వినోద కార్యక్రమాలతో ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించి పలువురి ప్రశంస అందుకున్నారు. ★

సుశీల గ్రహించిన సత్యం-6 దేవిక





Edited, Printed and Published by S. Radhakrishna at the AndhraPatrika Press; 6 &7 Thambuchetty Street Madras-1. Chief Editor S. Sambhu Prasad.

వాణిశ్రీ



Regd No. 4479 . ANDHRA SACHITRA VARA PATRIKA.



విజయ